ఆంధ్ర సచిత్ర వారపత్రిక

12-7-68
40 పైసలు





క్రొత్త సూత్రం 'గోయా' మీరు కనే కలల టాల్కం పౌడరు. తక్కిన టాల్కులకన్న ఇది శీతలకగా, ఆహ్లాదకరంగా ఉంటుంది.


ఇంకను, 'గోయా' నిపుణుల సాయంతో. సుగంధితమైన యీ 'టాల్కు' రోజంతా హాయినిస్తూ, పరిమళాన్ని వెదజల్లుతుంది.

అందాల 'బ్లాక్ రోజ్' పువ్వుల్లా పరిమళించే గార్డీనియా, 'మురిపించే' 'పాస్‌పోర్ట్'లలో మీక్కావలసింది ఎన్నుకోండి!

జ్ఞాపకం వుంచుకోండి, ఈ మూడున్నూ చిరకాలం మన్నే కొత్త నిడుపాటి డబ్బాలలో దొరుకుతున్నాయి.

అట్లాంటిస్ (ఈస్ట్) లిమిటెడ్

(ఇంగ్లండులో స్థాపితం)



క్రొత్త సూత్రంతో తయారయిన ఆహ్లాదకరమైన టాల్కు ఇప్పుడు పొడుగైన క్రొత్త టిన్నులలో లభిస్తోంది

AGC-5 TE


సుగంధముతో గూడిన టాల్కు తయారుచేసే

గోయా

పారిస్

లండన్

న్యూయార్క్



వారు దృష్టిలో పెట్టుకొని అనాథల యొక్క జీవితమును చాల చక్కగా రచించిరి. రచయితకు నా అభివందనములు.

షాజహాన్ (కాకినాడ—2.)

* * *

ఈ వారం (31—5—68) పత్రిక రాజశ్రీ ముఖచిత్రం అందంగా వుంది. "రెక్కలొచ్చిన పక్షి" "అన్న" కథలు ఒకదానిని మించి ఒకటి బాగున్నవి. "అన్న" కథ చివరి పేజీ చదువుతుంటే నా కళ్ళలో నీళ్ళు తిరిగాయంటే నమ్మండి. "హృదయం చిగిర్చింది" సీరియల్ అయిపోయిందని చూసేసరికల్లా మనస్సు అదోలా ఫీల్ అయింది. ఇంకా వుంటే బాగుండుననిపించింది. ఏవో ఒకటి, రెండు తప్పించి కార్టూన్లు ఏమంత బాగుగా వుండుటలేదని వ్రాయుటకు విచారిస్తున్నాను.

సమయమంతుల సత్యనారాయణ (పిఠాపురం)

* * *

7—6—68 నాటి పత్రిక యొక్క ముఖచిత్రం, నటి హేమమాలిని చూడగానే నాకు ఎంతో ఆనందమయింది. మీ పత్రిక చేతికి తీసుకొని చదవడానికి ప్రారంభించితిని.

మీరు ప్రచురించిన కథ, మారీమారని మనుష్యులు ఎంతో బాగుంది.

ఆ కథను చదువుతుంటే మరిమరి చదవాలని పిస్తుంది మీరిటువంటి కథలు ప్రచురించి మాకు ఆసక్తిని కలిగిస్తారని ఆశించుచున్నాను.

ఎస్ ఎ రవూఫ్ ఆశిక్ (గుంటకల్)

సీరియల్స్

ఈ వారం (7—6—68) పత్రికలో కథలు కార్టూన్సు ఎంతో ఆకర్షణీయంగా వున్నాయి, "హృదయం చిగిర్చింది", "చీకటి కడుపున కాంతి". సీరియల్స్ ఇంత త్వరగా అయిపోయినందుకు

ఉత్తరాలు

నాకు చాలా బాధగా వుంది. ఇంత మంచి సీరియల్స్ ప్రచురించిన మీకు మా అభివందనములు.

హెచ్. రజనీకాంతారావు (సికింద్రాబాద్)

* * *

ఈవారంతో ముగిసిన "చీకటి కడుపున కాంతి" సీరియల్ చాలా బాగుంది. రచయిత రామచంద్ర, వారిజ పాత్రలను గొప్పగా సృష్టించారు. కాని వారిజ పాత్రకు న్యాయం చేకూర్చలేదేమోననిపిస్తుంది శ్రీ ఆనందరామం గార్కి మా అభివందనములు.

యస్ వెంకటరావు (కటక్)

న్యూఢిల్లీ లేఖ

31—5—68 తేది ఆంధ్రసచిత్రవారపత్రికలో ప్రతివారం న్యూఢిల్లీ లేఖ చాలా బాగా వుంటుంది. ఈవారం 'అన్న,' 'రెక్కలొచ్చిన పక్షి' కథలు చాలా బాగా వున్నవి. ఇకసీరియల్సు. 'చీకటికడుపున కాంతి, హృదయంచిగిర్చింది' పెద్దకథ 'విడిన మబ్బు తెరలు' చాలా బాగావున్నవి. ముఖ్యముగా సినిమా శీర్షికలో 'మీకు తెలుసా?, సినిమాడైరీ' చాలా చక్కగా పాఠకులకు తెలియపర్చుతున్నారు.

బి. మల్లికార్జునరావు, (మండపేట)

ఆవేశాలూ—అపరాధాలూ

నా వూహా ప్రపంచానికి దగ్గరగావున్న శ్రీ సుక్తాంకర్ గార్కి నా హృదయపూర్వక వందనాలు. 24—5—68 పత్రికలో "ఆవేశాలూ—అపరాధాలూ" శీర్షికలకి వ్రాసిన 'లాల్ బహదూర్ హత్య' నాలోవున్నదాన్ని మరికొంచెం 'ఏదో'చేసి నా వూహాకి దగ్గరయ్యేరు. అంతమంచి 'లాల్'ని యింత నిర్దయగా హత్యచేసిన ఆ నరరూప రాక్షసిని ఏవిధంగా శిక్షించినా పైలోకంలో పుణ్యమూర్తులవుతారు. కానీ ....ఎలాగ?..... అంతాశూన్యం.. ..! స్వామి ద్రోహం. ... ..!!

ఎస్. రామలింగస్వామి, రాయపూర్ (ఎం పి)

* * *

21-6-68"ఆంధ్రసచిత్రవారపత్రిక"చదివాను. చాలా బాగుంది. యిందులోని ఆవేశాలు—అపరాధాలు శీర్షికలో "సతీసహగమనం" చాలా బాగుంది. అది ఎంతోబాధను కల్గించింది నాటి మూఢనమ్మకాలవలన నారీ లోకం ఎంతబాధపడిందో యీకథ వ్యక్తం చేసింది. రాజారామమోహనరాయలు యీ మూఢ నమ్మకాలను మార్చిన తర్వాత స్త్రీజాతికి న్యాయం చేకూరింది వి యస్. సుక్తాంకర్ చక్కనికథని పాఠకులకి అందించారు."నారయ్య నిరాహారదీక్ష" బాగుంది. కథ ఎంతో నవ్వు పుట్టించింది. నేడు అనేక సంఘాలు జన్మిస్తున్నాయి. వాటిలో వంటవాళ్ళసంఘంలేదు. అది మీరు సృష్టించి చక్కని కథను వ్రాశారు.

తంగెళ్ళ వెంకటసూర్యనారాయణ శర్మ, (విజయవాడ)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 12—7—'68
కీలకనామ సం॥ ఆషాఢ మాసం బహుళ తదియ
సంపుటము: 60 సంచిక: 44

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు:
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
6, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

పోస్టుద్వారా

సంవత్సర చందా	26.00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6.50

విషయానుక్రమణిక



నీ మాటలు
నువ్వు తిను.
తింటావా?
టి.వి.థామస్
రుజువుకాని ఆక్షేపణలు
నంబూద్రిపాద్
ఆంధ్రప్రదేశ్
ముని
యాత్రికుల కోసం
శ్రమపడు
తున్నాడు
ముఖ్యమైన వ్యక్తి
గుర్రాన్ని నీటి దగ్గరికి
తీసుకు వెళ్లొచ్చును. కాని
త్రాగించడం ఎవరితరం?
ప్రజలు
మద్యనిషేధం
పై మొరార్జీ
అభిప్రాయాలు
OOMMEN

కాశ్మీరులో సమావేశం ముచ్చట్లు

శ్రీనగర్‌లో జాతీయ సమైక్యతా సమావేశం అనే మూడురోజుల ముచ్చట ముగిసింది క్రికెట్ పరిభాషలో చెప్పాలంటే 'డ్రా' అయింది—అంటే ఏ జట్టూ గెలవలేదన్న మాట.

ఈ ముచ్చటకోసం కాంగ్రెసు ఒక తతంగాన్ని తయారుచేసింది. ఇదే స్వాతంత్ర్యం మునుపు అయితే ఒక నాయకుడు పతాకాన్ని ఆవిష్కరించేవారు, మరొకరు స్వాగతోపన్యాసం చదివేవారు, మూడవవారు సమావేశాన్ని ప్రారంభించితే నాలుగవ ప్రముఖుడు అధ్యక్షత వహించటం జరిగేది. ఇక మిగిలిన ఉపనాయకులంతా మాలలు వెయ్యటం, ధన్యవాదాలు చెప్పటంతో సంతృప్తి పడవలసి వచ్చేది.

ప్రస్తుతపు సమావేశంలో కాశ్మీరు ముఖ్యమంత్రి స్వాగతోపన్యాసం చదివారు; ప్రధానమంత్రి శ్రీమతి గాంధీ ప్రారంభోపన్యాసం చదివారు ఇక సమావేశంలో ఇతర ఆకర్షణలు — జనసంఘం, కమ్యూనిస్టుల మధ్య యుద్ధాలు, సుభద్రా జోషీ జనసంఘ నాయకులమధ్య ఘర్షణలు. కాంగ్రెసువారు ఎప్పటిలాగే కుల, వర్గ దురభిమానాలని ఖండించారు కాని తమ వర్గాలని, లాబీలని సృష్టించుకున్నారు

పి. ఎస్. పి. వివిధ 'సేనల'ని ఖండించింది, కాని వాటితో స్నేహం చేస్తూ ఉంటుంది.

కుడి కమ్యూనిస్టుపార్టీ మతపక్షాలని బహిష్కరించాలని అన్నది — అంటూనే జనసంఘంతో బాటు ప్రభుత్వాలని నడుపుతోంది. ఎన్నో ఆరోపణలు ఎజెండాలో కనిపించాయి కాని నేరస్తులు (లేక ముద్దాయిలు) ఎవరు? అందరూ నేరస్తులయితే ఆరోపించేవారి ప్రయోజనం ఏమిటి? ఈ సమావేశంలో పాల్గొన్న జనసంఘం హిందవజాతి ఒకటే భారతజాతి అంటుందికదా!

భారతజాతి చైతన్యం అంటే ఏమిటో గ్రహిస్తేకాని భారతజాతి ఐకమత్యం అంటూ ఉండదని జనసంఘ పక్ష్యులు శ్రీ బలరాజ మాధోక్ పార్లమెంటులో అన్నారు

'జాతి విరోధ శక్తులతో, విదేశ విశ్వాసాలు గల వర్గాలతో బేరాలు కుదుర్చుకొని, వారిని శాంతింపచెయ్యాలని చూస్తే జాతి సమైక్యత కుదరదు,' అని ఆయన మహమ్మదీయులని మనసులో పెట్టుకుని మాట్లాడుతూ ఉండి ఉండవచ్చు.

ఈ సమావేశానికి మహమ్మదీయులు వచ్చినట్లు కనిపించదు వచ్చినా చర్చలలో పాల్గొన్నట్లు కనిపించదు

కాంగ్రెసువారు కుల మతాభిమానాల సహాయంతో ఎన్నికలు గెలవటానికి ప్రయత్నించటానికి ఎన్నడూ వెనుదీయలేదు. కాంగ్రెసుని పడగొట్టటానికి కమ్యూనిస్టులుకూడా ఈ పద్ధతులని అనుసరిస్తూ వచ్చారు. కాంగ్రెసుమీద నమ్మకం పోయిన మహమ్మదీయులు కమ్యూనిస్టుల శరణు చొచ్చారు. వారు జనసంఘంతో చెయ్యి కలపటంతో ఈ నమ్మకంకూడా నాశనం అయింది, అందుకనే మహమ్మదీయ సంఘాల బలం క్రమంగా పెరుగుతోంది. తమకి తామే రక్ష అని అనుకుంటున్నారేమో వారు. మత కలహాలు ఇందుకనే ఎక్కువ అవుతున్నాయేమో!

ఉప ప్రధానమంత్రి శ్రీ మొరార్జీ దేశాయి మైనారిటీలు ప్రతి మెజారిటీ నిర్ణయాన్ని వీటోచేసి చెడగొట్టటం బాగా లేదన్నారు మెజారిటీ అభిప్రాయాలని మన్నించాలన్నారు. బహుశ మదరాసు న్యాయమంత్రి భాషా సమస్యగురించి చెప్పిన విషయంగురించి ఆలోచిస్తూ ఇలా మాట్లాడేరేమో శ్రీ దేశాయి 'కేంద్ర బోర్డులు' ఇకమీద ఎపెక్స్ సంస్థలుగా కాక 'రాష్ట్రబోర్డుల'తో కలిసి పనిచేస్తాయనే ప్రకటన ఈయన వత్తిడివల్లనే వెలువడింది. దక్షిణప్రాంతంలో శ్రీ దేశాయ్ నడవడిచూస్తే హిందీ ఇతరప్రాంతాల వారిమీద ఆయన రుద్దాలని ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తుంది.

జర్మనీలో బావారియా దేశంవారు తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంటున్నారు. రష్యాలో మహమ్మదీయుల జీవిత విధానంలో పెద్దమార్పులు రావటం చాలా కష్టమయిపోయింది.

'విప్లవం' అయినప్పటినుంచి రష్యా అధికారులు మహమ్మదీయ సమాజంలో ఆధునిక భావాలకి విరుద్ధంగా ఉన్న అంశాలన్నిటినీ తీసుకుని ఇస్లాం సారాంశం వీటిలోనే ఇమిడిఉందని ప్రచారంచేస్తూ వచ్చారు.

వివాహ విధానాలు, పర్దా, బహుభార్యాత్వం, బాల్యవివాహాలు — ఇవన్నీ మహమ్మదీయ సాంప్రదాయాలంటూ సోవియట్ పరిపాలకులు ఖండిస్తూ వచ్చారు.

రష్యాలోకూడా మహమ్మదీయులకీ, ఇతరులకీ మధ్య పూర్తి సమైక్యత కుదురుతున్నట్లు కనిపించదు. సాంఘికంగా అక్కడ ముసల్మానులు తక్కినవారితో కలవటం లేదు ఫాక్టరీలలో, సేనలలో, కళాశాలలలో కలిసిమెలిసి ఉన్నప్పటికీ సంబంధ బాంధవ్యాలలో మాత్రం అంత మార్పు రావటం లేదు వర్గాంతర వివాహాలు అరుదుగా ఉంటున్నాయి. మహమ్మదీయ పురుషులయినా ఇతరవర్గాల వనితలని పెళ్లిచేసుకుంటున్నారు కాని మహమ్మదీయ వనితలు ఎక్కడోకాని ఇతరులని వివాహం చేసుకొనటం లేదు

ఇంకా విచిత్రమయిన విశేషాలు కొన్ని గమనించవచ్చు. సంఘంలో 'స్థాయి' పెరిగిన కొద్దీ పర్దా పద్ధతులు అధికం అవుతాయి; బహుభార్యాత్వం చాటుగా (చట్ట విరుద్ధం కాబట్టి) కూడా పెరుగుతుంది. (రెండవ, మూడవ భార్యలపిల్లలని మొదటి భార్య పిల్లలకింద జమకడ్తారు. దీనికి ముల్లాలు తోడ్పడుతూ ఉంటారు)

జార్ల కాలంనుంచి నేటిదాకా రష్యాలో మహమ్మదీయులని సమాజం మొత్తంలో ఇముడ్చటానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కుటుంబ బంధాలు అంత తేలికగా సడలిపోవు. పాశ్చాత్య కుటుంబ విధానాలు ఇక్కడివారికి బాగా నచ్చినట్లు కనిపిస్తుంది.

1906 నుంచి భారతీయ ముసల్మానులు తమ మతానికీ, సంస్కృతికీ, భాషకీ రక్షణ కావాలంటూ వచ్చారు.

1906 లో మహమ్మదీయులు విడి 'నియోజకవర్గాలు' అడిగారు. భారత రాజ్యాంగం తయారుచేసేరోజుల్లో ఈ కోరికని వారు అంత తీవ్రంగా అడగలేదంటే వారికి కాంగ్రెసుపట్ల ఏర్పడ్డ విశ్వాసంవల్లనే. శాసనసభల్లో వారి ప్రతినిధుల సంఖ్య పడటమేకాక కేంద్ర ప్రభుత్వం విధానంమారుతూ రావడంతో కాంగ్రెస్ పట్ల వారి విశ్వాసం సన్నగిల్లిందంటే అతిశయోక్తికాదు. శ్రీ దేశాయి చెప్పినట్లు అంతా మెజారిటీ నిర్ణయమే అయితే మైనారిటీలు సమైక్యతా సమావేశాలకి వెళ్ళకపోవచ్చు. శ్రీ జిన్నా కాంగ్రెసు ప్రజాస్వామ్యాన్ని 'హిందూరాజ్యం' అన్నారు; శ్రీ దేశాయి ప్రజాస్వామ్యం 'హిందీ రాజ్యం' కావచ్చు.

వార్తాపత్రికలలో 'నాలుగు పాయింట్ల మత సిద్ధాంత నిర్మూల యుద్ధం' అనే పతాక శీర్షికలు పడ్డాయి. ప్రార్థన మందిరాలవద్ద రాజకీయ సమావేశాలు పనికిరావన్నారు. అయితే, ఒక ప్రార్థన సమావేశం తర్వాత రాజకీయోపన్యాసం జరిగితే? ప్రార్థన పనికిరాదనలేరుకదా! పాకిస్తాన్ సృష్టికి అధికంగా తోడ్పడ్డవి ప్రార్థనానంతర రాజకీయోపన్యాసాలేకదా? హైందవాలయాలలో ఇది సాధ్యంకానే కాదుకదా?

కేంద్రప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలూ కలిసి చారులని నియమించి మతకల్లోలాలని రేపేవారిని కనిపెట్టాలన్నారు. సేఠ్ గోవిందదాసు, పూరీ శంకరాచార్యులవారు బహిరంగంగా గోవధనిషేధానికి పోరాడుతామంటున్నారు. (గోవధనిషేధం గురించి సర్కార్‌కమిటీ నివేదిక ఇంకా రావాలి. ఇది గనుక గోవధ నిషేధించకపోతే వయివారు తమ ఉద్యమం లేవదీస్తారన్నమాట.) ఇది మతప్రచారమే కదా? ఈ హడావుడిలో లాలా గుల్జారీలాల్ నందా కూడా పాల్గొంటున్నారు.

మతావేశాలని రేపేవారిని ఎన్నికలకి నుంచోనివ్వమంటున్నారు. మతావేశాలని రేపే వారికిది ఒకలెక్కకాదు. వారు ఎలాగూ తమ ఉద్యమాలని, అల్లర్లనీ కొనసాగిస్తూనే ఉంటారు.

ఇంకా పెద్దసమస్య—జాతి సమైక్యత సాధించేముందు శ్రీమతి గాంధీ తమమంత్రివర్గం సమైక్యతని సాధించటం మంచిది.

శ్రీమతిగాంధీ భారత సమాజంలో 'భయం' క్రమంగా అధికం అవుతున్నదన్నారు. కొందరు భారతీయులు తమ జీవనోపాధినిగురించి భయపడటం సిగ్గుచేటు అన్నారు. వీరు తమ మతంవల్ల ఈ భయాందోళనకి గురిఅవటం గురించి అసలు మాట్లాడారు గాని భాషమాట ఏమిటి?

ఈ సమస్యలన్నీ ఈనాడు హఠాత్తుగా పుట్టుకొచ్చినవికావు 'సేన' లని గురించి ఎందరో ఎన్నోవిధాలుగా రాస్తున్నారు. ముందు లోకఖ్యాతిని సంపాదించుకున్న సేన రాష్ట్రీయ స్వయంసేవక సంఘం. మహాత్మాగాంధీ హత్యతర్వాత రా. స్వ. సే. సం. అజ్ఞాతవాసంలోకి వెళ్ళవలసి వచ్చింది. మళ్ళీ బయటికివచ్చింది. ఇప్పుడు ఇతర సేనలు ఎన్నో బయలుదేరాయి. మత ప్రధానమయిన సంస్థలని బహిష్కరించాలిగాని వాటిమీద కావలాకాసే సంస్థలని సృష్టించి లాభంలేదు. అన్నిరకాల మత వ్యాపారాలనీ గుర్తించి శాసనాలని తయారు చెయ్యాలి. అయితే, మన శాసన సభ్యులలోనే ఎందరో మత దురభిమానం కలవారు ఉన్నప్పుడు ఈరకం శాసనాలని సృష్టించటంసాధ్యమా?

మొన్న కాశ్మీరులో జరిపిన సమావేశం కన్నా శాసనసభలలో సత్ప్రవర్తన విషయమయి శ్రీమతిగాంధీ ఒక సమావేశం జరిపితే బాగుండేది, అంటున్నారు కొందరు. శాసనసభలలో నడిచే వాగ్వివాదాల, ప్రదర్శనల ప్రతిబింబాలే వీధిలోజరిగే యుద్ధాలు; వీథుల్లో యుద్ధాలు చేయించలేని పక్షాలకి భారత ప్రజాస్వామ్యంలో స్థానం లేదంటున్నారు కొందరు. ●

ఆంధ్రబ్యాంక్
కొత్త ఛెయిర్మన్ శ్రీగోపాలరావు

శ్రీ కె. గోపాలరావుగారిని ఆంధ్రబ్యాంక్ లిమిటెడ్ ఛైయిర్మన్‌గాను, ప్రధాన నిర్వాహకులుగాను నియమించడం జూన్ 25న మచిలీపట్నంలో జరిగిన బ్యాంకి సర్వసభ్య సమావేశంలో ఆమోదించబడింది.

శ్రీ గోపాలరావు బ్యాంక్ ఆఫ్ బరోడా లిమిటెడ్ అగ్రనిర్వాహకులలో ఒకరుగ ఉన్నారు. గత 26 సంవత్సరాలుగా బరోడా బ్యాంకులో పనిచేశారు. ప్రధానంగా ఆయన చొరవ, కృషివల్లనే బరోడాబ్యాంక్ 1945 తర్వాత దక్షిణభారతంలో తన వ్యాపారాన్ని విస్తరింపజేసుకొని ఎన్నో బ్రాంచీలను స్థాపించుకొన గలిగింది. శ్రీ గోపాలరావుకి చిన్న పరిశ్రమదారులపట్ల, చిన్న వ్యాపారస్థుల పట్లగల సానుభూతి అందరికీ తెలిసిందే. ఈయన చొరవవల్లనే బరోడాబ్యాంక్ 1958 లోనే గిండీ పారిశ్రామికవాడలోని చిన్న పరిశ్రమ దారులకు, సాంకేతిక నిపుణులకు పెక్కు బజానాలు ఇచ్చింది.

శ్రీ గోపాలరావు 'బ్యాంక్ ఆఫ్ బరోడా వీక్లీ రివ్యూ' పత్రికకు సంపాదకులుగా కూడా పని చేశారు.

ఈయన బరోడాబ్యాంకిలో చేరడానికి ముందు ఇండియన్‌బ్యాంకిలో 13 సంవత్సరాలు పనిచేశారు. ఈయన మొత్తం 40 సంవత్సరాల బ్యాంకింగ్ అనుభవంతో ఆంధ్ర బ్యాంక్‌కి వస్తున్నారు.


పారిశ్రామిక, వ్యావసాయిక ఆర్థిక విషయాలలో విస్తృత పరిజ్ఞానమూ, దక్షిణ



భారతంతో సన్నిహిత సంబంధమూ గల ఈ కొత్త ఛైయిర్మన్‌కింద ఆంధ్రబ్యాంక్ పుంజుకొని అభివృద్ధి చెందగల దశ ఏర్పడిందని ఆశించబడుతున్నది.

క్షేమేంద్రుని బృహత్కథామంజరి కథలు

అనువాదం: తిరుమల రామచంద్ర



ఉదయనుని దిగ్విజయగాథ

వత్సరాజు దిగ్విజయ యాత్రకు పూనుకున్నాడు. యాత్ర ప్రారంభంలో శివునిగురించి తపస్సుచేశాడు. మూడు రాత్రులు ఉపవసించి తపస్సుతో శివుని మెప్పించాడు. శివుడు సంతోషించి "నీకు విజయం కలుగుతుంది. విద్యాధరేశ్వరుడయ్యే పుత్రుడు కలుగుతాడు" అని ఈశ్వరుడు అతనికి వరమిచ్చాడు. శివ స్మరణవల్ల మానవులకు అసాధ్యమైనదేమిటి?

పతివ్రతలయిన వత్సరాజు దేవేరులిద్దరూ వత్సరాజును అనుసరించి మూడు నాళ్ళువ్రతం చేశారు. వారి తపస్సును వత్సరాజు నర్మసఖుడయిన విదూషకుడు ప్రశంసించాడు. వ్రతంతో కృశించిపోయిన పద్మావతినిచూచి వసంతకుడు గోపాలకుడు మొదలయిన వారి ఎదుట "పూర్వం శర్యాతి కుమార్తె అయిన సుకన్య చ్యవన మహర్షిని, లోపాముద్ర అగస్త్య మహర్షిని ఇలాగే తపస్సుతో సంతోషపెట్టారు" అని మేలమాడాడు. ఆమె అతని నర్మోక్తులకు నవ్వింది.

మరునటి దినం ఉదయం వత్సరాజు యౌగంధరాయణునితో విజయయాత్ర ఏర్పాట్లను గురించి మాట్లాడుతున్నాడు. అప్పుడు యౌగంధరాయణుడు "దేవా, పురుషకారం - దైవం తోడయినప్పుడే సఫలమవుతుంది. ఉత్సాహవంతులైన రాజులకు విజయం సిరులను, ఇహపరలోకాలలో సిద్ధిని చేకూరుస్తుంది. పూర్వ జన్మ సంచిత సుకృతంవల్ల శుభ ఫలాలు కలుగుతాయి. నీకు పూర్వ పుణ్య వశంవల్ల అచింతితంగా యుధిష్ఠిరుని సంపద దక్కింది. పూర్వం ఇలాటి పూర్వార్జిత నిధులు దొరికిన వాని కథ ఒకటి విన్నవిస్తాను:—

పూర్వం పాటలీపుత్రంలో దేవదాసనే ఒక వైశ్యుడు ఉండేవాడు. అతడు మహా ధనవంతుల కులంలో పుట్టిన అగర్భశ్రీమంతుడు. కాని అతని ద్యూతమనే వ్యసనం పట్టుకుంది. దానితో అతడు అష్ట దరిద్రుడయ్యాడు. మొదట భార్యను ఆమె పుట్టినింటికి పంపించాడు. కొంతకాలం ఒంటరిగా గడిపాడు. కాని లక్ష్మి కటాక్షించలేదు. అతని శరీరం రంగే మారింది. ముఖంలో కళాకాంతులు పోయాయి. ఇక చేసేదేమీలేక భుజంపై గుడ్డ వేసుకొని మామగారి వూరు పుండ్రవర్ధన పట్టణానికి బయలుదేరాడు.

మామగారి యిల్లు చేరిన తర్వాత అతనికి ఆలోచన కలిగింది. "కళాకాంతులు పోయి, దీనుడినై మామగారి యింట్లో ప్రవేశించడానికి సిగ్గుగావుంది. వూపిరిపోయి దీర్ఘ నిద్రతో ఒళ్ళు చల్లబడిపోయి, అందరూ ఉపేక్షించే శవం ధన్యం. దానినైనా బంధువులు కరుణతో చూస్తారుగాని, దరిద్రుణ్ణి కరుణతో చూడరు. స్వజనాన్ని యాచించేవాడికి చందనం దావాగ్నిగా, మంట లెక్కుతుంది. మధుపానం విషపానంలాగ అవుతుంది. విశ్రాంతి మరణంవంటిదవుతుంది. దేహి (మానవుడు) 'దేహి' అనే మాట అననంతవరకే శూరుడు, చతురుడు, సజ్జనుడు, అభిమాని, విద్వాంసుడు, కులీనుడు, కుశలుడు, కళాకోవిదుడు, యశస్వి."

దేవదాసు ఈవిధంగా ఆలోచించి, తల దాచుకొనడంకోసం మరొక యింటికి వెళ్ళాడు. ఒక వర్తకుడు ఎదుట ఉన్న భాండశాల (పాత్రలకొట్టు)ను చూపాడు. దేవదాసు దానిలో ఒకచోట పడుకొనడానికి వెళ్ళాడు.

కొంతసేపటికి అక్కడికి ఒక వర్తకుడు, ఒక స్త్రీ వచ్చారు. ఆమె తన భార్యేనని దేవదాసు గుర్తించాడు. మనస్సు కుంచించుకొనిపోయింది. వారిద్దరూ ఏకాంతవాసంలో ఉన్నారు.

కొంత సేపటికి లోపలినుంచి ఏవో గుసగుసలు వినిపించాయి. దేవదాసు చెవి ఒగ్గివిన్నాడు. స్త్రీ అంటున్నది ఉపపతితో.— "ప్రియుడా! నా భర్త యింట్లో అతని పూర్వులు పాతిపెట్టిన నిధులు ఉంటున్నాయి. ఈ రహస్యం పరంపరగా

కోడళ్లకే తెలుపడం ఆ యింటి ఆచారం. పూర్వులయిన అత్తగార్లు తమ కోడళ్లకు, ఇట్లే మా అత్త నాకు ఈ రహస్యం తెలిపింది. నా భర్త దేవదాసు జూదంలో పరాజయం పొంది దుఃఖంతో ఎక్కడికో పరిగెత్తిపోయాడు. అక్కడికి వెళ్లి, త్వరగా ఆ యింట్లో పూడ్చిపెట్టిన ధనం తీసుకొనిరా" అన్నది.

ఈ మాటలను వెలుపలినుంచి రహస్యంగా విన్న దేవదాసు మనోవేగంతో రాత్రికి రాత్రే తన ఇల్లు చేరాడు. తన యింటిని త్రవ్వించాడు. దాచిపెట్టిన విక్షేపాలను తీసి, భద్రపరచుకొన్నాడు.

కొన్నాళ్లకు దేవదాసు భార్య ఉపపతి తన ప్రియురాలి మాటల ఆశతో పాటలీపుత్రానికి వచ్చి దేవదాసు ఇంటికి వచ్చాడు. నిధులను త్వ్రి తీసుకొందామనే ఆశతో ఆ యింటిని క్రీడామూల్యం (ఫ్యాన్సీప్రైస్) ఇచ్చి కొన్నాడు.

ఇల్లు కొని లోపల త్వ్రి చూస్తే నిధు లేమీ లేవు ఎవరో త్రవ్వి మళ్లీ పూడ్చి వేసినట్లు కనిపించింది. మళ్లీ దేవదాసువద్దకు వచ్చి, "నీ ఇల్లు బాగులేదు. నాకు అక్కరలేదు. నేను కొనను. నీవే తీసుకో. నా డబ్బు నాకు వెనక్కు ఇచ్చివేయి" అని అడిగాడు. దేవదాసు ఇవ్వనన్నాడు. మాటా మాటా పెరిగింది. వివాదం రాజుగారి సమక్షానికి వెళ్ళింది.

దేవదాసు, తన వృత్తాంతమంతా వివరించాడు. రాజు అతని అసతి అయిన భార్యను పిలిపించి విచారణ చేశాడు. నిజం బైట పడింది. రాజు ఆ వర్తకుని పరదారాగమనాపరాధానికి కారాగార శిక్ష విధించి, అతని ఆస్తి అంతా హరించాడు. ఆ అసతికి ముక్కు చెవులు కోయించాడు. దేవదాసు మరొక వనితను వివాహమాడి పితామహ ధనంతో సుఖంగా జీవితం గడిపాడు.

"దేవ, ఈవిధంగా, పుణ్యవంతులకు సంపదలు దైవికంగా వాటంతట అవే వస్తాయి."

వత్సరాజు యౌగంధరాయణుడు చెప్పిన కథ విన్నాడు. దిగ్విజయయాత్రకు ఉద్యుక్తులు కండని సేనాపతి మొదలయిన వారికి ఆనతిచ్చాడు. పద్మావతీ సోదరుడు సింహవర్మను పిలిపించాడు. అతడు చాల బలవంతుడు. అతనికి చేది రాజ్యమిచ్చి, దానికి రక్షకుడుగా ఉండమన్నాడు. పిదప వాసవదత్త సోదరుడైన గోపాలకుని విదిశా రాజ్యంలో స్థాపించాడు. విజయయాత్రకు బయలు దేరాడు.

యౌగంధరాయణుని మాటతో వత్సరాజు మొట్ట మొదట వారణాసి రాజయిన బ్రహ్మదత్తునిపైకి దండు వెడలాడు. బ్రహ్మదత్తుడు తన సామంతుల నందరిని సంతోషపరిచాడు. అందువల్ల అతనిని సామంతులు ఎంతో భక్తి శ్రద్ధలతో కొలుస్తున్నారు. అతనిపైకి వత్సరాజు మొట్ట మొదట దండు వెడలాడు. వత్సరాజు సైన్యంలోని ఏనుగుల పాదఘాతానికి, గుర్రాల గిట్టల తాకిడికి భూతలం గుంటలు పడిపోయింది. భటుల సమ్మర్దంతో దిగంతాలు తల్లడిల్లాయి.

రాజు ఇక్కడ ఉన్నాడు అని తెలుపడానికి ఆయనకు ఎండ పడకుండా శ్వేతఛత్రం పట్టారు. అతనిని చూస్తే, క్షీర సముద్ర మథన సమయంలో సముద్రంనుంచి చంద్రుడు బయలుదేరినప్పుడు

ఆంధ్రసచిత్రవారపత్రిక

1968 దీపావళి కథల పోటీ

ఎప్పటివలెనే ఈ సంవత్సరం కూడా 'ఆంధ్రసచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీ' నిర్వహించబోతున్నదని తెలపటానికి సంతోషిస్తున్నాము. రచయితలందరూ ఎప్పటి వలెనే మాతో సహకరించి ఈ పోటీని జయప్రదం చేస్తారని ఆశిస్తున్నాము.

మొదటి బహుమతి రు. 2100

రెండవ బహుమతి రు. 1500

మూడవ బహుమతి రు. 500

నిబంధనలు

1. కథలు స్వంత రచనలై ఉండాలి. ప్రతి కథతోనూ రచయిత అది తన స్వంత రచనే నని, దేనికీ అనువాదంకానీ, అనుసరణకానీ కాదని హామీరాసి పంపాలి. ఈ హామీలు వేరే కాగితం మీద కాకుండా కథ వ్రాతప్రతి మీదనే రాసి ఉండాలి.

2. కథలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి.

3. వ్రాతప్రతి మీద "దీపావళి కథలపోటీకి" అని స్పష్టంగా రాయాలి. కాగితానికి ఒక వైపు మాత్రమే సిరాతో రాయాలి. రచయితపేరు, పూర్తి చిరునామా కూడా వ్రాతప్రతి మీద స్పష్టంగా రాయాలి. రచనలు 12 అరఠావు (ఎక్సర్సయిజు నోట్‌బుక్ పేజీకి రెండు రెట్లు) పేజీలకు మించరాదు.

4. కవరుమీద "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా రాయాలి. పోటీకి రచనలు 'సంపాదకుడు, ఆంధ్రసచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టిస్ట్రీట్, మద్రాసు—1'కి పంపాలి.

5. పోటీ గడువు తేదీ 14—8—68. ఆ తర్వాత మా కార్యాలయానికి చేరిన కథలని మామూలుగా ప్రచురణకి పరిశీలిస్తాము.

6. పోటీలో బహుమతి పొందిన కథలని 'దీపావళి ప్రత్యేక సంచికగా' వెలువడే 25—10—68 తేదీ గల ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురిస్తాము.

7. పోటీ తుది నిర్ణయం ఆంధ్రసచిత్ర వారపత్రిక సంపాదకుడిదే. ఈ విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరపడానికి వీలులేదు.

8. వ్రాతప్రతులని ఎటువంటి సందర్భంలోనూ తిప్పి పంపడానికి సాధ్యం కాదు. పోటీలో పాల్గొనేవారు తమ రచనలతో తపాలా బిళ్లలు అతికించిన స్వంత చిరునామాకల కవర్లు పంప నవసరం లేదు.

9. పోటీలో బహుమతి పొందక మామూలుగా ప్రచురణకి స్వీకరించిన కథల రచయితలకి ఆ విషయం ప్రచురించే ముందు తెలుపుతాము.

మందభాగిని [...] అలా వున్నట్టు అనిపిం
చింది. వత్సరాజు పార్థుని వంటివాడు. అందువల్ల ఖాండవదహన సమయంలో భయపడిన మేఘాల్లే యుద్ధంలో సేవానిరతం చేయడానికి వచ్చినట్లు ఉన్నాయి నల్లటి ఏనుగులు. భటులు చేతులతో ఝళిపిస్తున్న పొగకత్తులు పాతాళవాసంవదలి వచ్చిన పాములలాగ కనిపించాయి. యౌగంధరాయణుడు కాపాలికాది వేషాలతో వెళ్ళిన గూఢచారులవల్ల, దైవికమైన శకునాలు, నిమిత్తాలచేత శత్రువు రహస్యాలను, మంత్రాలోచనను మొదట్లోనే లాగాడు. కనుక, విజయయాత్ర మహోత్సాహంగా కొనసాగింది.

బ్రహ్మదత్తుని మహామాత్యుడు యోగకరండకుడు. చాల తెలివిగలవాడు. వత్సరాజు దాడి వెడలివచ్చే దారిలోని నీటిని, వస్త్రగ్రాసాన్ని విష కలుషితం చేయించాడు. ఉల్కలు పడేట్టు చేయడం మొదలయిన దుస్స్వప్నమైన మాయలు చేయించాడు. యౌగంధరాయణుడు వాటికంతా ప్రతీకారంగా ప్రతియోగాలు చేయిస్తూ బ్రహ్మదత్తుని మంత్రి ప్రయోగాలు అన్నింటినీ కూల్చివేశాడు.

వత్సరాజుకు యుద్ధంలో ఎదుర్కొనే క్షేమని బ్రహ్మదత్తునికి తోచింది. వివేకవంతుడు గనుక, లొంగి

...బృహత్కథామంజరి

పోవడమే మేలనుకున్నాడు. అంజలి ఘటించి కప్పోపహారాలతో వత్సరాజుకు ఎదురు వచ్చాడు. వత్సరాజు అతనిని చాల సన్మానించి అతడు పరాజయం పొందాననే భావాన్ని తొలగించాడు.

వత్సరాజు బ్రహ్మదత్తుని జయించిన మీదట సకల దిక్కులూ జయించి, సూర్యుడు భూమిని భరించే పర్వతాల తలలపై తన ప్రతాపాన్ని భరింపజేసినట్టు, భూమిని భరించే రాజుల తలలపై వత్సరాజు తన ప్రతాపం మోపాడు. సమస్త సామంతులూ, అతని ఆజ్ఞను అపుడల దాల్చారు.

వత్సరాజు దిగ్విజయ యాత్రనుంచి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో అవంతి రాజయిన చండమహాసేనుడు, మగధ రాజయిన ప్రద్యోతుడు అతనిని కలుసుకుని సన్మానం చేశారు. వారిద్దరూ వెంటరాగా, ఇద్దరు దేవేరులతోపాటు లావానక పట్టణం చేరాడు. వత్సరాజును చూడగానే పురస్త్రీల ముఖాలు, ఉదయభాస్కరుణ్ణి చూచిన కమలాలలాగ వికసించాయి.

వత్సరాజుకు హేమరత్నాంబరాలు ప్రసాదించే చక్రవర్తి సిరి అబ్బింది. ఇక శృంగార సామ్రాజ్య సిరిని అనుభవించాలి. కాంతా[...] వత్స భూపతి ఆ శృంగార సామ్రాజ్యంకూడా ఏలాడు.

కొన్నాళ్ళు గడిచాయి. విజయి అయిన వత్సేశ్వరుడు మంత్రి యౌగంధరాయణునితో మంత్రాలోచన చేస్తూ, "మహామంత్రీ! నా విజయలక్ష్మికి నీ మతి ప్రభావమే కారణం. నా కనుబొమ్మల కదలికతోనే పలువురు రాజులు పదవినుంచి తొలగడం, మళ్ళీ ప్రతిష్ఠితులు కావడం, నా పాదాలను వారి చూడామణుల కాంతులు చుంబింపడం జరుగుతున్నాయి. ఒక్క బ్రహ్మదత్తుడు మాత్రం చాలా కుటిల మనస్సు గలవాడు. వశుడయినప్పటికీ దర్పాంగుడు గనుక మళ్ళీ చలించిపోతాడని అనుకుంటాను" అన్నాడు.

"దేవా, మీరు అతనిని జయించినా, చాల సన్మానించారు. అందువల్ల అతడు చలించి ఎదురు తిరుగడు. శుభకర్మవల్ల, విపరీత కర్మవల్ల, విపరీతకర్మ కలుగుతాయి నీ శాసనాన్ని ధిక్కరిస్తే, అతనికి సంపదలు దక్కవనడం నిజం. ఒక పూర్వ వృత్తాంతం చెబుతాను వినండి" అని యౌగంధరాయణుడు ఒక కథ చెప్పాడు:

పద్మమనే పేరుగల దేశంలో పూర్వం అగ్నిదత్తుడనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతనికి సోమదత్తుడు, వైశ్వానరుడు అని ఇద్దరు కుమారులు ఉండేవారు. సోమదత్తుడు చదువుసంధెలు లేనివాడు, శాస్త్రగంధమైనా లేనివాడు. వైశ్వానరుడు చదువుకొన్నవాడు, వేదపారంగతులలో ప్రథముడు. అగ్నిదత్తుడు వారిద్దరికీ వివాహం చేసి స్వర్గస్థుడయ్యాడు.

సోమదత్తుడు మూర్ఖుడు కావడంవల్ల, సదాచారం వదలిన దానివల్ల దుర్జనసాంగత్యం ప్రబలిపోయి, దుష్టుడయ్యాడు. ఒకసారి అతనిని రాజు బందిలో గూడ వేశాడు. అతని తమ్ముడైన వైశ్వానరుడు రాజుకు మనవి చేయడంవల్ల, రాజు సోమదత్తుని విడుదలకు ఉత్తరువు చేశాడు. ఈవిధంగా వాడు తన తమ్మునితో రక్షించబడ్డాడు. కాని, అతనికి అవమానంతో అగ్రహారంలో తమ్మునితోపాటు వుండడం ఇష్టంకాలేదు. అందువల్ల భార్యతోపాటు అగ్రహారం వదలిపెట్టి సేద్యపు వృత్తిగా ప్రారంభించాడు. అతని మడి దగ్గర ఒక పెద్ద మర్రిచెట్టు వుండేది. అది దట్టమైన ఆకులతో మంచి నీడను ఇచ్చేది. సోమదత్తుడా దాని పంచన వుంటూ, దానికి పూజలు చేస్తూ, వ్యవసాయం కొనసాగించాడు. సత్య సంపదతో పెరిగిన ఆ దుర్భాగ్యుడు వ్యవసాయం చేస్తూ నాగటనే పట్టుకొన్నందున అతనికి "హలాధ్యాత్మి" అనే పేరు వచ్చింది.

మహీధరోక్తులు

మహీధర నళినీమోహనరావు



సృష్టినేదియైన సృష్టమ్ము గాకున్న
దైవ మాయయనుచు తప్పుకొంద్రు
మారుపేరు దైవ మజ్ఞానమునకేమొ!
హృదయవర్తి యిూ మహీధరోక్తి.

ఓటుకైన జున్నుకైన నొక్కటె మందు
ప్రేలువొకటి పైకి పూలునొకటి
జనత యొకటెగాని సంస్కారములువేరు
హృదయవర్తి యిూ మహీధరోక్తి.

కావిబట్టగట్టి గంటాయి బొగ్గ్రతావ
సాధువన్నపేరు సార్థకంబె ?
సాధుపొట్టకొరకె బహుకృత వేషముల్
హృదయవర్తి యిూ మహీధరోక్తి.

హితము గూర్పదోష శతమెన్నుచుందురు
మిన్నకున్న తప్పు లెన్నబోరు
రాళ్లదెబ్బలెల్ల పళ్లచెట్లకెగదా !
హృదయవర్తి యిూ మహీధరోక్తి.

యాచకుండుతృణముకన్న తేలికయంద్రు
తేలికైన గాలి తేల్చదేమి ?
అతడు తననుకూడ యాచించుననుభీతి
హృదయవర్తి యిూ మహీధరోక్తి.

సోమదత్తుని అదృష్టం సరిగాలేదు. పరధనా యత్తులైన దుర్మార్గులు అతనిపైబడి అతని పొలం ఇల్లు ధ్వంసం చేశారు. అతను సంపాదించిన లక్ష్మి కాస్త ఇలా ధ్వంసమయింది. విధి విరుద్ధంగా ఉన్నప్పుడు, పురుషకారం— మానవ ప్రయత్నం ఏమి చేస్తుంది? సోమదత్తుడు శోకవ్యాకులుడై, నిద్రాహారాలు లేక మర్రిచెట్టుకిందే పడివుంటూ వచ్చాడు. అతని కళ్లనుంచి నిరంతరం నీరు ప్రవహిస్తూనే వుంది. అతని భార్య దుఃఖం చెప్పనక్కరలేదు.

అతడు ఒకరాత్రి ఇలాగే నిద్రలేకుండా దుఃఖంతో వటవృక్షం క్రింద పడుకొని వున్నాడు అతనికి ఆకాశం నుంచి ఇలా వినిపించింది — "హాలభూతీ, నేను ఒక యక్షుడిని. నా పేరు మిహారుడు నీవు ఎల్లప్పుడూ నన్ను పూజిస్తున్నావు అందువల్ల నేను సంతోషించాను. నేను నీకు వేదాలు, శాస్త్రాలు ఇస్తున్నాను. నీవు విపులమైన సంపద పొందుతావు. ఇక్కడికి దూరంలో శ్రీకంఠమనే దేశం వుంది. దానిని ఆదిత్యప్రభుడనేరాజా ఏలుతున్నాడు. నీవు అతని దేశానికి వెళ్లు. అక్కడ, ఎవరు అడిగినా, అడగక పోయినా, "శుభం చేసేవారికి శుభం కలుగుతుంది అశుభం చేసేవారికి అశుభం కలుగుతుంది" అని చెబుతూ వుండు" అని

మరుసటి దినం హాలభూతి భార్యతోపాటు శ్రీకంఠదేశానికి పయన మయ్యాడు కొన్నాళ్లకు ఆ దేశం చేరాడు అక్కడ యక్షుడు చెప్పినట్టు ఎవరు అడిగినా, అడుగకపోయినా, "శుభం చేసేవారికి శుభం కలుగుతుంది అశుభం చేసేవారికి అశుభం కలుగుతుంది" అని అంటూ వచ్చాడు. ఈతని సంగతి రాజుగారికి చేరింది అతడు హాలభూతిని ఆస్థానానికి పిలిపించాడు హాలభూతి రాజాస్థానంలోనూ ఆ మాటే నవ్వుతూ చెప్పాడు. రాజు ఆ మాటలకు నవ్వుకున్నాడు అతనికి అందరూ ఆశ్చర్య పడేట్టు సంపద యిచ్చి పంపివేశాడు.

హాలభూతి క్రమంగా రాజుకు అంతరంగికుడయ్యాడు. నగరులోని వారందరూ అతనిని గౌరవించ సాగారు.

ఒకనాడు రాజు విశ్వాసపాత్రుడైన హాలభూతితో పాటు వేటకు వెళ్లాడు అతడు వెళ్తూంటే, పురస్త్రీలు మేడలనుంచి, ఇతరస్థలాల నుంచి ఆయనను చూచారు. నల్లని ఆ చూపులు అతనికి నల్లకలువ దండలు వేసినట్లు కనిపించింది. వేటనుంచి చాలకాలానికి రాజు తిరిగి వచ్చాడు.

(ఇంకావుంది) ●

గ మ ని క

ఉత్తరాల శీర్షికకి రాసేవారు ఈ కింది నియమాలు పాటించాలని మనవి: 1. ఉత్తరాలు వీలయినంత చిన్నవిగా ఉండాలి 2. రాసేవారి పూర్తి పేరు, చిరునామా ఇవ్వాలి 3. ఇంగ్లీషు లిపిలో అక్షరాలు రాయరాదు 4. కాగితానికి ఒకవయిపునవే రాయాలి. 5. సిరాతోనే రాయాలి. —సం॥

దైవోపహతుడు

ఖరుదయరాజ్ అనే ముప్ఫైయేళ్ళ వ్యక్తిని 20 తేదీన వుదయం సెగొంటేపడ్డులో స్పెన్సర్ కంపెనీ ప్రాంతంలో ఒక జీపు గుద్దిందట దెబ్బలు బాలా తగలడంవల్ల అతన్ని జీపులో ఎక్కించి, ఆసుపత్రికి తీసుకు వెళుతుండగా ఆ జీపు ఎల్. ఐ.సి. (జీవితభీమా) భవనం దగ్గర ఓ ఎడ్లబండిని గుద్దుకుందట. అసలే చావుబ్రతుకుల మీదున్న ఖరుదయరాజ్ కి మరిన్ని దెబ్బలు తగిలాయట. ఇంకతను ఆసుపత్రికి వెళ్ళేలోగానే చనిపోయాడట. ఏమవుతాడు? రెండు ప్రమాదాలనూ జీర్ణం చేసుకోగలడా!

*   *   *

హొసూర్ తాలూకా అలసనాదం అనే వూళ్లో మే 11 వ తేదీన మునియప్ప అనే అతను గొర్రెను దొంగతనం చేశాడన్న నేరంతో అతనిని ఒక రాయికి కట్టేసి, కర్రలతో బాది చంపేసి, ఆ శవాన్ని పూరవతల పారేశారట తన తమ్ముడు కనబడటం లేదని మునిగాడి అన్న పోలీసులకు రిపోర్టిస్తే, పోలీసులు ఆరా తీసి ఎనమండుగురు హరిజనుల్ని అరెస్టు చేశారట.

జీవితంపై విసుగెత్తి ఆత్మహత్య చేసుకున్న రెండో భార్య

నవల్పూర్ లో చిన్నప్ప అనే అతను తనకు సంతానం లేనందువల్ల అఖిలాండమ్మాళ్ అనే ఆమెను రెండోపెళ్ళి చేసుకున్నాడట. ఆనాటినుంచీ యిద్దరు భార్యలూ రోజూ పోట్లాడుకునేవారట. ఈ పోట్లాటలకు విసిగిన అఖిలాండమ్మాళ్ తనకు చక్కని జీవితం భగవంతుడు యివ్వనే లేదని ఏడ్చి, 12 వ తేదీ రాత్రి వంటినిండా కిరసనాయిలు పోసుకుని, చితకు నిప్పంటించేసుకుందట. జనం అరుపులు విని వచ్చేసరికి ఆమె చనిపోయింది.



*   *   *

రోడ్డు జాగ్రత్తలు మనం పాటించాలని అనడమే తప్ప మన జాగ్రత్తలు పాటించే వారెవరూ లేరు. స్కూలు నుంచి ఇంటికి పోతున్న ఉమ అనే అమ్మాయిని గోపాల్ అనే అతను కత్తితో పొడిచాడట. ఇది కాంచీపురం రాచవీధిలో జరిగింది. స్నేహితురాండ్రతో కలిసి యింటికి వెళుతున్న యీమె మీదికి ఆ గోపాల్ లంఘించి, కత్తితో వీపు మీద పొడిచి, కత్తి వీపులో వదిలేసి పారిపోయాడట. పోలీసు లతన్ని పట్టుకున్నారు ఉమని ఆసుపత్రిలో చేర్చాడు. డాక్టర్లు ఆమె వీపులోని కత్తి తీసి, "చెప్పటం కష్టం" అన్నారట.

ఆకలిబాధ — కుటుంబ నియంత్రణ

ఆకలి బాధకు తాళలేని యువకుడు ఒకడు (కలకత్తా) మిద్నపూరులో వేసెక్టమీ (కుటుంబ నియంత్రణ ఆపరేషను) చేయించుకుని, ప్రభుత్వం యిచ్చిన 18 రూపాయలు తీసుకుని వెళ్ళిపోయాడట. దారిద్ర్యం యీ లెక్కన వుంది

*   *   *

హిమాలయాల్లోని శివాలిక్ పర్వతశ్రేణిలో యిటీవల 33 అడుగుల పొడుగువున్న మానవ అస్థిపంజరం బయట పడిందట. అంతపొడుగున్న ఆ మానవులు ఏకాలంనాటివారో, ఎలా ఉండేవారో తెలుసుకోడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి

*   *   *

సౌత్ ఆఫ్రికాలో గుండెమార్పిడి చేసి, ఖ్యాతిని పొందిన డాక్టర్ బెర్నార్డ్ మనిషిగుండెకు బదులు పందిగుండె పెట్టవచ్చనీ, కావలసినపుడల్లా మనిషికి మరో మనిషిగుండె దొరకడం కష్టం కనుక తనీ పరిశోధన చేసి పందిగుండె శ్రేష్ఠం అని కనుగొన్నాననీ చెప్పారు— "ఇంతకీ పందిగుండె మనిషికి నప్పును' అని అన్నమాట ఆయనన్నది—వాట్?

*   *   *

పొన్నూరు పోలీసువారు ఇటీవల దాసరి నాగయ్య అనే అతన్ని అరెస్టు చేశారట. ఇతని కోసం పోలీసుశాఖ 18 సంవత్సరాలుగా వెతుకుతున్నారట. మైసూర్ రాష్ట్రంలో 'నాగయ్య' రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్ (వైద్యుడు)గా వుంటున్నాడట. ఇతనికి ఓ భార్య కూడా వుందట. గత చరిత్రలో భారీఎత్తున దారిదోపిడీలు, దొంగతనాలు వగైరాలు చేశారట. అవాడ తని పేరు శామ్యూలట. గత చరిత్రను మూటగట్టి, పేరు మార్చుకుని డాకరుగా మైసూరులోని పొన్నూరిలో స్థిరపడ్డాక యితన్ని పట్టుకున్నారట.

*   *   *

తన భార్య పవ్వయ్యమ్మాళ్ ప్రవర్తనమీద సందేహపడ్డ 18 ఏళ్ళ తంగవేలు— ఆమె నిద్రపోతుండగా నో పెద్ద బండరాయితో ఆమె తల చితకకొట్టి చంపేసి, తన భార్య నెవరో చంపారని పోలీసులకు రిపోర్టిచ్చాడట. పోలీసులు అతన్నే అనుమానించి అరెస్టు చేశారు.




హత్యా కేసులో సినిమా నటి పినతల్లి అరెస్టు


రాయపేటలో, దురైరాజన్ అనే అతని హత్య కేసులో సినిమా నటి పద్మిని పినతల్లి కమలను అరెస్టు చేశారట. ఆమెనేగాక, జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె భర్త మీనవన్ కూడా అరెస్టు చేశారట— ఇక యీ కేసు విషయాలు తేలాలి.

—షోలాక్షుడు ●

"అమూల్లోని అమూల్యమైన
విటమినులు
ఎందుకో చెప్పగలరా?"
అన్నాది బుల్లిపాప.



"ఓ, చెప్పగలం"
అన్నాయి బుల్లి
స్నేహితులు.




అమూల్ దుగ్ధాహారము

మీ పాపకు కావలసిన 7 విటమినులు గలవు.



ప్రాచీన ఆయుధాలు

వ్యాసం ఫోటోలు:
నీలం శంకరనారాయణ.



తీగల డిజైనుకల కత్తిపిడి.

ఆధునిక యుద్ధాలలో ట్యాంకులు, విషగ్యాస్లు విమానాలు, రాకెట్లు మొదలైన ఆయుధాలను ఉపయోగిస్తున్నారు. అనేకవిధంగా ఈ నవీన ఆయుధాలను కనిపెట్టడానికి పూర్వం, యుద్ధాలలో కత్తులు, ఖడ్గాలు, ఈటెలు, డాలు మొదలగు ఆయుధాలను ఉపయోగించేవారు. ఈకత్తులు, ఖడ్గాలు పోరాటానికి తయారుచేయబడినా కూడ, వాటిని చిత్రాలతో అలంకరించి అందంగా కనిపించేటట్లు చేయడం, ఆకాలంలో అలవాటు. ఇలా కత్తులు, ఖడ్గాలు పైన కూడ చెక్కడం వారి కళాభిలాష చేతనే. పూర్వం రాజులుపయోగించే కత్తులను విలువైన బంగారు, రత్నాలతో అలంకరించే వారు. డాలులకి చిత్రకారునికి కళా చాతుర్యం ప్రదర్శన చేయడానికి అవకాశం ఎక్కువ. పురాతన కాలం నాటి డాలులపైన సూర్యచంద్రుల బొమ్మలు, తీగలు, పూవులు మొదలైన డిజైనులు చాల ఆకర్షణీయంగా చెక్కబడి ఉంటాయి. సాధారణంగా కత్తులు, ఖడ్గాలు యొక్క చేతి పిడిలలోనే చిత్రాలు చెక్కబడి ఉంటాయి. ఈఖడ్గాలు, కత్తుల పైన పురాణ సంబంధమైన, ఘట్టాలు, మృగాల బొమ్మలు, మొదలైనవి అతి రమణీయంగా చెక్కబడి ఉంటాయి. కొన్ని కత్తులు, వాటి ఒరలు వెండితో అలంకరించబడి ఉంటాయి. ఇలా కత్తులలో చాల రకాలైన డిజైనులు ఉంటాయి. ఈవిధంగా వెండితో కత్తి పిడులను అలంకరణచేసే విధానాన్ని ఇంగ్లీషులో "డామసెటింగ్" అంటారు. ఇలా చేయడంవల్ల కత్తులకు తుప్పు పట్టదు. కొన్ని ఖడ్గాల చేతి పిడులు, ఏనుగ, మకరము, కుక్క పక్షులు మున్నగు వాటి శిరస్సులలాగ చేస్తారు. ఉదాహరణకు ఏనుగు శిరస్సులాగ ఉండే కత్తిని ఫోటోలో (1వ కాలం) గుర్తించవచ్చు.



ఏనుగు శిరస్సులా చిత్రించబడిన ఖడ్గము.

కత్తులలో అనేక రకాలున్నాయి. వాటిలో కొన్ని చాలపెద్దవి. చూడ్డానికి ఆశ్చర్యంగాఉంటుంది. కత్తులయొక్క రకాలకంటే, వాటిలో చెక్కబడిన డిజైనులు, చిత్రాలు, అలంకరణ మరీ ఎక్కువ ఆశ్చర్యం కలిగిస్తుంది. చిత్రభూయిష్ఠములైన ఈ ఆయుధాలు కథావస్తువులు. ఇలాంటి అందమైన కత్తులు మద్రాసు పురావస్తు ప్రదర్శనశాలలో ప్రదర్శింపబడియున్నవి. ఇవి తంజావూరు ఆయుధశాలకు చేరినవి. ప్రస్తుతం మద్రాసు మ్యూజియంలో భద్రపరచబడియున్నవి. చెన్నపురి పురావస్తు ప్రదర్శన శాలలో ప్రదర్శింపబడిన కత్తులు ఖడ్గలలో దశావతారములు, హనుమంతుడు, గరుత్మంతుడు, భైరవుడు మొదలగు దేవుళ్ళ, మరి హిందూ పురాణాలకు సంబంధించిన కొన్ని ఘట్టాలు చాల రమ్యంగా చెక్కబడియున్నవి. చిత్రభూయిష్ఠములైన ఆయుధాలు ప్రపంచంలో కొన్ని పెద్ద వస్తు ప్రదర్శనశాలలో ఉంచబడియున్నవి. ఇవి చూస్తేమనకు వాటి మానవుని కళానైపుణ్యము ప్రజల కళాభిమానం కళ్లకు కట్టినట్లుగా తెలుస్తుంది.

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

వి. కె. డి, అనంతపురం

మంచివాళ్లతో స్నేహం ఎలాంటి దక్కయ్యా?

'సాధు సంగమంబ సకలార్థ సాధనంబు' సోదరీ.

జి. ఎన్. ఆర్, హైదరాబాదు

తాగుబోతుకి బారే దేవాలయం. కాదంటారా?

కాదని ఎవరంటారు బ్రదర్—

'పానశాలయె లేనిదే దైన నేమి?
బడి మసీదు సత్తురువు సర్వమున్న నొకటె'

అన్నాట్ట గాలిబ్.

ఎస్. పి. ఆర్. జగిత్యాల

ఈ కాలములో ప్రేమ వివాహాలు చాలమటుకు నిష్ఫలమగుటకు కారణం ఏమిటండి?

ఎన్ని లెక్కలు వేసి యీ నిర్ణయం చేశారు గురువుగారూ, లేక మీకుతెలిసిన ఒకటి రెండు కేసులుచూసి యీ సూత్రం ప్రతిపాదించారా?

ఆర్. ఎల్. ఎన్. ఆర్, ఎల్లారెడ్డి

సృష్టిలో ఏ ప్రాణికీలేని వరం మానవునికుంది

అది మెదడు అనుకునే వాళ్లం!?

వి. ఆర్. ఎమ్, చీరాల

పరిస్థితుల ప్రభావం, మనోనిగ్రహం వీటితో ఏది బలీయమైనది? ఎందువలన?

టగ్ ఆఫ్ వార్‌లో ఏదినెగ్గితే అదే బలీయమైనదని నిర్ణయిద్దామా?

పి. ఎస్. ఎస్, గొల్లల మామిడాడ

నా స్నేహితుడు మాటాడితే కృతఘ్నుడనంటాడు. కాదురా కృతజ్ఞుడవాని అంటాను. కాదని అంటాడు. ఈ కృతఘ్నతా కృతజ్ఞతా భావాలని విడదీస్తారా?

బహుశా పెద్ద హీరోల డైలాగులు విని మీ స్నేహితుడు 'సర్వదా కృతఘ్నుణ్ని' అంటున్నాడేమో!! మోసం చేస్తే కృతఘ్నుడు. చేసినమేలు మరిస్తే కృతఘ్నుడే. నిజాయితీకి వెరువని వాడూ, చేసినమేలు మరువనివాడు కృతజ్ఞుడు.

పి. కె. డి, రాజమండ్రి

ఇంట్లో మీ అధికారం ఎంతవరకూ అక్కయ్యా?

వెనుకటికి ఓ కాకి తన కనుచూపు వాలినంతమేర తనదే అధికారం. తన పర్మిషన్ లేకుండా ఇంకో కాకి వాలడానికి వీల్లేదు, అని అరిచిందట. కాని దానిగోల ఎవరూ పట్టించుకోలేదు సరికదా ఇష్టం వచ్చినట్లు వాలసాగారు. ఇంకేం చేస్తుంది. రూలు మార్చింది. 'నాకనుచూపు పర్యంతమేరా నాదే సామ్రాజ్యం. ఎవరికిష్టమైతే వాళ్లంతా వాలొచ్చు' అందిట. నా అధికారం అంతే. వింటే నా మాట వినట్టు లేకుంటే వాళ్లమాట నే విన్నట్టు. సుఖంగదూ చెల్లాయి!

వి. వి. డి, రాజమండ్రి

పై వారి లోపాలు ఎన్నుతారేగాని తమ స్వంతవారి అన్యాయాలు పైకి రానివ్వరు. ఇలాంటివారి నేం చేయాలి?

'తనతల్లి లోప మెరిగిన
మనుజుడు చింతిల్లనెపుడు మానసమందున్
తన యాలి లోప మెరిగిన
ఘనుడైనను దాని విడుచు గదరా వేమా'

అన్నాడు వేమనయోగి, తల్లి స్వంతం ఆలి పైనుంచి వచ్చినది. తేడా లేదామరి!

సోదరి, రాజమండ్రి

జీవితం అంటే విరక్తి కల్గింది. ఏ ఉత్సాహమూ లేదు.

అందుకే వంపులేని దారి సుదీర్ఘంగా తోస్తుంది అంటారు, జీవితంలో వ్యాపకాలేర్పరచుకోవాలి. లేకుంటే బోర్.

బి. ఎస్. ఎస్. సాంబల్‌పూర్, ఒరిస్సా

భార్యా భర్తలకు ముఖ్యంగా ఉండవలసిన దేమిటి?

భర్తకి తెలివి, భార్యకి అణకువ.

ఎస్. ఆర్. ఆర్, విశాఖపట్నం

ప్రేమించిన స్త్రీతో ఎలా మాట్లాడాలి?

వెన్నెలతోబాటు నన్ను కలుసుకో— ఏకాంతంలో—ఒంటరిగా అని చూడండి. ఫలితం చెప్తారు కదూ—ఫల్‌దర్ ప్రిన్‌క్రిష్ణన్‌కి!

ఎ. యస్. ఆర్. పి, చీరాల

స్వతంత్ర భారత దేశంలోని దినవార మాసపత్రికల స్థాపన ముఖ్యోద్దేశ మేది.

వినలేదా 'వార్తయందు జగము వర్ధిల్లుచుండు' నన్నది. వార్తా వ్యాప్తికే పత్రికల ఉనికి.

టి. యమ్. ఆర్, హైదరాబాదు

కావాలని తప్పుచేసి పొరపాటు అనేవారిని చూసి ఏమనుకోవాలి.

బ్రతుకనేర్చినవారని.

జి. కె కె, వమరవెల్లి

మరణ శయ్యమీద మానవుని కోరికలు ఎలా ఉంటాయి.

మరొక్క క్షణం బ్రతికితేనా..... అనుకుంటాడేమో మానవుడు.

సి. ఎ, మోడేకుర్రు

పురుషులకంటె స్త్రీలకు విద్యయందు అభిలాష ఎక్కువగా ఉంటుంది కారణమేమిటి అక్కయ్యా?

ఆవయస్సులో కుర్రాళ్లకి ఇతర వ్యాపకాలెక్కువ చెల్లెలా!

వి. పి. యస్, విజయనగరం

పుట్టింటి పేరుతోనే ఉండమని మహిళాలోకానికి మీ సందేశమా? దానికారుద్రని ఆశీస్సు ఉందా?

నాపేరు నా అలవాటు ఇక ఆశీస్సులంటారా? పదమూడు సంవత్సరాలు దాటిపోయిన సంసార సాగరంలో ఆడది నోరుపెట్టుకుని గెలవలేనిదేమైనా ఉంటుందా సోదరా?!

కె. యమ్. పి. ఆర్, శ్రీకాకుళం

యవ్వనం ఆశలలో బ్రతుకుతుంది. వృద్ధాప్యం స్మృతులతో గడుస్తుంది. మరి కౌమారం?.

ముద్దుమురిపాలతో

బి. వి. యస్, నిడుమోలు

నేను మా బంధువులలో ఒక సోదరి అయ్యే అమ్మాయికి ఉత్తరం వ్రాశాను. పోస్టు బాక్సులోంచి మా తరగతి పిల్లలు దాన్నితీసి చదివినట్లు తెలిసింది. నే కనిపిస్తే 'త లెటర్' అంటారు వ్యంగ్యంగా. ఆమె సిస్టర్ అంటే వినరు...


ఉత్తరం చదివిన వాళ్లకీ, వ్రాసిన మీకూ తెలియాలి నిజం మేష్టారూ!

సి. హెచ్. యస్, పత్తిపాడు

ఈ రోజులలో న్యాయానికి చోటు లేదు. అన్యాయానికి ఎక్కువ చోటుంది. మీరేమంటా రక్కయ్య?

ఏరోజులలోనైనా న్యాయన్యాయాలకి చోటు ఉంటుంది ఎటొచ్చీ అన్యాయం కొండెక్కూస్తుంది. న్యాయం తన ఉనికి చాటుకోదు. అందుకే అన్యాయం గురించి వినపడినంతగా న్యాయాన్ని గురించి వినపడదు తమ్ముడూ.

ఆశాకిరణం



వేమకోటి సీతారామశాస్త్రి

అరుణోదయ మవుతోంది.

రాంబాబుకు మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి చూశాడు. విశాలమైన గదిలో మంచం మీద తను పడుకున్నాడు. మీదన ఫేన్ తిరుగుతోంది. మందుల వాసన ముక్కుకు తగుల్తోంది. కాళ్ళ దగ్గర రక్తం రంగులో వున్నిరగ్గు. నర్సులు, చప్రాసీలు ట్రెయినింగు నర్సులు హడావుడిగా తిరుగుతున్నారు. యిది హాస్పటలా! తను హాస్పటలులో వున్నాడా! అవురా— మద్రాసు మెయిల్లో రక్తం కక్కుకోవటం వరకే తనకి జ్ఞాపకం వుంది. అన్నట్టు బాబేడీ?

'మెలకు వొచ్చిందా బాబూ!'' అప్యాయత వొలికే పలకరింపు ఆయనను గుర్తుపట్టాడు. ఆయనే టిక్కెటు కలెక్టరు. ఆపద్బాంధవుడిలా తనని హాస్పటల్లో జాయిను చేసిన వ్యక్తి. కృతజ్ఞత కళ్ళను ఆవరిస్తుండగానే, ఆయన చేతులు పట్టుకున్నాడు రాంబాబు ''మీరు దైవ సమానులు. ఆపదలో నన్నాదుకున్నారు. నే నమకొన్న గమ్యం చేరేవరకూ నా ప్రాణం రక్షించారు'' గాద్గదికంగా మాట్లాడాడు. ఆయన బత్తాయిలు, ఆపిల్సు టేబిలుమీద పెడుతూ ''పర్వాలేదు నాయనా! నీవు త్వరలో సంపూర్ణ ఆరోగ్యవంతుడ వవుతావు. దేవుడు నిన్ను చల్లగా చూస్తాడు...... ఆ! నాకు డ్యూటీకి టైమయింది వస్తా' అంటూ లేచాడాయన. సగం దూరం వెళ్ళి గుమ్మంలో వెనుదిరిగి చూస్తూ 'బాబును డాక్టరుగారు తీసుకు వెళ్ళారు. యిప్పుడు తీసుకు వస్తారు నాయనా'' అంటూ, వడివడిగా అంగలు వేసుకుని, బయటకు వెళ్ళిపోయాడు.

రాంబాబు కిటికీ గుండా క్రింది ప్రపంచం చూశాడు. బాధలతో మూలుగుతున్న మనుష్యులు, కాళ్ళకూ, తలలకూ, కట్లువున్న రోగులు, దైన్యత మూర్తీభవించియుంది. కిటికీ బయటి ప్రపంచంలో నిరాశలో జీవించే ఆశ, ఆశ మధ్య రగిలే స్వార్థం, కుత్సితం, మోసం, మంచిని వంచించిన అనుభవం, యివన్నీ అతన్ని పరిహసిస్తున్నాయి. మీదికి చూశాడు. విశాలమైన ఆకాశం అక్కడక్కడా, కాంతికి ప్రతిబింబంగా, తెల్లని మేఘాలు, అలాంటి ఆకాశం, యెక్కడో భూమితో దూరంగా కలిసినట్లుగా కన్పిస్తుంది. తన పిచ్చిగానీ, విశాలత్వం, సంకుచితత్వం రెండూ కలుస్తాయా! కలిస్తే యింకేముంది. యీ దేశం పుణ్యస్థలిగా మారదూ!

కాస్సేపటికి, సూర్యుడు కిటికీకి యెదురుగా వచ్చాడు. నీ రెండ లాంటి కాంతి, గాజు తలుపుల గుండా పాలరాతిలాంటి గచ్చును ముద్దు పెట్టుకుంటున్నది. యెవరో నర్సు యింజక్షను చేసి వెళ్ళిపోయింది. రాంబాబు మనస్సు కొడుకుని గురించి ఆలోచించింది.

రైల్లో తనకీ సంఘటన జరగకపోతే, తనీ పాటికి అనాథశరణాలయం చేరుకుని వుండేవాడు. బాబును అక్కడ ఒప్పగించి వుండేవాడు. ఆమె తనకి బాబును మిగిల్చి నిండు ఆయువు పోసుకుని, జీవితం ఆవతలి లోకాలకు వెళ్ళిపోయింది. తల్లిదండ్రుల నెదిరించి, సమాజాన్ని ప్రతిఘటించి, సంపదను కాలదన్ని, తను చేసుకున్న వివాహం అది. కానీ కాలం కలిసి రాలేదు. యెన్నో కష్టాలు పడ్డాడు. కార్లలో తిరగవలసిన తను, క్లర్కు పని చేస్తూ కనాకష్టంగా బ్రతికాడు. అయినా తను అసంతృప్తి పడలేదు. ఆమె అనేకసార్లు బాధపడింది, తన జీవితాన్ని నాశనం చేశానని. అప్పుడాతను ఓదార్చేవాడు. ఆమె అతని కళ్ళలో కాంతిని చూస్తూ కాలం గడిపేది. యిప్పుడు తన కళ్ళలో కాంతిని యెవరు చూస్తారు మరి. యేదిటో ఈ జ్ఞాపకాల బారి నుండి తప్పించుకోవాలి. బాబును యెక్కడయినా అనాథశరణాలయంలో చేర్పించి, తన దగ్గర డబ్బు అధికారికిచ్చి, బాబు భవిష్యత్తు సరిదిద్దమని, తనీ జీవితానికి దూరంగా పారిపోవాలి. పాతికేళ్ళు పైబడిన జీవితంలో, యెందుకు యీ బాధలు యిలా తరుముతున్నాయో అతనికి అర్థం కాలేదు. యిలా అను

ంటూ వుండగానే నర్సువచ్చి, సూపరెంటుగారు వార్డులు చూడడానికి వస్తున్నారని చెప్పి వెళ్లిపోయింది.

వార్డులోకి అడుగుపెడుతూ, చిరునవ్వుతో డి. ఎమ్. వో కేస్ షీట్ చూస్తూ, సాలోచనగా డాక్టరు కరుణాదేవి వైపు చూశాడు.

'మీ పేరేమి టన్నారు'' కరుణ ప్రశ్న.

'రాంబాబు అంటారు. అసలుపేరు రామ్మూర్తి'' అని ప్రశ్న వచ్చిన వేపు చూశాడు. ఆమె నెక్కడో చూసినట్లుగా జ్ఞాపకాలు, అపుడే అతన్ని వెన్నంటుతున్నాయి.

''యేం చేస్తున్నారు?''

''యిదివరకు గుమస్తా వుద్యోగం చేసేవాడిని. యిపుడు రాజీనామా చేశాను.''

''యెందువల్ల?''

''అది నా స్వంత విషయం. నా కున్న వ్యాధికీ, దానికీ సంబంధం వుందంటే చెబుతాను.'' కర్కశంగా వున్నాయి మాటలు.

''బాధగా వుందా?''

''యేవిటి జీవితమా, వుద్యోగమా, వ్యాధా?'' చిరునవ్వు నవ్వాడు బాధగా.

''మొత్తం మీద మీకు మూడూ, బాధ కలిగించే ఈ స్థితికి తెచ్చాయి'' అని డి. ఎమ్ వో మధ్యలోనే కలుగచేసుకుని, వంగి స్టెతస్కోపుతో గుండెలు వీపు పరీక్షించాడు. ''మీ గుండె నీరసంగా వుంది. మీకు తగినంత విశ్రాంతి కావాలి ధైర్యంగా వుండండి'' అంటూ, యింకో రూమ్ చూడడాని, కెళ్లిపోయాడు. పది నిముషాలు పోయాక మళ్లీ కరుణాదేవి వచ్చింది.

''రైల్లోకాకుండా, యింతకుముందు ఒకసారి వాంతి వచ్చిందన్నారు కదూ'' అడిగింది.

''అవునండీ యిదివరలో యిలాగే మూడుసార్లు జరిగింది. అపుడేవో మందులు వేసుకున్నాను మళ్లీ యిన్నాళ్లకు మొన్న రైల్లో వచ్చింది'' అన్నాడు రాంబాబు.

'దట్సాల్ రైట్! మీరు ఎక్సురే రూమ్‌కు వెళ్లండి..... నర్సు.....'' అంటూ చెప్పి వెళ్లిపోయింది, నిగర్వంగా. నర్సు వచ్చి చెప్పింది. ''బాబు'' డాక్టర్ కరుణాదేవి గారింట్లో వున్నారని, తర్వాత తీసుకువస్తారని చెప్పమన్నారని చెప్పింది.

పగలు నడిచింది చీకటి పులిమింది. మళ్లా వెలుగు రేఖలు. పదిన్నర ప్రాంతాలలో బాబు వచ్చాడు. రూపే మారిపోయింది. దొరబాబులా వున్నాడు. ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. యేదో చెప్పలేని ఆవేదన, కన్నీళ్లు బాబు తలమీదనే పడ్డాయి, క్రింద జారకుండా. యింతలో కరుణాదేవి లోపలకు వచ్చింది. రాంబాబు కళ్లు తుడుచుకున్నాడు. లేని నవ్వు తెచ్చిపెటు కుంటూనే-''హలో గుడ్‌మార్నింగ్ డాక్టర్! యెలా వున్నాయి నా వూపిరితిత్తులు.''

కరుణాదేవీ బరువుగా నవ్వింది. ''మీకేం పర్వా లేదు. మానసికంగా విశ్రాంతి అవసరం. చాలా జాగ్రత్తగా వుండాలి'' అంది అతని వంక చూస్తూ. రాంబాబు చిరు నవ్వు నవ్వాడు. ''నా కెందుకు/ డాక్టర్ జాగ్రత్త. జీవితం కటిక చీకటి రాత్రిలో చివరి జాములో వున్నాను'' అన్నాడు. ''నో! నో!!'' అలా మాట్లాడకండి. జీవితంలో అంత పెసిమిజం పనికిరాదు. జీవితంలో ప్రతివాళ్లకీ బాధలున్నాయి!'' అంది కరుణ మందలింపుగా.

''చూడండీ డాక్టర్ మీతో పది నిముషాలు మాట్లాడాలి. తీరిక వుందంటారా?'' దీనంగా అర్థించాడు.

''చెప్పండి'' కరుణ కుర్చీలో కూర్చుంది.

''చూడండి డాక్టర్. యిది నాకు వూరుకాని వూరు. అంటే నాదీ అంటూ యెక్కడో ఒక వూరు వుందని కాదు. యిక్కడే కాదు యెక్కడా నాకు యెవ్వరూ లేరూ. వున్నవాళ్లంతా మమతాను బంధాలకన్నా, అంతస్తుల మధ్య యిరుక్కుపోయి వున్నారు. నాకున్నదల్లా, నాకు మిగిలినదల్లా, నా బాబు ఒక్కడే. 'యెన్నో మలుపులు తిరిగిపోయిన నా జీవితంలో, యింకేం కోరిక లేదు. బాబు నెక్కడయినా, అనాథ శరణాలయానికి ఒప్పగించి ......'' కాస్సేపు ఆయాసం వచ్చింది రాంబాబుకు.

''తర్వాత'' కాస్సేపు పోయిన తరువాత కరుణ ప్రశ్న ఆతృతగా.

''ఆ తర్వాత గమ్యస్థానం లేని తెగిన గాలిపటమే నేను. శేషజీవితాన్ని హిమాలయాల్లో గడిపేద్దామనుకుంటున్నాను .... కానీ బాబును, యెక్కడో ఒక ఆశ్రయంలో వుంచేవరకూ బ్రతుకుతానన్న ఆశ కన్పించటం లేదు. ఒకప్పుడు, నా జీవితం ఆరిపోతే...... మీరు మాత్రం బాబును అనాథ శరణాలయంలో చేర్పించండి'' అతని కంఠం గద్గదికమైంది.

''నో! నో!! మీ ప్రాణాని కేం భయం లేదు. నాదీ బాధ్యత. మీ రనవసరంగా ఆందోళన పడకండి.'' అంది కరుణ అతనికి ప్రోత్సాహమిస్తూ.

'అదికాదు డాక్టర్ నేను బ్రతికేటట్లయితే, బాబుకూ, బాబునుకన్న ఆమెకూ న్యాయం చేకూరుస్తాను. యిప్పటికే ఆమెకు చాలా అన్యాయం చేశాను. ఆమె ఆత్మ శాంతించాలి. అదే నా చివర కోరిక'' అన్నాడు రాంబాబు బాబు తల నిమురుతూ.

''మీతో యిలా పరిచయస్తురాలిగా మాట్లాడుతున్నానని మరోలా భావించకండి. మీరు మానసికంగా చాలా బాధ పడుతున్నట్లుగా కన్పిస్తున్నారు. దాని కేమయినా ప్రబల కారణం వుందా?'' అంది కరుణాదేవి.

నిర్జీవమైన నవ్వు నవ్వాడు రాంబాబు.

''మనస్సు వుంటేకదా డాక్టర్ బాధపడడానికి మనస్సు మేధస్సు, ఆమె తీసుకు వెళ్లిపోయింది. సుమారు నాలుగు సంవత్సరాల క్రితం, పెంపకం తలిదండ్రుల నెదిరించి వెళ్లిపోయాను. చిన్నపుడే నన్ను కన్న తలిదండ్రులు కన్నకొడుకు చిన్నవాడైనా రాజభోగాలతో తులతూగాలని ఆప్యాయంగా ఒక లక్షాధికారి, మా బంధువులకు దత్తత యిచ్చారు. రాజహోదాలోనే జీవించాను. ఎమ్. ఏ. చదివాను. అప్పుడే నా కామెతో పరిచయమైంది. ఆమె పేరు జ్యోతి'' సగంలోనే ఆగి అతను నిట్టూర్పు విడిచాడు. డాక్టర్ కరుణాదేవి ఫ్లాస్కులో హార్లిక్సు గాజు గ్లాసులో పోసిచ్చింది.

'కానీ మా దత్తత తలిదండ్రులు, ఆమెను వివాహ మాడటానికి ఒప్పుకోలేదు. కారణం ఆస్తి, అంతస్తు, బంధుత్వం, యేమీ లేకపోగా, ఆమె జాతి మనిషి కాకపోయినందువల్ల.. .. ఆ రోజు నా కింకా జ్ఞాపకం వుంది... అమావాస్య రాత్రి. మా ఘోరమైన వర్షం కురుస్తోంది. రావుబహద్దరు రంగారావుగారు, నన్ను పెంచుకున్న తండ్రి గంభీరంగా కళ్లు యెర్ర చేసుకుని, నన్ను యింట్లోనుండి వెళ్లిపొమ్మన్నారు. అంతే! నేను ఆ యింటికి వెళ్లలేదు.. జ్యోతి కెవ్వరూ లేరు, ఒక్క పక్షవాతంతో బాధపడుతున్న తండ్రి తప్పించి. ఆయన మేం పెళ్లి చేసుకున్న తరువాత మరణించారు. ఆ తర్వాత మేం చాల బాధలు పడ్డాం ఆర్థికంగా. చివరకు విధి గూడా మమ్మల్ని పగపట్టింది. చివరిసారిగా ఆమెను నా నుండి వేరు చేసింది. ఆమె మరణించే ముందు నా చేతిలో బాబును అప్పగిస్తూ ''బాబు కోసం మీరు జీవించండి. దిగులు పెట్టుకోకండి. మంచి శిక్షణలో పెంచండి. మీరు త్వరలో పెండ్లి చేసుకోండి. నానుండి దూరమైన మీ తలిదండ్రులకు ఆనందం కలిగించండి.'' అని ప్రాణాలను విడిచింది. ముత్యాల్లాంటి కన్నీరు అతని శుష్కించిన బుగ్గల మీద పెరిగిన నల్లని గడ్డంమీద మెరిసాయి. అతనింక మాట్లాడలేదు. కరుణాదేవికి జాలివేసింది. యెంత ఆవేదన అనుభవిస్తున్నాడో ఆమె అంచనాకందలేదు. 'నా మాటమీద విశ్వాసం వుంచండి. సుమారు ఒక వారం రోజుల్లో మీరు మళ్లా మామూలు మనిషైపోతారు.''

''చాలు డాక్టర్. నా కీ తియ్యని మాట చాలు''

''అయితే తియ్యని మాటతో రెస్టు తీసుకోండి'' కరుణాదేవి నవ్వింది. ''చెప్పటం మరిచాను. బాబును మా యింట్లోనే వుంచుకుంటాను. మీ రేం అతనికోసం బెంగ పడకండి'' అంటూ వెళ్లిపోయింది. రాంబాబు, ఆమె వెళ్లిపోయిన దిక్కుకే చూసుకుంటూ, నిద్రలోకి జారిపోయాడు.

* * *

కార్లో ప్యాలెస్‌కు వచ్చిన కరుణాదేవి మనస్సు వెనకటి జ్ఞాపకాల మీదకు మళ్లిపోయింది. మామయ్య చెప్పిన రాంబాబు యితనే అయివుండాలి. చనిపోతూ ఆయన చెప్పిన మాట లింకా తన హృదయంలో మార్మోగు తున్నాయి. ''అమ్మా కరుణా! బంధువుల్లో యోగ్యుడయిన కుర్రవాడిని తెచ్చి రాజహోదాలో పెంచాం. పేరు నిలుపుతానన్నవాడు, పేద కుప్పలో పడ్డాడు. అది వాడు చేసిన తప్పు కాదమ్మా. వయస్సు అలాంటిది. యవ్వనంలో పొంగే రక్తంలో, ఆరాధనా భావం, ఆవేశం, అతనిచేత అలా చేయించింది. వయస్సు అనుభవం పెనవేసుకున్న జీవితంలో, ఈ ఆరాధనా శాంతం నశించి, విమర్శనాశక్తి. విచక్షణ శక్తి మిగిలిపోతుంది. అపుడతను నా క్షోభ గుర్తించ గలుగుతాడు. లేకపోయినా పర్వాలేదు. ఆస్తి నీ పేరున వ్రాశేశాను. నీవైనా నిర్దుష్టంగా జీవన మార్గం సరిదిద్దుకో.'' అని చనిపోయారు రావు బహద్దరు రంగారావుగారు. చనిపోతున్నపుడు గూడా రాంబాబు ఫోటోవైపు దీనంగా చూస్తూ ప్రాణాలు విడిచారాయన.

ఆనాటి రాంబాబు! అపుడు తను మెడ్రాస్‌లో వుండేది. తన తలిదండ్రులు ఆర్థికంగా బీదవారు అవటంవల్ల, తనని ఆయనే చదివించారు. వాళ్ల బంగళాలోనే తను తలిదండ్రులతో వుండేది. అపుడపుడు రాంబాబు మద్రాసు వచ్చేవాడు. బంగ్లాలో వుండేవాడు. యెక్కువ పరిచయం లేదప్పట్లో. తన తలిదండ్రులు మాత్రం చాలా

గౌరవంగా చూశేవారతన్ని. తమ యిద్దర్నీ ఆదర్శ దంపతులుగా చూద్దామని, రంగారావుగారి రంగుల కలలన్నీ, రంగులరాట్నంవలె తిరిగిపోయాయి. ఆయన ఆశయాల్ని ఆశల్ని, అన్నిటినీ త్రెంచివేశి మరోరకం జీవితంలో, తన ఆశల్ని, ఆశయాల్ని పండించుకోవాలను కున్నాడు రాంబాబు. జీవితం యిపుడతని కిచ్చినది గెలుపో, వోటమో! యెలా తెలుస్తుంది.

ఆమె మనస్సు గతంనుండి, వర్తమానంలోకి అక్కడ్నుంచి, భవిష్యత్తులోకి తొంగి చూస్తున్నాది. హాస్టల్లో ఎక్సురే ఫోటో పట్టుకున్న టి. బి స్పెషలిస్టు శ్రీ పట్నాయక్ అన్నమాటలే ఆమెను మరింత కలవరపెడుతున్నాయి. "మిస్ కరుణాదేవీ! ఈ కేస్ మీ యింటరెస్టెడ్‌లా వుంది. మీరూ డాక్టర్ కాబట్టి నిజం దాచకుండా చెప్పాల్సి వస్తోంది. టి. బి. యినీషియల్ స్టేజి దాటిపోయింది. కేస్‌ను యెంతో జాగ్రత్తగా ట్రీట్ చెయ్యాలి మనస్సుకు యెంతో వుత్సాహం కావాలి ఆయన మనతో బాగా కోపరేట్ చెయ్యాలి. మందులు, అవీ రాశిస్తాను. మీరే ట్రీట్ చేయండి" అన్నారు కరుణాదేవి గుండె బాధతో నిండిపోయింది. ఆమె అనుమానమే నిజమయింది. యెన్ని రంగాలలో మానవులు పురోగమిస్తున్నా, మృత్యువును మాత్రం జయించలేక పోతున్నారు యెవరి ఆస్తిపాస్తుల వలన, తను జీవితంలో వున్నత స్థానం సంపాదించిందో, వాళ్ల ఋణం తను తీర్చుకోవాలి. అతన్ని దక్కించుకోవాలి. ముప్పై యేళ్లయినా నిండని అతని జీవితంలో మళ్లీ వసంతం రావాలి ఆమె ఆలోచనల కంతరాయం కలిగింది. యేదో శబ్దం వల్ల. చూస్తే ద్వారాన్నానుకుని, రాంబాబు కొడుకు చిరంజీవి గులాబిరంగు బుగ్గల్తో, తెల్లని మేని ఛాయలో మిసమిసలాడుతున్నాడు. కళ్లల్లో వింత కాంతి. కరుణాదేవి జ్యోతి అందం, చిరంజీవిలో వూహించింది. అద్దంలో తన కళ్లను చూసుకుంది ఆ కళ్లల్లో కాంతికే, యింజనీర్ రవి యెంతో పొగిడాడు. తను సిగ్గుతో మొగ్గే అయిపోయింది రవీ, తనూ, పెండ్లి చేసుకుందా మనుకున్నారు. కానీ యెలా! విషమ సమస్య యెదురయింది.

ఆశాకిరణం

"అమ్మా యీ బొమ్మ తిరగటం లేదూ! తిప్పించవూ!" అంటూ రవి ముద్దుగా బొమ్మను తీసుకు వచ్చాడు. 'అమ్మా' అనే మాట, ఆమె అంతరాంతరాలలో యెక్కడో ఆర్ద్రతను స్పందింప జేశింది. "బాబూ" అంటూ ఆమె కౌగలించుకుంది.

* * *

రోజులు గడుస్తున్నాయి. రాంబాబు కోలుకుంటున్నాడు. కృశించిన బుగ్గల్లో యెరుపుదనం అందం, తేజస్సు వస్తున్నాయి. అతనికి కావల్సిన ప్రతి క్షణంలోని అవసరం యెంతో శ్రద్ధగా చూస్తున్నాది, కరుణాదేవి బాబు అమె దగ్గిరే వుండిపోతున్నాడు. డాక్టర్ పట్నాయక్ గూడా రెండుసార్లు వచ్చి ఎగ్జామిన్ చేశారు. ఆయన గొప్ప ఎక్సుపర్టు. "బాగా మాతో కోపరేట్ చేశారు అందువలననే త్వరగా కోలుకున్నారు మీరు. మరేం భయంలేదు" అంటూ, రాంబాబును ప్రశంశించాడు రాంబాబుకు పట్టుకున్న సందేహమల్లా ఒక్కటే? యెవరీ కరుణాదేవి, యెందుకు తనంటే ఆమెకి శ్రద్ధ? అదే ప్రశ్న ఆమె నడిగాడు. కరుణాదేవి నవ్వేశింది. సమాధానం ఆమె తరువాత చెబుతాననేది. కాంతివంతమైన ప్రేమపూరితమైన ఆమె కళ్లలోకి చూస్తూ, అలానే వుండిపోయేవాడు.

శానిటోరియంనుండి డిశ్చార్జ్ అయిన తరువాత కరుణాదేవి రాంబాబును తన ప్యాలెసుకు తీసుకు వెళ్లింది. ముందుహాల్లో పెద్ద ఫోటో. రాజఠీవి, దర్పం ఆ మూర్తి నుండి ప్రసరిత మవుతోన్నట్లుగా వుంది. ఆయనే రావుబహద్దరు రంగారావుగారు. అప్రయత్నంగానే, అశ్రునయనాల్తో అంజలి ఘటించాడు. కరుణాదేవి ఆ దృశ్యానికి ముగ్ధురాలై పోయింది.

"ఆయ నెవరో మీకు తెలుసా?" కరుణాదేవి ప్రశ్న. రాంబాబు నవ్వాడు. "ఆయన మా నాన్నగారు" అన్నాడు కళ్లు తుడుచుకుంటూ.

"నే నెవరో మీకు తెలుసా?" అంది కరుణ కాంతివంతమయిన కళ్లతో. అతను తలూపాడు

"నే నాయన కోడల్ని" అంది సిగ్గుతో కాలి బొటనవ్రేలు నేలరాస్తూ. "అహా!" అనేశాడు రాంబాబు. అయితే యెలాంటి కోడలో అడగాలనే వుంది మరి. యేమనుకుంటుందో ఆమె, మరి అడగలేక పోయాడు

"యెలాంటికోడలో అడగాలనుంది కదూ!" అందామె చిరునవ్వుతో. ఆ సంభాషణ కంతరాయమే కలిగింది. "అమ్మా" అంటూ బాబువచ్చి, ఆమెను చుట్టేశాడు. ఆమె యింకేం సమాధానం చెప్ప గలదు. ముద్దుగా బాబు నెత్తుకుంది రాంబాబుకు మేడమీద తన గది ప్రక్కనే, యేర్పాటుచేసిన గది చూపించింది

భోజనం చేసిన తరువాత నిద్రకుపక్రమించేదే కానీ రాంబాబుకు నిద్రపట్టలేదు అతని మనస్సంతా కరుణాదేవి ఆక్రమించేసింది. యేవి టీ అనుబంధం అనుకుంటూనే మగతగా నిద్రపోయాడు. యెపుడు లేచాడో యేమో ,దీపాలు కాంతులు వెదజిమ్ముతూన్నాయి. వంటమనిషి కాఫీ తెచ్చింది

"అమ్మగారు మీరు లేస్తే బజారు వెళ్దామని చెప్పమన్నారండీ. బాబును గూడా తీసికెళ్లారండీ" అంది భయభక్తులతో ప్యాలెస్ అంతా తిరిగాడు. డ్రాయింగ్‌రూమ్‌లోకి వెళ్లి పేపరు చదువుతుంటే సగం తెరిచిన వుత్తరంలో రవి అన్న సంతకం అతన్ని ఆకర్షించింది. చదవాలన్న కుతూహలం కలిగించింది. తప్పుచేస్తున్నాననే భ్రాంతితోనే వుత్తరం తీశాడు.

డాక్టర్! శ్రీమతి! కరుణా రాంబాబుకు,


ఉభయకుశలోపరి. నీ వుత్తరం చదివాను. నీ నిర్ణయం యెంతో హర్షనీయమైనది. "మోడు వారిపోయిన అతని జీవితంలో మళ్లీ వసంతం రావాలి. అపుడే నా జీవితానికి, మనుగడకు సాఫల్యం సిద్ధిస్తుంది. క్షమించమని రాశావు" నిజమే నీవు సౌభాగ్యవతివై, నిండుగా, పసుపు కుంకుమలతో వర్ధిల్లాలని నా కోరిక. చైతన్య జీవన స్రవంతిలో, మనం ఆగి చూసేందుకు యేమీ మిగలదు. జీవితాన్ని యే కోణం నుండి చూస్తూ, అనుభవిస్తున్నామనే తృప్తి మాత్రం మిగులుతుంది. ప్రేమ యెంతటి త్యాగానికైనా వెనుదీయదన్న భావాన్ని నేను నమ్ముతున్నాను. మా మామయ్య కూతురు శ్యామసుందరి నన్ను ప్రేమించింది. కానీ యెపుడయితే నేను వేరు సంబంధం చేసుకుంటున్నానని తెలిసిందో మొన్నను ఆత్మహత్య ప్రయత్నం చేసింది. కానీ సకాలంలో డాక్టరు రావటంవల్ల, నా శ్యామును బ్రతికించుకున్నాను. ఆమెనే పెళ్లి చేసుకుంటాను. త్వరలో శుభలేఖ పంపిస్తాను.

అభినందనలతో నీ సోదరుడు,

'రవి'.

వుత్తరం చదివేసరికి రాంబాబుకు కరుణ ఎవరో తెలిసింది. "యెంతత్యాగం చేస్తున్నావు కరుణా. నాలో యేంచూసి యింత మమతానుబంధాలు, నీ ఆశల్లో, వూహల్లో పెనవేసుకున్నావు" అనుకున్నాడు. కిటికీనుండి అనంతాకాశంలో మినుకు, మినుకు, మంటూ కలిగే నక్షత్రాలను చూస్తున్నాడు!

"యేమిటీ చూస్తున్నారు. చుక్కల్ని చూస్తున్నారా? చంద్రుడ్ని చూస్తున్నారా?" అన్న ప్రశ్న



అతని యేకాంతానికి భంగం కలిగించింది. వెనుదిరిగి చూస్తే, తెల్లనిబట్టల్తో దేవతలా, సౌందర్యం పులుముకొన్న కరుణ. బాబు. వెనుకాతల డ్రైవరు, మోయలేక మోయలేక మోస్తుకొస్తున్న సామాన్లు. అవన్నీ రాంబాబు గదిలోకి వెడుతున్నాయి యెప్పటి రోజులో జ్ఞాపకం వచ్చాయి రాంబాబుకు యేమని సమాధానం యివ్వాలో, అతనికి తెలియలేదు. బాబు దగ్గరికి వచ్చి, బొమ్మల్ని చూపిస్తున్నాడు. ఒక బొమ్మ నేలమీద తిరుగుతూ సన్నాయి వాయిస్తున్నది. కరుణ అపుడే తనమీద సర్వాధికారాలు తీసుకుంటున్నదేమోనన్న భ్రమ కలిగింది. ఆమె ప్రశ్నకు సమాధానంచెప్పేలోపునే అర్జంటు కేసంటూ,కరుణకు ఫోన్ రావటం, హాస్పటలుకు వెళ్లిపోవటం జరిగింది.

ఆవెళ్లటం, కరుణాదేవి, తెల్లవారురుజామున నాలుగు గంటల తరువాత యింటికి వచ్చింది. మగతకళ్లతోనే నిద్రలోకి జారుతూ రాంబాబు గది వైపు చూసింది లైటు వెలగటం ఆమెకు ఆశ్చర్యం వేసింది. తలుపు మెల్లగా నెట్టింది. రాంబాబు బెడ్‌మీద లేడు. మీద ఫేన్‌గాలికి నీలిరంగు కాగితం రెపరెపలాడుతోంది. ఆశ్చర్యం, భయం, ముప్పిరిగొనగా, ఆమె వణుకుతున్న చేతులతో తీసింది

చి. సౌ కరుణాదేవికి,

నీకెలా వుత్తరం రాయాలో తెలియటంలేదు. మానసికంగా శారీరకంగా, కృంగి కృశిస్తున్న నా జీవితంలో మళ్లీ వసంతోదయం కలిగించావు. చాలా కృతజ్ఞుడ్ని.

నా జీవితం చెదలు కొరికిన డైరీ లాంటిది. పరిపూర్ణతలేనిదీ, ఫలితాననుభవించ లేనిది,హీన చరిత్రమైనదీ నా జీవితాతం

నా జీవితాన్ని, నీ కుంకుమరేఖ సరిదిద్దుకున్నావు అందుకు అనర్హుడ్నేమోనని నా సంశయం. నాజ్యోతి, జీవితపు సరిహద్దుల్ని దాటినపుడే నేనుదాటిపోవాలనుకున్నాను. కానీ వచ్చీ,రానీ జ్ఞానంతో, మాతృవిహీనుడైన నా బాబుకోసం, యీలోకంలో యింతవరకూ జీవించి యున్నాను.

బాబు అనాథ కాకూడదు. వాడు గొప్పవాడు కావాలి. అదే నా కోరిక.

నీకంటూ ఒక జీవితం యేర్పడితే, ఆస్వార్థంలో బాబుకు నేనెక్కడ దూరమయిపోతానేమో నన్న భయం, నన్ను భూతంలా బాధిస్తున్నది. మనస్సుకూ, ఆలోచనకూ, యెక్కడా రాజీ కుదరడంలేదు. మన శ్శాంతికోసం వుత్తరాది వెడుతున్నాను. మహిమాన్వితములైన హిమవత్పర్వతచ్ఛాయల్లో కొంతకాలం వుంటాను. బాబును నీకే ఒప్పగిస్తున్నాను.

ఆప్యాయత, అభిమానం, అనురాగం, ముప్పిరిగొన్న నీ మమతానుబంధాల నీడల్లో, తలదాచుకోవాలని, యెప్పటికయినా తిరిగి వస్తాను. అంత వరకూ నీకూ, నాకూ ఈ సుదీర్ఘ ప్రశాంత వీరీక్షణ తప్పదు.

ఇట్లు,
రాంబాబు

ఉత్తరం చదివిన కరుణాదేవి హృదయంలో ఆశాకిరణం వికసించింది "వాస్తవమే. అయన తప్పక తిరిగి వస్తారు"అని అనుకుంది

అపుడేతూర్పుదిక్కున అరుణోదయమైంది

వారఫలం

12-7-1968 శుక్రవారం మొదలు
18-7-1968 గురువారం వరకు

మేషం: వ్యాపారంలో మీ ఆలోచనలకు తగిన అవకాశాలు లభిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది.

స్త్రీలకు— అధికవ్యయం జరుగుతుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

వృషభం. వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు అనుకొన్నట్లుగా నెరవేరుతాయి. రావలసిన డబ్బు సమయానికి అందగలదు. ప్రయాణంద్వారా కార్యసాధన చేయగలరు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. బంధువులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

మిథునం: ఇదివరకు మీకు ఆందోళన కలిగించిన వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది నూతన వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. విద్యా వైజ్ఞానికరంగాల్లో మీకృషి రాణిస్తుంది. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. పోటీవారిలో గౌరవం లభిస్తుంది.

కర్కాటకం వారం ప్రారంభంలోనే వృత్తివ్యాపారాల్లో చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

సింహం: వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి. ఉద్యోగంలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. బంధుమిత్రులను కల్సుకొంటారు.

కన్య: వ్యాపారంలో పోటీవారితో పోటీ పెరుగుతుంది. ఇతరులమీద ఆధారపడి యే వ్యవహారమూ ప్రారంభించడం తగదు. సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. ఆడంబరంకోసం వ్యయం చేస్తారు.

తుల: వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభించగలవు. పోటీవారితో మాటపట్టింపులు తగవు. ప్రయాణాలు కొంచెం శ్రమమీద ఫలిస్తాయి. సాహిత్యకళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

వృశ్చికం: సామాన్యమైన పనులకు కూడా విశేషమైన ప్రయత్నం చేయవలసి వస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. సాహిత్యకళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. నూతన వ్యవహారాలు శ్రమ మీద ఫలిస్తాయి. పోటీవారిలో గౌరవం బాగా ఉంటుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

ధనుస్సు: వ్యాపార విస్తరణ ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి. సాహసముతోకూడిన వ్యవహారాలు లాభిస్తాయి. స్థిరాస్తి వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. మిత్రులకు సహాయం చేస్తారు. సంతోషకరమైన వార్తలను వింటారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. దైవకార్యాలు నెరవేరుతాయి.

మకరం: భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. అన్‌కారుల వలన జరుగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. కోర్టు వ్యవహారాలు బాగా ఉంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కుంభం. వృత్తివ్యాపారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. నూతన వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. సాహిత్యకళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

మీనం: లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం వచ్చే పరిస్థితి యేర్పడుతుంది. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. వారం మధ్యలో అనుకూల పరిస్థితి యేర్పడుతుంది వృత్తిలో ఆదాయం బాగా ఉంటుంది. పోటీవారిలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

—మహేష్

చర్చ

కాలం నేర్పిన గుణపాఠం

21—6—68 వారపత్రికలో, శ్రీమతి కె. హేమలతగారు వ్రాసిన వ్యాసం చాలా బాగున్నది. అది అందరికి సంబంధించినది "సోదరీ, మీ అభిప్రాయముతో నేనూ ఏకీభవిస్తున్నాను" ఏమైనప్పటికీ నేటి సినిమాలు ఆ మాదిరిగా వుండబట్టే మా విజయవాడలాంటి నగరములోనే అవి నాలుగు వారములు ఆడితే గొప్పగావుంది. దీనినిబట్టి ప్రజలలో కూడా వాటిమీద ఏహ్యాభావము ఏర్పడి పది. అని నిర్మాతలు గ్రహించవలెను. కాలమే వారికి మంచిపాఠము నేర్పుచున్నది. సెభాష్ సోదరీ, నేను అనుకొన్నదానిని మీరు అక్షరాలా తెలిపినారు"

ఉప్పులూరి వెంకట సత్యవతి, (విజయవాడ)

కనువిప్పు

కె. హేమలతగారి "సినిమాలలో అసభ్య వస్త్రాలంకరణ" వ్యాసము చాల బాగున్నది. ఒక్క జానపద చిత్రాలలోనేకాక పౌరాణిక చిత్రాలలోకూడ ఇటువంటి సెక్సును ప్రదర్శించుట నునది విచారకరమైన విషయం. సినిమాలనుంచి మంచిని గ్రహించే వారున్నారు. చెడుని గ్రహించే వారున్నారు. కాని ఇప్పటి సినిమాలలో చెడునడుతయే ఎక్కువగా వుంటే ఇకమంచిని గ్రహించేవారెవరు? దేశం ఎప్పటికైనా బాగుపడుతుందా. ఒక మహిళ పరిపాలించే ఈ దేశంలో మహిళాలోకానికే తలవంపు తెస్తున్నాయి ఈ చిత్రాలు.

కాని హేమలతగారు వ్రాసిన ఈ వ్యాసంవలనైనా సినీ ప్రపంచమునకు కనువిప్పు కల్గునని నా అభిప్రాయము. హేమలతగారు ఈవ్యాసంవలన నా మనస్సును తేలిక పర్చారు.

ఎస్. ఉమాదేవి, (ఆలమూరు)

డబ్బు చేసుకోవడమే ప్రధానోద్దేశ్యమా?

నేటి సినిమాలలో అసభ్య వస్త్రాలంకరణ, అసభ్యసన్నివేశాలు, అశ్లీల సాహిత్యం అన్నిమిళితమై ఉంటున్నాయి. వినోదం కోసం, కాలక్షేపంకోసం మాకు వెడతారు చాలమంది. కానీ నేడువస్తున్న సినిమాలు కుటుంబంలోని వ్యక్తులందరూ చూడవీలులేనటువంటివి. అన్నదమ్ముళ్లతో తల్లిదండ్రులతో కాపీ వెళ్లి సినిమాలో కూర్చుంటే కొన్ని సన్నివేశాలు చూడలేక మధ్యలో లేచి రావలసి వుంటుంది

ఇక అందులోని కొన్ని పాటలు రేడియోలో ప్రసారమైనప్పుడు కానీ, రోడ్డుమీద సినిమా అడ్వర్టైజుమెంటు బండిలో పెట్టినప్పుడు కానీ వింటూంటే ఒక్కోసారి చీదరింపు కలుగుతుంది. అంత జుగుప్సాకరంగా, ఎందుకుంటాయో మరి ఆ పాటలు?

దేవాలయాలమీద బూతుబొమ్మలు లేవా? ప్రాచీన గ్రంథాల్లో ఎంత అసహ్యకరమైన వర్ణనలు లేవు? అని కొందరు ప్రశ్నించవచ్చు. కానీ దేవాలయంమీది బొమ్మలు అందరూ చూడక పోవచ్చు. అల్లాగే ప్రాచీన ప్రబంధాలూ కొందరికే పరిమితం. సినిమాలు నేడందరికీ అందుబాటులో వున్న వినోదసాధనం కాబట్టి జనసామాన్యం ఆ సినిమాల్లో వున్నవి నిజమని భ్రమించి అనుకరించే ప్రమాదమున్నది. ఎందరో అనుకరిస్తున్నారు అందులోని ప్రతి అంశాన్నీ! సమాజంలోని వ్యక్తులు చాలమంది సినిమాలను చూచి ఆవేషధారణ అలవరచుకుంటున్నారు ఇది ఒక బలహీనత అని సరిపెట్టుకున్నా దానివల్ల ఎన్నో నష్టాలు సంభవిస్తున్నాయి. అది నటన, ఇది నిజజీవితం అని గుర్తించలేని అమాయకులు వీరు, ఏం చేద్దాం?

సెక్సుకు సంబంధించిన విషయాలు, అసభ్యకరమైన నృత్యాలు వుంటేనే డబ్బొస్తుందనీ, ప్రేక్షకులు అలాంటి పిక్చర్సనే ఆదరిస్తారనీ నిర్మాతలు అనవచ్చు. కానీ ఇలాంటి వేవీలేని సినిమాలు ఇదివరకు ఎన్ని రాలేదు? ఇప్పుడుమాత్రం ఎన్నిలేవు? అవి డబ్బుచేసుకోడంలేదా?

"ప్రేక్షకమహాశయుల కోరికననుసరించే ఇలాంటి పిక్చర్స్ తీస్తున్నార"ని ఒక తార అన్నారు.

"వాళ్లు తీస్తున్నారు కాబట్టి మనం చూస్తాం, మందేం పోయింది"—అని ప్రేక్షకుడు అనుకుంటాడు. ఇక దీనికి అంతెక్కడ? మధ్యలో బాధపడేది ఎవరు? స్త్రీకి ఎంతోగౌరవం యిచ్చే దేశం మనది. ఎన్నో రకాల మనస్తత్వాలు గల స్త్రీలు సమాజంలో వుండవచ్చు. వాళ్లు ఎలాంటి దుస్తులు ధరించినా, ఎలా మెలిగినా బాధపడేది ఆ స్త్రీకి సంబంధించిన వ్యక్తులు మాత్రమే. కానీ సినిమా అలాకాదుకదా? లక్షలమంది అందులోని అంశాలు చూస్తారు. అమాయకులు అనుకరిస్తారు.

కాబట్టి యికనైనా "యిల్లాంటి సినిమాలైతేనే మేము చూస్తాం" అని ప్రేక్షకులు అనకుండా "మీరు ఆదరిస్తున్నారు కాబట్టి ఇలాంటివే తీస్తాం" అని సినిమావారనకుండా —రాజీకివచ్చి మధ్యన యిరుక్కుని బాధపడే స్త్రీకి గౌరవం కాస్తైనా కలిగిస్తారని ఆశిద్దాం!!

కుమారి బి. అచ్చమాంబ (తిరుపతి)

వ్యాపార దృష్టి

21—6—68 వారపత్రికలో శ్రీ హేమలత గారు వ్యాసరూపముగా వ్రాసిన "సినిమాలలో అసభ్య వస్త్రాలంకరణ" చదివిన పిమ్మట నాలో ఆవేశము కట్టలు త్రెంచుకొంది. హేమలతగారు 'నటన' 'కళాసేవ' వగైరా వంకలతో నేటి సినిమాలలో అసహ్య వస్త్రాలంకరణను గూర్చి చక్కగా అభివర్ణించారు. సినిమా వ్యాపారమునకు 'డబ్బు' రావాలని 'స్త్రీ'ని అనేక భంగిమలలో అసభ్యంగా చూపించి యావత్ స్త్రీ జాతినే అవహేళన చేయుట సహించరానిది. సినిమాలలో 'సెక్స్' జొప్పించి డబ్బు సంపాదించాలనుకునే నిర్మాతలకు చక్కని గుణపాఠము నేర్పినట్లయినది.

వై. సరస్వతీ సత్యనారాయణ, (నెల్లూర్)

గొప్పలోపం

శ్రీమతి కె. హేమలతగారి "సినిమాలలో అసభ్య వస్త్రాలంకరణ" అను వ్యాసము నేటి సినిమాలలో ఉన్న గొప్పలోపాన్ని చక్కగా తెలియబరచుచున్నది. ఆమె అభిప్రాయంతో నేను, నా మిత్రులు, ఏకీభవిస్తున్నాము. రచయిత్రి ప్రార్థనతో బాటు మేమును "ఇకముందు సినిమాలలో ఇటువంటి అసభ్యకరమైన సన్నివేశాలకు వస్త్రాలంకరణకు ప్రాముఖ్యత నివ్వకుండా చూడవలయునని ప్రభుత్వాన్ని పదేపదే కోరుచున్నాము.


కుమారి వి. బి. యస్ నాగమణి, (హుబ్లి)


మగవారికే అసహ్యం!

21—6—68 ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రకటించిన "సినిమాలో ఆసభ్య వస్త్రాలంకరణ" శీర్షికను కె. హేమలతగారు బాగా వ్రాశారు. నేడు సినిమాలలో అవలంబించుచున్న వస్త్రాలంకరణ మగవారికే అసహ్యముగ వున్నప్పుడు ఇక స్త్రీల విషయము వేరే చెప్పనక్కర లేదు. ఈ ఆడవారు యిలాంటి వస్త్రాలంకరణను ఎందుకు సహించి సినిమాలు చూస్తున్నారో కాని, హేమలతగారు వాటిని బాగా ఖండించారు. ఇలా నిర్కర్షగ వ్రాసినందులకు ఎంతైనా ఆమెను అభినందించవలసినదే!

ఎ. ప్రసాద్, (ధర్మవరం)

ఉత్తమ ఫలితాలు


ఉత్తమ చిత్రం
ఉత్తమ నటి
ఉత్తమ నటుడు
ఉత్తమ హాస్యనటుడు
ఉత్తమ హాస్యనటి
సెక్స్‌ని ప్రదర్శించడం ఎలా?
ఉత్తమ దర్శకుడు
ఉత్తమ సంగీత దర్శకుడు
"ఈ కార్టూను వేసింది ఎవరు సార్?"
ఓ ఉత్తమ ప్రేక్షకుడు



జరిగిన కథ

చాలా కష్టాల్లోవుండ శ్రీనివాస్ తల్లి చని పోయింది. తండ్రి గోపాలం వ్యసనాల పుట్ట. అతను రెండో వివాహం చేసుకుంటాడు. అంత వయసువాడితో తనకి వివాహం జరిగినందుకు సుభద్ర లోలోన కుమిలిపోతుంది. ఆ కక్షని గోపాలం కూతురు సరస్వతిమీద తీర్చుకోవాలని చూస్తుంది. సరస్వతి శ్రీహరిని నమ్ముకొని మోసపోతుంది. సుభద్ర శ్రీనివాస్ చదువుకు సాయంచేయాలను కుంటుంది. గోపాలం చనిపోతాడు. శ్రీనివాస్ బాజ మండ్రిలో రామదాసుగారింట్లో వుండి చదువు కుంటుంటాడు. సరస్వతి మనోవ్యాధితో కృశించి పోతుంది. జగదీశ్ సుభద్రని వశపరచుకోవాలని చూస్తుంటాడు.

5

రెండు మూడు రోజుల వరకూ శ్రీనివాస్ కంటికే కనిపించలేదు అవధాని గారు. శ్రీనివాస్ వూరినుంచి వొచ్చాక కూడా ఆయన కనిపించకపోతే అతని మనసు బాధ పడిపోయింది. ఆ మాటే అన్నాడు అన్నపూర్ణతో 'ఏం పిన్నీ' యివాళ్ళా బాబాయి కనిపించలేదు వూళ్లో లేరా'.

'పొలం వెళ్ళారు శ్రీనివాస్.'

'అదేమిటి పిన్నీ ఆయన అలవాట్లు మారి పోయాయా. నేను లేకపోతే భోజనం కూడా చేసేవారు కాదు. అటువంటిది యెందుకిలా మారిపోయారు ?'

'కొత్తపనులు తగులుకున్నాయి యీ మధ్య. అందుకే ప్రొద్దుటే వెళ్లి పోతున్నారు.'

'రాత్రి వచ్చినా కనిపించడంలేదు. యేదో వుంది కారణం చెప్పండి పిన్నీ.'

అన్నపూర్ణ నిట్టూర్చింది. శ్రీనివాస్ భోజనం ముగించి అరుగుమీద కూర్చు న్నాడు. 'యేమైనా సరే పిన్నీ యివాళ ఆయన వచ్చేవరకూ యిక్కడే వుంటాను.'

అన్నపూర్ణ అంది : 'ఆయన పలివెల వెళ్ళారు. ఈ రాత్రి వస్తారో లేదో.'

'పోనీ పిన్నీ పుస్తకాలు తెచ్చుకుని యిక్కడే పడుకుంటాను. చదువు ఎక్కడ చదివినా వొకటే.'

'రాత్రివేళ వొక్కడివీ యీ అరుగుమీద పడుకోవడంయేమీ బావుండదు. బాబాయి...'

'పిన్నీ, శ్రీనివాస్ పిలిచాడు :' నేను కులంలేని వాడినని బాబాయి బహుశా పంక్తి నిస్తారి మానుకున్నారు కాబోలు'

'నేను చెప్పకపోయినా రేపు నీకు యెలాగా తెలుస్తుంది. రేపటివరకూ నిన్ను ఆపడం దేనికి ? యిప్పుడే చెప్పేస్తాను.'

'యేమిటది పిన్నీ' కుతూహలంగా అడి గాడు శ్రీనివాస్,

'రాధ తండ్రిని కనుక్కుందుకు నువ్వు వొద్దన్నా వినకుండా ఆయన్ని నేనే పంపాను.'

'అయితే'

'మేము దిక్కులేక భిక్షం యెత్తినంత మాత్రాన కులాన్ని కూలగొట్టుకునే స్థితికి దిగజారిపోలేదు. మాకూ వున్నాయి ఆత్మాభి మానాలు పరువు — ప్రతిష్ఠలు. చూడు అవధానీ ! నీ కంత మక్కువగా వుంటే మరో పిల్లను పెంచుకో. ఆ పిల్లని యిచ్చి పెళ్లిచేయి. అంతేకానీ సంకీర్ణజాతి పిల్లడికి యిచ్చేందుకు మాకు ఖర్మ కాలలేదు

'ఒకవేళ అదే జరుగుతే దాన్ని గోదా వరిలో పడేసి మేమూ దూకుతాం!' అన్నా రట. ఆ మాటలు విని ఆయన తేలిగ్గా నవ్వేశారు. కానీ....

'మీ బాబాయి మనసు ముక్కలై పోయింది. ఆయన నీ మొహం చూడలేక తప్పించుకు తిరుగుతున్నారు.'

విరక్తిగా నవ్వాడు : 'నేను చెప్పానుకద పిన్నీ. నాకు మొదటినుంచి జరగబోయేది తెలుసును అందుకు బాధలేదు బాబాయి బాధపడి నాకు దూరమై పోవడం యేమీ బాగులేదు '

'అదొక్కటే కాదురా కారణం.'

'మరి ?'

'రాధ వచ్చిపోయింది.'

శ్రీనివాస్ వులిక్కిపడ్డాడు. 'ఏమిటి పిన్నీ మీరు అనేది రాధ.' అతని కను బొమ్మలు ముడిపడిపోయాయి. చీకటిలో

గుడ్డిదీపం వెలుగులో అతని మొహం కళాకాంతులు లేకుండా వెలవెలాపోతోంది.

'రాధ. మన రాధేనా పిన్నీ చచ్చిపోయింది. ఎందుకని,' అతను నమ్మలేకుండా వున్నాడు యింత పచ్చి నిజాన్ని.

'నిజమే మనింటికి వచ్చి నువ్వు వుంటే కాస్సేపు కూర్చుని వెళ్లిపోయేది. ఆ రాధే'

'యెందుకనో ?'

అన్నపూర్ణ సరుదుకుని నెమ్మదిగా అతనికే వినిపించేంత స్థాయిలో అంది. 'దాన్ని మూడో పెళ్లి సంబంధం మనిషికి నిర్ణయించారు.'

హఠాత్తుగా శ్రీనివాస్ కళ్లల్లో సుభద్ర కదిలింది. 'పిన్ని' అతని అంతరంగం క్షోభించుకు పోయింది చితికిపోతూ. అభాగ్యులైన ఆడపిల్లలు యిష్టంలేని పక్షంలో చేసే తంతు యిదన్నమాట! మరి పిన్నికి యిష్టం అయే చేసుకుందా ?

శ్రీనివాస్ అంతరాత్మ చిత్రంగా నవ్వింది: బ్రతుకుమీద ఆశలెంచుకోలేని ఆడపిల్లలు పిన్నిమాదిరి అయిపోతారేమో'

'ఆపిల్ల అసలు నీకోసం చచ్చిపోయిందిరా శ్రీనివాస్'

'పిన్నీ' శ్రీనివాస్ తెల్లబోయాడు

'అది నావొళ్లో పెరిగి పెద్దదైంది. దానికి సూటిగా మాట్లాడడం' అలవాటు. అందుకే ఆయన్ని పంపేను నేను'

'నీమీద ప్రేమ తెంచుకోలేక, భవిష్యత్ అలా గడపలేక వురిపోసుకుంది...'

అన్నపూర్ణ యేడుస్తోంది.

'యింక వినాలనిలేదు పిన్నీ. మరి వస్తాను,' అతని హృదయం గాలికి రెపరెపలాడుతోంది. కటికచీకట్లో కలసిపోతూంటే అన్నపూర్ణ గుమ్మానికి ఆనుకుని నిలుచుండి పోయింది.

*　　*　　*

శ్రీనివాస్ పక్కమీద దొర్లుతూనే వున్నాడు. అతనికంటికి దూరమైపోయింది నిద్ర. మానసికంగా అతను దిగజారిపోతున్నాడు, పరీక్షలు యింక యెక్కువ రోజుల్లేవు. సుభద్ర దగ్గరనుంచి సరస్వతి క్షేమ సమాచారాలు తెలుపుతూ వుత్తరాలు వస్తూనే వున్నాయి. కానీ అతని మనసు కీడునే శంకిస్తోంది. రెక్కలు గట్టుకుని వాలిపోవాలనే తపన. సరస్వతి మంచాన వుంది. పిన్ని ఆరోజు యెందుకలా చేసిందో విశదంగా ఆలోచిస్తే అతని అణువణువూ జాలితో పొంగి పోతోంది. పిన్ని తప్పు యేమాత్రం చేయలేదు. తను అక్కడికి ప్రవరాఖ్యుడై పోయినట్లు ఆవిడను కఠినంగా యెలా శాసించ గలిగాడు? పాపం ఆవిడ మనసు యెంత దెబ్బతిని వుంటుందో ? తను లొంగిపోవడం అనే వుద్దేశ్యం యేమీలేదు అతనిలో. రెండు



మొగలి పొదలు

మాటల్లో సానుభూతితో అనివుంటే ఆవిడ పశ్చాత్తాపంతో క్రుంగిపోయేది. రాధ తనను గుడ్డిగా నమ్ముకుంది. ఆ విషయం తనతో అని వుంటే?

'ఆట్టే వెర్రివెర్రి వేషాలు వెయ్యక, అవేశాడివి.' అంతరాత్మ ఆట పట్టించింది.

'ఛ! అది చిన్నవిషయం చిన్ని మరొక వ్యక్తిని కోరుకుని వుంటే తను నిజంగా అభినందించేవాడే! శ్రీనివాస్ మనసు సుడిగుండంలో చిక్కుకుని గిరగిరా తిరుగుతోంది. పోగంట పడుకోవాలని కాలేజీనుంచి యింటికి వచ్చేశాడు. తీరా వచ్చాక అనిద్ర కనుచూపుమేరలో యెక్కడా కనిపించడం లేదు. ఆచిన్ని చలువవల్లే తను గ్రాడ్యుయేటు అయ్యాడు.

'చిన్ని రెండువారాలు, కాకపోతే నెల వోపిక పట్టండి. నేను వొచ్చేసి మీకు దారి చూపిస్తాను,' శ్రీనివాస్ కళ్ళు మూసుకుని నాలుగు గోడలమధ్య గట్టిగానే అన్నాడు.

తంగున వొంటిగంట కొట్టారుదూరాన. మనసు పూర్తిగా వికలం అయిపోయింది. అతనికళ్ళు మరి రూమ్‌లో నిలువలేదు. రామదాసు యింటివైపుకు సాగాయి.

* * *

హాల్లో కూర్చునే వున్నారు కుటుంబ సభ్యులంతా. రాజేశ్వరి నవ్వుతూ ఎదురు వచ్చింది. 'బహు కాలదర్శనం. పూరకరారు మహాత్ములు'

'యేమిటి రాజేశ్వరీ అది, అతను గడపలో అడుగైనా పెట్టలేదు'. పద్మావతి అంది.

రామదాసు తలెత్తి క్షణం భార్యవైపు చూశాడు. 'ఛ! మీలో మీరో వాదించుకుంటారు అబ్బాయికి మంచినీళ్ళగట్రా చూస్తారా? యిదీ వరుస. తల్లీ కూతుళ్ళు యేకం అయ్యారంటే యివతలి వాళ్ళు వరదల్లో కొట్టుకు పోవాల్సిందే నోయ్', శ్రీనివాస్‌వైపు దృష్టిని మళ్ళించి భార్యమీద విసుక్కున్నాడు.

'వాళ్ళ మాటకేంగానీ రా. అన్నట్లు,' అతని చూపులు పెద్దకొడుకుమీదికి వెళ్ళాయి. 'వీడే ప్రభాకరం. మెకానిక్‌గా పనిచేస్తున్నాడు భిలాయిలో. యిహా పూరు వచ్చేశాడు'.

శ్రీనివాస్ చేతులు జోడించాడు. పద్మావతిని మువ్మూర్తులా పోలిన ప్రభాకరంలో అందం అంచనా వేయడానికి కూడా అందటంలేదు. అతనిముందు నిల్చిందుకే సిగ్గుగావుంది, శ్రీనివాస్‌కి. సూర్యకిరణంలా వెలిగిపోతున్న అతనిలో ఆ ఠీవి, దర్పం యే రక్తంనుంచి అబ్బాయో అర్థం కాక అయోమయంగా తలవాల్చాడు.

'అన్నయ్యకి మీ గురించే చెప్పాను. వాడు యింక యిక్కడే వుంటాడు'

'అవును. చెల్లాయి రాత్రంతా మిమ్మల్ని గురించే అంది. అప్పుడే అనుకున్నాను చెల్లాయితో మీరూమ్‌వైపు రావాలి యివాళ అని. దైవికంగా మీరే వచ్చారు,' ప్రభాకరం బుగ్గలు మాటాడుతూంటే కదులుతున్నాయి. కొంచెం తేనెరంగును పులుముకున్న కళ్ళల్లో యెంతో ఆకర్షణ. యింగ్లీషు దొరలా కనిపించాడు శ్రీనివాస్‌కి. అతని మనసు రాధమీదికి మళ్ళింది ఆ రాధ కళ్ళుకూడా యిలాగే ముత్యాలు కలిగిస్తూ వుండేవి. యివన్నిటినీ వొళ్ళోకి తీసుకువచ్చే లోగనే దాటిపోయింది చేయి అంతా జరిగిపోయింది క్షణాల్లాగా.

రామదాసు మిగిలినపిల్లల్ని వొళ్ళోనూ పక్కపక్కా కూర్చోబెట్టుకుని మాటల్లో పడిపోయాడు. పద్మావతి టిఫిన్, కాఫీలు యిచ్చి సాగనంపింది ముగ్గురుని.

* * *

రాజేశ్వరి అంది మెల్లగా! 'చూడండి శ్రీనివాస్ మీరు మరోలా అనుకోకపోతే మా అన్నయ్య మీరూమ్‌లో వుంటాడట'

రాజేశ్వరి అలా పిలుస్తూంటే తలెత్తాడు ఆశ్చర్యంగా. 'మీ యిల్లు అంత పెద్దది పైగా మీ తలితండ్రులు వున్న ఆ పెద్ద యింటిముందు నాయిల్లు యెంతండీ?'

గోదావరి వరదలా పొంగుకు వచ్చేసింది రాజేశ్వరి కళ్ళల్లోకి దుఃఖం. 'అమ్మా, నాన్నా యెవరికి ఎవరు? నిజంగా మీరు పైపై మెరుగులు చూసి యెంత అంచనా వేసుకుంటున్నారు.'

'అంటే?'

'మేము యెవరమో తెలుస్తే అడిగేవారు కారు'

'నాకేమీ అర్థం కావడంలేదు సరిగా

చెప్పండి రాజేశ్వరీ'

'మానాన్న పోయాక అమ్మ రామదాసు గారిని చేసుకుంది'

'వ్హాట్' శ్రీనివాస్ విభ్రాంతిపోయాడు. 'యిదెలా సాధ్యం?'

'పిచ్చి శ్రీనివాస్! చాలా అమాయకంగా మాట్లాడుతున్నారు. అమ్మే ప్రేమించి చేసుకుంది నాన్నని తరువాత ఈయన ఆదర్శంకోసమో మరెందుకో చేసుకున్నారు అన్నయ్య యీనాపూరు వచ్చాడు. వాడికి మీదగ్గర మనశ్శాంతి వుంటుంది'

'అంటే రామదాసు మావయ్య సరిగా చూడరన్నమాట.'

రాజేశ్వరి తలవూపింది 'అవునన్నట్లు.' 'ఆయన దయాభిక్షలో యెంతోమంది ఆఫీసర్లు ఆయేరు. మరెంతోమంది గొప్ప పదవుల్లో వున్నారు.'

'అవును నాకూ అదే ఆశ్చర్యంగావుంది'

'ఆశ్చర్యం యేమీ లేదు శ్రీనివాస్. అతను సామాన్య మానవుడు. ఈర్ష్య యెవరికైనా వుంటుంది. తనభర్య కన్నపిల్లలమీద ప్రేమ యెంతమంది మగవాళ్లకుంటుందంటారూ!

'స్త్రీ ఒక్కతే అందుకు కేటాయించబడింది. మాకు ఆ అదృష్టంలేదు అంతే!—

'రామదాసు అలాంటివారా?'

రాజేశ్వరి నవ్వింది జీవం లేనట్లు 'రామదాసుగారికి పిల్లలు లేకుండా వుంటే బాగుండేదేమో'

'అంటే'

'అమ్మను చేసుకున్నాక ఆయనకి పిల్లలు పుట్టారు. మీరు చూడలేదు, వరలక్ష్మి యం. బి. చదువుతోంది మద్రాసులో.'

'యింతవలపక్షం వుంటుందటారా?'

'మీరు గ్రహించలేక పోతున్నారు. యింత చెప్పాక కూడా'

'అహఁ అదేమీలేదు,' శ్రీనివాస్ దిక్కులు చూస్తూండగానే చీకట్లు దట్టంగా పులుముకున్నాయి. రంగురంగుల ఆకాశం క్షణంలో కాటుక కొండలా అయిపోయి అక్కడ కుప్పలుగా పోసిన వెండిరూపాయల్లా తళుక్కు మంటున్నాయి అమావాస్యనాటి నక్షత్రాలు

'మరి నేను వస్తాను. అన్నయ్యసంగతి డిసైడ్‌చేయండి' రాజేశ్వరి కదలి వెడుతోంది శ్రీనివాస్ హృదయంమీదుగా,

స్త్రీని చూస్తేనే అతని మనసు సుభద్ర వైపు మొగ్గిపోతుంది. 'పిన్ని, పిన్ని' అంటుంది. యేదో దారిచూపించాలి తప్పదు.

పిన్ని జీవితంలో దీపం వెలిగించే మనిషిని కంచు బాగడాలువేసి తీసుకు రావాలి ఆ పురుషుడికోసం తను శాయశక్తులా ప్రయత్నంచేయాలి. ఆవిడ జీవితం అలా అర్థాంతంగా ఆగిపోకూడదు సరస్వతికి యేదో ఈడూ-జోడూ కలిసిన మనిషిని వెతికిందుకు ప్రయత్నం చేయాలి. యెలాగ యీరోజులు గడిపేయడం?

శ్రీనివాస్ ప్రశ్న పూర్తికాకముందే పరీక్షలు వురకలు వేసుకుంటూ వచ్చి తోసుకుపోయాయి కాలండరులో పేజీలు గిరగిరా తిప్పేస్తూ. సైకాలజీ రాసి యింటి ముందుకు వచ్చాక చక్కటి ఆలోచన మెరిసింది.

* * *

చాలా కొద్ది వ్యవధిలోనే ప్రభాకరం పూర్తిగా ఆక్రమించుకున్నాడు శ్రీనివాస్‌ని. అతను గడపలో అడుగుపెట్టేసరికి ప్రభాకరం వాసాలవైపు చూస్తున్నాడు.

'వాసాలు లెక్కపెడతారా ప్రభాకరం' శ్రీనివాస్ వేళాకోళం ఆడాడు గదిలోకి వచ్చేస్తూ.

'వచ్చావా నీగురించే ఆలోచిస్తున్నాను' ప్రభాకరం నవ్వాడు.

'దేనికో? నేను పారిపోయాననుకున్నావా? పిల్లి యెత్తుకుపోయిందనుకున్నావా?'

[illegible]

'పరిహాసానికేంగాని కొంచెం జరిగి చోటివ్వు. నీపక్కగా నన్నూ పడుకోనియ్యి' చెప్పులు వదిలేసి గోడను కాళ్లతో నిగడదన్ని ప్రభాకరం పక్కనే పడుకున్నాడు శ్రీనివాస్. అతని మనసు పూర్వ్వ లోకాల్లో ప్రయాణంచేస్తోంది. వున్నట్లుండి —'ప్రభాకరం నిన్ను నొకవిషయం అడగనా' అన్నాడు

'ముందు నామాటకు జవాబు చెప్పవోయ్,' ప్రభాకరం అవకాశం యివ్వకుండా అన్నాడు.

'అయితే అడుగు.'

'వ్యభిచారం మీద నీ అభిప్రాయం యేమిటి?'

శ్రీనివాస్ కనుబొమ్మలు ముడుచుకుపోయాయి! అసలు యీ విషయం ఎందుకు వచ్చింది యిప్పుడు?

'చెప్పుదూ. నీ అభిప్రాయం కనుక్కోవాలని వుంది.'

శ్రీనివాస్ నవ్వేశాడు! నాకు అసలు ఎక్స్‌పీరియన్స్‌లేదు. పైగా ఆవిషయాల గురించే తెలియదు! నేనేం చెప్పగలను యింక?'

'వుహుఁ దాటేయకు నేను కొంత చెబుతాను. దాన్నిబట్టి నీ అభిప్రాయం చెప్పాలి.'

'వూఁ అయితే సరే'

ప్రభాకరం గట్టిగా వూపిరి పీల్చి



[illegible]
ప్రపంచంలో స్త్రీలు అనాథలుగా, అన్యాయాలకి బలి అయిపోతూంటారు. వాళ్ల సంగతి చాలా దయనీయంగా వుంటుంది'

'పహోజ్ మా అమ్మ వుంది. నాన్న పోయారు. ఎవరూ లేరు. రామదాసుగారు ఆదరించి చేసుకున్నారు. మా చిన్నతనం పూలపల్లకీలాగే గడిచి పోయింది. ఆయనకీ పిల్లలు పుట్టారు మాదారిమాది అయి పోయింది.'

'ఒకసంగతి చెబితే నువ్వు నమ్ముతావా శ్రీనివాస్.'

'నువ్వు చెప్పకు పోతావుందు. నమ్మక పోవడం అనే ప్రశ్నేలేదు అసలు ఆ విషయాలు నాకు అడగాలనే వుండేది. కానీ యేవిటో నువ్వు యేమైనా అనుకుంటా వేమో అని అడగలేదు'

'చెల్లాయి పెద్దదైంది. వరలక్ష్మికీ దానికీ ఖచ్చితంగా రెండేళ్ల భేదం. మళ్లీ యేడాది వరం పెద్దదైంది. వాడు యేం చేశాడో తెలుసా?' అతని కళ్లు అగ్ని కణికల్లా వున్నాయి.

'యేవరూ,' శ్రీనివాస్ అడిగాడు.

[illegible]

అసలు ప్రభాకరం పరాకుగా కూడా యిటువంటి పదాలు వుపయోగించడు. కానీ యిప్పుడు, యిప్పుడే యెందుకో యిలా అన్నాడు.

'రామదాసుగాడు'

'యేవిటి నువ్వు అనేది ఆయన్నా!'

'అవును అతనే. తండ్రుల రక్తంపోకటి కాపడంకాదు గొప్ప. ఒక తల్లిగర్భంలోంచి రావడం చాలా పవిత్రమైన సంగతి నా దృష్టిలో. యేమంటావు?'

'చెప్పు ప్రభాకర్ నీకు కష్టంగాతోచిన విషయం యేదో లేకపోతే వూరికే అనవు యిన్నిమాటలు'

'వాడు బ్రూట్., యేంచేశాడో తెలుసా'

శ్రీనివాస్ వింటున్నాడు ఆసక్తిగా!

'నేను నేను యీవూళ్లో యిన్నాళ్లా. ఒకరాత్రి తొమ్మిది గంటలకు తిరిగి తిరిగి వచ్చినందుకు...అందుకే వెళ్లిపో వల్సి వచ్చింది అమ్మకి.. చెల్లికి దూరంగా...

'ఫస్టు యు గెటౌట్ ఫ్రమ్ హియర్. నిక్కినిలిగి అర్ధరాత్రి వస్తే 'నీ అబ్బ

[illegible]

రామదాసు కంఠం ఖంగుమంది కంచులా మ్రోగుతూ.

మెట్లమీదే అడుగులు ఆగిపోయాయి. ప్రభాకరం తల మొహం వేశాడు.

'నీకే చెప్పేది. వెళ్లిపో. నువ్వు యిక్కడ వొకక్షణం వుండేందుకు వీలులేదు.'

'బాబాయ్'

'అవి తరువాత. ముందు పద బయటికి. నీసంగతి నాకు తెలీదనుకోకు. ఆ రోడ్లన్నీ తిరిగేసి ఈ టైముకి యింట్లో అడుగు పెడితే-గ్రహించననుకోకు'

ప్రభాకరం పిడికిళ్లు బిగుసుకు పోయాయి. 'నేను.. నేను అటువంటి పనులు చేస్తానా నమ్మద్దు బాబాయ్. అలాంటి వాడినికాదు నేను నమ్మండి నన్ను. గిట్టని వాళ్లెవరో చెప్పి వుంటారు. దేవుడి సాక్షిగా నేను యిప్పటి వరకూ మెకానిక్ భీమారావుగారి దగ్గర వున్నాను.'

'నన్నుబ్రా నువ్వు నమ్మించేది. ఆ శోష్ణి పిచ్చి వేషాలు వెయ్యక వెళ్లు. ఆ బజారు లోనే దొరుకుతుంది నీకు కావలసిన తిండి'


'అమ్మా' ప్రభాకరం కెవ్వుమన్నాడు. రామదాసు చెయ్యి అతని మెడమీద బలంగా నిలుచుండి పోయింది.

పద్మావతి పరుగుపరుగున వచ్చేసింది. ప్రభాకరాన్ని తనవైపు లాక్కుని గుండె ల్లోకి తీసుకుని నిశ్చలంగా వుండిపోయింది.

రామదాసు అన్నాడు: 'నీకు కావలసింది అదే అయితే నాకు అభ్యంతరం యేమీ లేదు పద్మా వెళ్లు నీ పిల్లలతో నువ్వు సుఖంగా వుంటానంటే నేను కాదంటానా. వరం! మీ అమ్మవెళ్లిపోతోంది. అది యెక్కడికో వెళ్లిపోతోంది నన్ను వదిలేసి. యిప్పుడు నాకెవరున్నారు యిక్కడ', రామదాసు కళ్లు చెమర్చాయి.

స్త్రీ మాతృప్రేమతో భర్తని సులువుగా మరిచిపోతుందట. రామదాసు పోటు వాదనకి ప్రభాకరం నలిగిపోయాడు

పద్మావతి కొడుకుని అడుగుదూరంలో నిలబెట్టిఅంది. 'నేను పొరబాటు చేశానని యిప్పుడు తెలుసుకున్నాను ప్రభాకరం. నువ్వు వెళ్లిపో యీ యింట్లోంచి. నీకు యెవరూ లేరు!



'అమ్మా!' ప్రభాకరం గొంతు పూడి పోయింది.

'అమ్మ' పద్మావతి కఠినంగా అంది. 'అమ్మ యెవరూ లేరు నీకు యిక్కడ. నేను చేసింది యెంత పొరబాటో గ్రహించాను యిన్నేళ్లకి. చపలత్వానికిపోయి యెంతపని చేశాను? నా ప్రాణానికి, రక్తానికీ ప్రాణాధికంగా వున్న మిమ్మల్ని యిలా నట్టేట్లో ముంచేస్తూ నేను యింకా బ్రతికివున్నాను. యేం దుకొచ్చిన బ్రతుకుయిది. వెళ్ళు ప్రభాకరం నా యెదుటలే!

'ఆయన నా భర్త. ఆయన ఆజ్ఞ మేరకు నేను యేదీ చేయలేను' నేను నీకు అమ్మనే అయితే యింత కఠినంగా వెళ్లగొట్టను!'

ప్రభాకరం తల భూమిలోకంటా వొంగిపోయింది. ప్రహరీ దాటివెడుతూ వెనక్కి చూశాడు. తల్లి యేడుస్తోంది కుమిలి కుమిలి.

తనుచేసిన పనికి తనే అనుభవిస్తోంది. నవమాసాలూమోసి కనిపెంచి యింతచేసిన ఆ కొడుక్కి దారి చూపించకపోగా నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టింది యింట్లోంచి. రాజేశ్వరి బయటికి వచ్చింది. ఆపిల్లని గుండెలకి అదుముకుని పద్మావతి యేడుస్తుంటే శిలాప్రతిమ అయిపోయాడు.

'వాడు యెక్కడికీ వెళ్లడు పద్మా. వచ్చేస్తాడు. నామాటవిను. యేడవకు', రామదాసు భార్యను వోదారుస్తున్నాడు.


అంటే బాబాయి బహుశా అమ్మమీద ప్రేమవల్ల అలా అంటున్నాడేమో. అడుగు ముందుకు వెయ్యాలనిపించినా మనసు నిగ్రహంగా శక్తినంతా కూడదీసుకుని ముందుకే లాక్కుపోయింది. తల్లి యేడుపు గాలి కెరటాల్లో అలలు అలలుగా తేలితేలి ముందుకువస్తూ వెనక్కిపోతూ చివరికి తని చెవులు వినిపించుకోలేనంత వెనక్కి వెళ్లిపోయింది.'

'అయితే నువ్వు యింటికి తిరిగిరాలేదా అప్పుడు,' మధ్యలో అడిగాడు శ్రీనివాస్ వుండబట్టలేక.

'హుఁ ఈ మొహానికి అంత అదృష్టం కూడానా ?'

'మరి యెక్కడికి వెళ్లావు?'

ప్రభాకరం సిగరెట్ పొగలు పొగలుగా వదులుతూంటే గతం కరిగిపోతోంది అతని మనసులోంచి. మూగగా మథనపడుతోంది అతనిహృదయం పశ్చాత్తాపంతో చిట్లి చిరికి పోతూ—



మొగలి పొదలు

మిస్టర్ చెక్ యువర్ టికెట్'

తెల్లబోయాడు ప్రభాకరం అతని జేబులో, వస్తూంటే ఆరోజే యిచ్చిన శ్రీమారావుదగ్గరి సర్టిఫికేట్లు తప్ప మరొకటి లేవు.

'చెప్పు యేదీ టికెట్'

ప్రభాకరం విభ్రంగా అన్నాడు. 'క్షమించండి. నేను కొనలేదు!'

ప్రభాకరం మాటకి అతనే తెల్లబోయాడు. యింత సూటిగా మాట్లాడుతున్న ఆ మొహంలో కల్మషం యేమాత్రం కనిపించడంలేదు. అమాయకంగా వున్న ఆ పిల్లడిని తవతో తీసుకువెడితే అతని పండిన వెంట్రుకలలో అనుభవం జీర్ణించుకు పోయింది. కడుపునిండా కనుకున్న అతని యిల్లాలు కళ్లముందు పిల్లలతో కళకళలాడుతూ కనిపిస్తూంటే యింక యేమీ అనలేక పోయాడు.

'క్రిందికి దిగు'

ప్రభాకరం భయపడలేదు. యివన్నీ ముందే వూహించుకున్నాడు. తను తిన్నగా పోలీస్ స్టేషన్‌కే వెడతాడు. ఆ సంగతి చిటికెలో తెలుసుకోగలడు.

భుజంమీద చేయివేస్తూ అన్నాడు అతను: 'యిలాటివి అప్పుడప్పుడు జరుగుతూ వుంటాయి. చూడు బాబూ చదువుకున్న వాళ్లే యిలా రూల్స్‌కి అగ్గి పెట్టగా ప్రవర్తించడం 'ప్'! చాలా విచారించ దగిన విషయం. వొక్కోసారి కష్టాలు తన్నుకు వస్తూంటే నీతివాక్యాలు మనల్ని రక్షించవనుకో'

'వూ యింతకీ యెందాకా ప్రయాణం'

'హైదరాబాదు వెళ్లాలను కుంటున్నాను'

'అక్కడ మీ బంధువులు యెవరైనా...'

'వుహూఁ యెవరూలేరు నేను వొక్కడినీ'

'అంటే బ్రతుకు తెరువుకోసం అన్న మాట' తలవూపాడు ప్రభాకరం.

'ఈరాత్రికి మాయింట్లో వుండి ప్రొద్దున్నే వెడుదువుగాని'

ప్రభాకరం ఆశ్చర్యంగా చూశాడు యితనుగానీ తమాషా చేయుడంలేదు కదా!

'నేను తమాషా చేయడంలేదు నిజం'

'అతను భగవంతుడేమో', ప్రభాకరం ఈమాట ఒకటికి లక్షసార్లు అనుకున్నాడు. ఆవిడ అంతకు మించిన ఆప్యాయంగా మాట్లాడుతూంటే ప్రభాకరానికి దుఃఖం ఆగిందికాదు. పంటితో క్రింద పెదవిని అదిమేసి గొంతులో గురగురలాడే నీళ్లని పంపించేశాడు లోలోపలికి.

మర్నాడు అతను అన్నాడు 'నువ్వింక క్షేమంగా వెళ్లగలవు. యెప్పుడైనా నీకు రావాలనిపిస్తే తప్పకుండా రా. నీకు తండ్రిలాంటి వాడిని—ఈరూపాయి వుంచుకో'

ప్రభాకరం అతన్ని హృదయంలో ప్రేమ కట్టించి బిగించుకున్నాడు. ఆఫోటో పగిలి పోకుండా, చెరిగిపోకుండా జాగ్రత్తగాచూసుకుంటూ.

(ఇంకావుంది)

తెలవారమాయె...



'టయిమెంతండీ తాతగారూ?—'

''తాతంటావ్ ఎవడిరా నువ్వు?— ఇంకా యాభైలు దాటలేదు నీకు నేను తాతనుట్రా?—'

'క్షమించండి స్వామీ, తెలియక అన్నాను'

'స్వాములేమిట్రా?— నేనేం సన్యాసం పుచ్చుకున్నా ననుకున్నావా?—'

'లేదు బాబూ, లేదు. మరేం అనుకోకండి. నోరు జారింది, బాబూ'.

'ఎవ్రడా బాబు?— నీకు నేను బాబునా?— '

'అదికాదండి మావయ్యగారూ!———'

'అదుగడే— నాకు చిరాకు. ఏమిట్రా నీ వరసలూ నువ్వూను?—'

'బావయ్య గారూ.. .... ఒక్కమాట'

'ఒరి నీ అసాధ్యం కూలా— తాతా అంటూ ప్రారంభించావ్? బాబు నంటావ్? మోఁవ బావగారి వరసలు పెడ్తావ్?— ఎవడివిరా నువ్వు, ఎవడివి అంట?— '

'అయ్యో గురువుగారూ!— నే వోళ్లి అజ్ఞానుడ్ని. అభమూ శుభమూ తెలియని వాణ్ని. బొత్తిగా లోకజ్ఞానం లేనివాణ్ని. తమలాంటి వారితో మాటాట్టం చేతకాని మూర్ఖుణ్ని శివక, గురువుగారూ!—'

'మళ్లీ గురువు నంటున్నావ్, నాకే పంగనామాలు పెడదామనిట్రా?—'

'లేదన్నా!— అన్నన్నన్నా— ఎంతమాట! ఎంతమాట!—'

'అన్ననుట్రా? నేను నీకు అన్ననా? లొట్టికాయంత ఉన్నావో లేదో, నేన్నీకు అన్ననా?— నా ఆస్తిలో భాగంకోసమని ఎత్తు వేస్తున్నావుట్రా?—'

'అయ్యో రామా!— ఇంకేమనమన్నారండీ, తమర్ని ఇంకేమనమన్నారూ?—'

'భడవా, ఊరుకున్నకొద్దీ మరీ వాస్తూందే. నన్ను పేరెట్టే పిలుస్తావుట్రా, వుండా ఖోర్!— నాకేం బొడ్డు కోసి పెట్టావుట్రా నువ్వు?—' అంటూ ఆయన ఉగ్రుడై పొయ్యాడు.

ఇంతలో స్టేషను వచ్చింది, రైలాగింది.

ఆయన దిగి మరో పెట్టెలోకి వెళిపోయాడు.

ఆ తరువాత తెలిసింది నాకూ— ఆయన పేరు మన్నారు గారని—

అదా—

కొంపతీసి మన్నారు గారుగానీ ఇక్కడ లేరుకదా?—

ప్రతి వారము

లండన్‌కు

13 సర్వీసులు

న్యూయార్క్‌కు 7 సర్వీసులు

అన్ని సౌకర్యాలతో కూడిన సుఖకరమైన ప్రయాణము



కావాలంటే దారిలో మధ్యప్రాచ్యము
మరియు యూరప్‌లో ఎక్కడైనా
ప్రయాణమును తాత్కాలికంగా
ఆపి మళ్లీ వెళ్లవచ్చును.
లండన్‌కు వున్న
సర్వీసులలో రెండు
మాస్కో మీదుగా వుంటాయి.

ఎయిర్-ఇండియా


ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ బిల్డింగ్, మౌంట్ రోడ్, మద్రాసు 2
టెలిఫోన్ నెం. 86196

సహకారులు: బి.ఓ.ఎ.సి మరియు క్వాంటాస్

AI 7292

విధివిహితం

పరిమి వాణి



అనంతం అందరిలాగే మానవుడిగా పుట్టాడు...అందరిలాగే పెరిగాడు కూడా! అయితే అతనిలో కొన్ని దుష్టశక్తులు అతడ్ని పతనం చేశాయి. మానవుడు స్వార్థ పరుడైనపుడు 'దానవుడు'గా మారి తాడు! పతనం అయిన 'ఆ దానవుని'లో మానవత్వం తలెత్తుతుంది...కాని...'చేతులు కాలేక ఆకులు పట్టుకుని' లాభం ఎంత ఉన్నదో? పతనమైన మానవ దుఃఖానికీ, పశ్చాత్తాపానికీ అదేలాభం! మానవుడు మానవుడ గానే బ్రతికితే ఈ ఇబ్బందే లేదేమో! మరి!

అనంతం ఇరవైఏళ్ళదాకా బ్రహ్మచారి గానే బ్రతికాడు...ఆ తర్వాత ఓ శుభక్షణాన అన్నపూర్ణ సాహచర్యం లభించింది...చూచే వారికి చిలకాగోరింకల్లా కనబడుతూ, అన్యోన్యంగా ఉండేవారు. మానవుడికి సుఖం మీద సుఖం వస్తుందనే మాటను యదార్థం చేస్తూ అనంతానికి స్కూల్సు ఇన్స్పెక్టరుగా ప్రమోషను వచ్చింది...

అప్పుడప్పుడు దూరంగానూ, తరుచు దగ్గర పల్లెలకి వెళ్ళి వస్తూఉండే వాడు. అతనికి సేవచేస్తూ తగినభార్య అనిపించు కొంది. అన్నపూర్ణకి తనస్వర్గసీమలాంటి జీవితంలో ఏదోకొరత, ఏవోబాధ...కన్పించ సాగినయ్!

ఆమెలో మాతృకాంక్ష దినదినానికీ వృద్ధిం పొంది, చిలవలూ, పలవలూఅల్లి హృదయాన్ని వేధించేది...ఏచిన్న పాపనిచూచినా, ఏ గర్భిణిస్త్రీని చూచినా అన్నపూర్ణ హృదయం బరువెక్కి పోయేది. ఎక్కడ పిల్లలు కనిపించినా, కాంక్ష నిండిన కళ్ళతో వారిని వీక్షించేది...కళ్ళొత్తుకుంటూ తనను తానే నిందించుకొనేది.

అనంతయ్యకూడా ఈవిషయంలో బాధ పడేవాడు. కాని, పురుషుడూ, వ్యాపకం కల వాడూ కావడంచేత అతడిలోనే అది అణిగి పోయేది...కాని అన్నపూర్ణ ఆ విషయంలో కళ్ళు తడిచేయని దినంలేదు...అనంతం ఎన్నిచెప్పినా, ఆమెకి ఆ విచారం పోయేది కాదు ... అనంతం అసలు నాస్తికుడు! దేవుడూ, దెయ్యం లేదనీ, రాళ్ళూ, గుళ్ళూ పూజించి లాభం ఏమిటనీ వాదించేవాడు...అన్నపూర్ణమీది మమత అనంతాన్ని మార్చివేసింది ... రెండునెల్లు శలవుతో అనంతం తీర్థయాత్రలూ, నదీ స్నానాలూ చేయడానికి వెళ్ళాడని తెలిసిన వాళ్ళు నమ్మలేదు...నమ్మినవాళ్ళు మహా ఆశ్చర్యపోయారు కూడా! రామేశ్వరంలో పిల్లలకోసం 'నాగప్రతిష్ఠ'కూడా చేసుకు వచ్చారు దంపతులు సంతోషంగ...అన్నపూర్ణ తనకి సంతుకలిగినట్టే పొంగి పోయింది...

కాని నదీస్నానాలూ, తీర్థయాత్రలూ సంతానాన్నివ్వగలవా? అదే సత్యమయితే

లోకంలో గొప్పవాళ్ళు ఉండరేమో! అన్నపూర్ణలో కాలంగడుస్తున్నకొద్దీ మళ్ళీ నిరాశ, నిర్లిప్తత ఆవరించినయ్! ఆమె ఆరోగ్యం క్షీణింపసాగింది క్రమంగా... అనంతం ఏంచెయ్యాలో తెలీక బాధపడిపోయాడు డాక్టర్లూ. మందులూ వ్యర్థమే అయాయి.. అన్నపూర్ణ తన జీవితమే వ్యర్థమని తలచేది ఒక్కొక్క క్షణంలో...మానవుడిలో నిరాశా, నిస్పృహా నిండి జీవితమే రోత అనిపించినప్పుడు, భగవంతు డేదో అడ్డు పుల్ల నాశాకిరణంగాచేసి, ఆశ రేపిస్తాడు. మానవజీవితంలోని మర్మమే అదేమో!

హఠాత్తుగా అనంతం స్నేహితుడైన మురళిభార్య పురిటిలో పోయింది.. మురళిని చూడడానికి వెళ్ళిన అనంతం మురళికి దేవుడిలా కన్పించాడు...పన్నెండురోజుల పసి పాపని పెంచే దిక్కులేక అల్లాడిపోయే మురళి అనంతానికి బాధ్యత అప్పచెప్తూ 'పాపనీదే అనంతం...మీలోటు భగవంతుడిలా తీర్చేడనుకో...పాప జాగ్రత్త అని వే చెప్పక్కర్లేదు...నీదే అంతాభారం'...అంటూ పాపని అనంతం చేతుల్లో ఉంచాడు... అదే పదివేలనుకొన్న అనంతం ఇంటికి వచ్చాడానందం నిండిన హృదయంతో... అన్నపూర్ణ అంతావిని ఒక్కఉరుకులో పాపని తీసుకు తన శుష్కించిన గుండెలకి హత్తుకుంది...దిష్టితీసి మెటికలు విరిచింది...పక్కవేసి పాలుపట్టి పడుకోపెట్టింది...ఊరంతా పనిగట్టుకువెళ్ళి పాప విషయం చెప్పి వచ్చింది!

అన్నపూర్ణ పిల్లల తల్లులందరి దగ్గిరికీ వెళ్ళి పిల్లలికి పాలెలా పట్టాలో, నీళ్ళలా పొయ్యాలో, ఎలా పెంచాలో కనుక్కుని వచ్చేది...అక్షరాలా పాటించేది కూడా...మొత్తానికి పెంచినతల్లి కన్నతల్లికన్న గొప్పదే అనిపించుకొంది అన్నపూర్ణ. పోయిన ఆరోగ్యం ఆమె మళ్ళీ పాప పెంపకంలో పొందగలిగింది...పాప మూడేళ్ళ ముద్దుపాపగామారి, ముద్దు మాటలతోనూ, చిన్నారి నడకలతోనూ ఇంటికో కొత్త అందాన్ని తెచ్చింది. పాపకి 'లక్ష్మి' అని పేరుపెట్టింది అన్నపూర్ణ. పాప మాటల్లో, చేష్టల్లో స్వర్గమే చవిచూచిన ఆ దంపతులు, తమ జీవితాలకిక కొరతలేదని తలపోశారు...వారి ఇల్లు స్వర్గంలా కళకళలాడింది

మానవుడాశా ప్రేరితుడై, ఆశల తోరణాల అంగణంలో అందంగా ఆడుతూ జీవించే సమయాన, అన్నిటినీ పుటుక్కునతెంపి, ఆనందించే స్వభావం దైవానిది! ఓనాడు మురళి దగ్గర్నించి ఉత్తరం వచ్చింది...మామూలు ఉత్తరమే అయినా, అది వారిని కలత బెట్టింది...'మురళివచ్చి పాపని తీసుకెళ్తాననడుకదా' అనుకున్నాడనంతం... ఒక్కొక్కప్పుడు మానవుడు ఏది కాకూడదనుకుంటే అదే అయితీరడంకూడా మానవ జీవితాల్లో జరుగుతుంది... మూడురోజుల నాడు మురళి భార్యతో వచ్చాడు...అన్నపూర్ణ గుండెలో బండరాయి పడింది. బాధతో, బరువుతో ఆమె మర్యాదలు జరిపింది...లక్ష్మినిమాత్రం చంకదింపలేదు... వాళ్ళు భయపడినట్టే అనంతాన్ని మురళి పాపని తీసుకెళ్తానని కోరాడు...అన్నపూర్ణ పాపనిపెంచిన విధానం అంతాచెప్పి, పాపనివ్వమని ప్రాధేయపడ్డా డనంతం ... కాని మురళి ఒప్పుకోలేదు ... 'కావలిస్తే మళ్ళీ పుట్టినవాళ్ళ నిస్తాలే' అన్నాడు... అన్నపూర్ణ దుఃఖానికిగాని, అనంతం వేడికోలుకుగాని, పాప రాననిపెట్టే మారానికి గాని విలువ ఇవ్వని మురళి పాపని తనతో తీసుకుపోయాడు ... పాప లేమితో కళావిహీనం అయిందా గృహం. అన్నపూర్ణ హృదయం చీకటయ్యింది...పాపలేని జీవితం ఆమెలో నిరాశనింపింది...అనంతం మరో పాపని పెంచుకొందామని ఎంత చెప్పినా, ఆమె తనదుఃఖం మానలేదు ... ఆమె ఆరోగ్యం పాడయింది మళ్ళీ ... ఆమె క్రమంగా మంచంఎక్కింది మనోవ్యాధితో...

డాక్టర్లూ మందులూ ఆమె మనోవ్యాధిని కుదర్చలేక పోయాయి ... ఆమె ఆఖరికి ఆశలుతీరని మమతతో అంతంచేసుకుంది తన జీవితాన్ని ... అన్నపూర్ణకూడా లేని ఆ యింట్లో, అనంతం ఏకాకిగా నిలబడి పోయాడో దురదృష్టపు దినాన్న...

అన్నపూర్ణా, పాపా మసిలిన ఆ యింట్లో ఉండలేక పోయాడనంతం ... ఆ యిల్లు మార్చేశాడు వెంటనే ... కొన్నాళ్ళ తరువాత ఊరుకూడా మార్చేశాడు.. విధి వీచిన విసురుగాలి కెదురైన మానవుడిలో వేదాంతం తలెత్తుతుంది ... దుఃఖమయులైన వారికా వేదాంతమే జీవించే మార్గాన్ని చూపించి ధైర్యాన్నిస్తుందేమో ... అనంతం 'పోయినవాళ్ళతో పోగలమా ?' అనీ 'మనకి పిలుపు వచ్చేదాకా జీవించక తప్పదనీ' ఏడుస్తూ జీవించేది నవ్వు నటిస్తూ జీవించాలని అనుకుని తన దుఃఖాన్ని మరవడానికి ప్రయత్నించేవాడు... అనంతం జీవితచక్రం అలాగే నడిచిపోతూంది మెల్లిగా ... అనంతం జీవితం అనుకోకుండా మలుపు తిరిగింది ఓ శుభోదయాన..అడుగున పడిన అదృష్టరేఖ అంత పైకివచ్చింది...

అనంతం ఒక రోజు ఒక పల్లెకి ఇన్స్పెక్షన్‌కి వెళ్ళాడు.. మునసబుగారింట్లో భోజనం...భోంచేస్తూన్న అనంతానికి, ముద్దంబంతుల్లాంటి ముగ్గురు అబ్బాయిలు కనబడ్డారు...వాళ్ళు తండ్రిలేని అనాధలనీ, తల్లే ఎలాగో పెంచుకుంటోందనీ, ఇబ్బంది పడుతున్నారనీ, మునసబు చెప్పాడు. అనంతంలో అణిగి, మణిగి, అంతర్హితంగాఉన్న కోరిక పడగవిప్పిన పన్నగంలా నాట్యం చేసింది!

మునసబుతోవెళ్ళి పార్వతమ్మని కలుసుకుని, తన నిజ జీవితం ఆమె కళ్ళముందు పెట్టాడు దీనాతి దీనంగా...అన్నపూర్ణ ఆశలూ, అంతమూచెప్పి, తన జీవితానికో వెలుగునిమ్మనీ, ఆమె మేలు మరవననీ, బతిమాలేడు. మునసబు అనంతం గురించి చెప్పిన తర్వాత, పార్వతమ్మలో జాలికలిగింది. తన ముగ్గురి కొడుకుల్లో ఒకడిని పెంపకానికివ్వడానికి ఎలాగో ఒప్పుకుంది. కాని ఒక్కసారే ఎలా ఇవ్వగలదని?

అనంతం వారానికోసారి వెళ్ళేవాడు ఎన్నో పిల్లల ఆట సామానులూ, తినుబండారాలూ పట్టుకుని...ముగ్గురు పిల్లలూ అనంతాన్ని మామా అని పిలుస్తూ చేరిక అయారు...కాని 'నాతో వస్తావా?' అని అనంతం అడిగితే, 'రాను'...అనే చెప్పేవారు...ఆఖరికి ఆమెజ్ఞానం, జ్ఞాపకం తెలీని పసివాడైన మూడేళ్ళ రవిని ఇవ్వడానికే నిశ్చయించింది...ఓ నాటి రాత్రి నిద్రలో చిన్నారి రవి అనంతం చీకటింట్లో ప్రవేశించి, కాంతివంతంగా చేశాడు ఇంటిని.

రవి రాకతో కొత్త అందాన్ని నింపుకున్న ఇల్లు కళకళలాడింది...రవి 'అమ్మ' అని మధ్యలో ఏడ్చేస్తూ అల్లరి చేసినా

అంతలో ఆట సామానులతో ఆటలాడే వాడు...మిఠాయిలన్నీ అనంతానికి తినిపిస్తూ తినేవాడు...అనంతం రవిచేత 'నాన్న' అని పిలిపించడం అలవాటు చేశాడు. 'నాన్నా' అనే పిలుపు విని పొంగిపోయేవాడు. పార్వతమ్మ చూడాలనుకున్నప్పుడల్లా వచ్చేది... రవినిచూచి, ఆనందంతో వెళ్ళిపోయేది... పెద్దవాళ్ళిద్దరూ రవి సామానులన్నీ చూచి పొంగిపోయేవారు. రవి అన్నలకి తనవన్నీ పంచి ఇచ్చేవాడు.. పార్వతమ్మ ఎంతగానో ఆనందించేది పిల్లల్నిచూసి...రవి భవిష్యత్తుతోపాటు తక్కిన ఇద్దరి భవిష్యత్తూ బాగుపడుతుందని ఆశించింది పార్వతమ్మ...

మానవులు కోరుకున్న ఆశయాలన్నీ నెరవేరితే జీవితమే స్వర్గం అయి కూచుంటుంది! కోరిన కోరికలన్నీ తల్లక్రిందులు చేస్తాడు దైవం!

అనంతం ఏది తెచ్చినా రవి, అమ్మా అన్నా అంటూ మూడు వంతులు వేసేవాడు. అమ్మ రాలేదనీ, అన్నల్ని తీసుకు రమ్మనీ వేధించేవాడు. కొంచం వాళ్ళు రావడం ఆలస్యమైతే...అనంతానికి రవి వాళ్ళమీద చూపించే అభిమానం నచ్చేది కాదు. 'రవి ప్రేమని కూడా ఇలాగే వాటాలు వేస్తాడా' అని అనంతం భయపడేవాడు కూడా...ఆ భయమే అతనిలోని స్వార్థాన్ని మేల్కొలిపింది. స్వార్థపు ముసుగు వేసుకున్న మానవుడు తనకు తాను దానవుడై

విధిలిఖితం

పోతాడు. అనంతం విషయంలో అలాగే జరిగిందికూడా...

'రవి ప్రేమ తనది...రవి తనవాడు! రవి ప్రేమ ఎవరికీ పంచకూడదు! తనెంతయినా పెంపుడు తండ్రి! ఆమె కన్నతల్లి!' అనంతం హృదయంలో పుట్టిన స్వార్థం పెరిగి పెద్దదై హృదయాన్ని కఠిన శిలగన్న కరుడు కట్టించింది. పార్వతమ్మ నెలాగైనా రవికి దూరం చేయాలనీ, 'అమ్మ' అనే పదం రవి మరిచి పోవాలనీ కోరుకొనే వాడనంతం.. అదే ఆలోచన! అదే బెంగ! ఆఖరికి అనంతం తన ఆలోచనలకు పథకం తయారు చేశాడు...

పార్వతమ్మ వచ్చినప్పుడు రవినిక బడిలో వేస్తాననీ, తరచు రావద్దనీ కోరాడు. రవి చదివి బాగుపడాలని ఉంటే ఆమె దూరంగా ఉండాలని చెప్పాడు...పార్వతమ్మ అది విని నిర్ఘాంతపోయింది...కలా? నిజమా? తేల్చుకోలేక పోయింది. తనకిలా అన్యాయం చేయవద్దనీ, పిల్లలు బెంగడిల్లి పోతారనీ బ్రతిమాలింది.. రవి చదువుకోవడమూ, డాక్టరు చదువు చదివి డాక్టరైతే తన కోరిక తీరుతుందనీ, తాను వచ్చినంతమాత్రాన రవి చదువాటంకంకాదనీ వాపోయింది. ఇలాతనూ హించుకొన్నట్టయితే రవిని పెంపకానికి ఇచ్చేదాన్నికాదని అంది...కాని, అనంతంలోని


స్వార్థం అతని కర్ణపుటాలకు పొర వేసింది. ఆమె దీనాలాపాలేవీ వినబడలేదు... ఆఖరికామె ఏడ్చిన ఏడుపుకుకూడా విలువ నివ్వలేక పోయాడనంతం...

'ఎప్పుడు వస్తావమ్మా మళ్ళీ?' అని అడిగే కన్నకొడుక్కి 'రా(లే)ను' అని చెప్ప లేకా, వదిలివెళ్ళ లేకా బాధతో మెలికలు తిరిగిందా మాతృ హృదయం...

ఆమె బాధతో, వేదనతో వెళ్ళి పోతూంటే అనంతం మనసు బాధ పడలేదు. తన శని విరగడయిందనీ, తనిక సుఖంగా ఉండవచ్చుననీ ఆశించాడు...

నెలలు గడిచాయి.. ఆమె రాలేదు... అనంతం ఆనందించాడు. కాని ఓ రోజు బజార్లో అనంతానికి మునసబు ఆసుపత్రికి వెళ్తూ రిక్షాలో కనిపించాడు...మునసబు మాటాడలేని నీరసంతోకూడా రిక్షా ఆపించి అనంతాన్ని చీవాట్లుపెడుతూ 'కృతఘ్నుడివి నువ్వు...నీ జీవితంలో అమృతం చిలికించిన దేవత జీవితంలో నిప్పులు కుమ్మరించావ్... రవిమీది బెంగతో ఆమె మంచంపట్టింది... పెద్దవాడు కలరా తగిలి పోయాడు.. చిన్నవాడు బెంగతో శల్యం అయాడు...ఇది న్యాయంకాదు...రవి నామెకప్ప చెప్పేయ్...' అన్నాడుకోపంతో అనంతం ఇంటికి వచ్చేశాడే గానిఆమె రవికోసం వస్తుందేమోఅన్న భయంతోనే ఉన్నాడు ... వెంటనే ఇల్లు మార్చేశాడెందుకైనా మంచిదని ... కొన్ని నెలలు అలాగే గడిచిపోయాయి...రవి బడికివెళ్తూ వచ్చేవాడు...శ్రద్ధగా చదువుకొనేవాడు ... అనంతం పెంపకంలో 'అమ్మ' 'అన్న' అన్న పదాలే మర్చిపోయాడు రవి ... మరో ఆర్నెల్లు గడిచిపోయాయి...

పార్వతమ్మని గురించి అనంతం భయపడినట్టే, ఆమె ఒకరోజు రానే వచ్చింది! కాని ఆమెరూపే మారిపోయింది ... రేగిన తెల్లనిజుట్టు ముఖంనిండా పడిపోతూంది... పోల్చలేనంతగా చిక్కిపోయింది ... ఎముకల గూడులా ఉందామె ... నీరసంగా లోపలికి వస్తూనే 'నా రవేడీ...చూపించు...నాకొడుకుని! నా బాబు...నా రవి నిచ్చెయ్యి! ముందు చూపించు రవిని దుర్మార్గుడా'... ఆమె అరిచింది ఆవేశంతో...అనంతం ఒక్కసారిగా త్రుళ్ళిపడ్డాడు ... ఆమె ఎలా వచ్చిందోకూడా అర్థంకాలేదు ... చిన్న



పిల్లాడ్ని ఎక్కడ వదిలిందోకూడా బోధ పడలేదు అనంతానికి...కాని అంతలోనే అతనిలోని స్వార్థం అతని కెంతో ధైర్యాన్నిచ్చింది...అతడు ఆమెదగ్గరగా వెళ్తూ 'రవెవరు ? రవీ లేడు...ఎవరూలేరు వెళ్ళు' ...కాస్త గట్టిగావే అన్నాడు...ఆమె అంత నీరసస్థితిలోనూ ఎగిరిపడింది "ఏడీ ? రవి? చూపిస్తావా ? చూపించవా ? నా రవి నా ప్రాణం...వాళ్ళిద్దరూ నామీద కోపంతో వెళ్ళిపోయారు. నా రవే నాకింకదిక్కు..." అంటూ భోరుమని ఏడ్వడం మొదలు పెట్టింది .అనంతం ఆమెని చెయ్యిపట్టుకు వీధిలోకి తీసుకెళ్ళి తాను తలుపేసేసుకుంటూ 'వెళ్ళు ...రవిక్కడ లేడు'... అన్నాడు...ఆమె ఏడుస్తూ వెళ్ళిపోయింది.

అనంతం రవి కోసం ఎదురుచూస్తూ నించున్నాడు వీధిలో...ఒక్క పరుగులో వస్తూన్న రవి బోర్లాపడి రాగాలు మొదలు పెట్టాడు...అనంతం వళ్ళో వెక్కుతూ రవి 'నానా...పిచ్చిదటనాన్నా...వెంటబెట్టింది... ఇక్కడదాకా వచ్చిందికూడా...బా ... బూ అంటోంది నన్ను'...అన్నాడు భయంతో... అనంత వంటినిండా తేళ్ళూ జెర్రిలూ ప్రాకినట్టే అయింది...కాళ్ళ క్రిందిభూమి కదిలి తను కృంగిపోతున్నట్టు బాధపడ్డాడు ...వీధితలుపు వేయాలని వెళ్తున్న అనంతానికి రవి 'నాన్నా' అనివేసిన కేక వినబడి వెనక్కి తిరిగాడు ... వీధిలో నించున్న పార్వతమ్మ రొప్పుతూ, రోజుతూ లోపలికి వచ్చింది...రవి తండ్రి పీకపట్టుకుని కళ్ళు మూసేసుకున్నాడు భయంతో ... అనంతం ఏమిచెయ్యాలో అర్థంకాక అయోమయంగా నిలబడిపోయాడు...

'దా...బాబూ...నేను పిచ్చిదాన్నికాను... దా ఒక్కసారిరా బాబూ...రవీ'... చేతులు జాపుతూ ఆమె రవిదగ్గరికి వస్తూంటే, రవి కెవ్వునఅరిచి స్మృతి తప్పిపోయాడు... అనంతం గాభరాగా...రవిమీద నీళ్ళు జల్లుతూ 'వెళ్ళు పార్వతమ్మా...రవి భయపడి పోతున్నాడు...పిచ్చిదానివని అనుకొంటున్న రవి నీ దగ్గరికెలా వస్తాడు ? వెళ్ళు...నీ రవి బాగుకోరితే వెళ్ళిపో...రవిని దక్కనియ్యి' ...అంటూ బ్రతిమాలే ధోరణిలోచెప్పాడు... పార్వతమ్మ ఆవేశంతో... 'నువ్వు కర్కోటకుడివనీ, ఇలా అన్యాయం చేస్తావనీ తెలీక ఇచ్చాను...అనుభవించుతున్నాను ... ఇప్పుడు

విధిలిఖితం

మాత్రం రవిని ఎత్తుకోకుండా వెళ్తానా ? నా రవి...నా ప్రాణం...తే...నా కొడుకుని...నా రక్తాన్ని!' అంటూ రవి నెత్తుకో బోతూంటే అనంతం కోపంతో ఆమెని వీధిలోకి నెట్టివేసి తలుపు వేసేశాడు ... పార్వతమ్మ ఏడుస్తూ కిటికీదగ్గరకి వచ్చింది... 'బాబూ...నా రవిదొక ఫోటో యేనా ఇయ్యి... వెళ్ళిపోతాను...' ప్రాధేయపడింది మాతృహృదయం. అనంతం ఆమె నెలాగైనా వదుల్చుకోవాలని తొందరగా గోడనున్న ఫోటో తను రవినెత్తుకుని తీయించుకొన్నది కిటికీలోంచి త్రోసాడు ... ఆమె ఏడుస్తూ ఎప్పుడు వెళ్ళిందో అనంతానికి తెలీలేదు... అతడు రవి సేవలో ఉండిపోయాడు...

ఒక్కొక్కరి జీవితంలో ఒక్క సంఘటన గొడ్డలిపెట్టులా తగులుతుంది ... పార్వతమ్మ జీవితాని కారోజు సంఘటనతో మతిచెడింది...ఆమె భర్తపోయిన తర్వాత ముగ్గురు పిల్లలూ మూడు ప్రాణాలను కొని పెంచుకునేది...ఆ రోజుల్లో అనంతం విషాదజీవితం ఆమెకి చెప్పాడు ... ఆమె మాతృహృదయం జాలితో అతడికి దయ చూపింది...రవినిస్తే రవితోపాటు తక్కిన వాళ్ళూ బాగుపడ్తారని ఆశించిన మాతృహృదయానికి జరిగినవన్నీ గొడ్డలిపెట్టులే అయ్యాయి...తనవారనుకొన్న ఇద్దరూ తండ్రిదగ్గర కెళ్ళిపోతే, అది దైవం చేశాడని ఏడ్చింది...మొత్తుకుంది.. కాని లాభం లేదని తెలుసుకుంది...రవికోసం ఆమె తల్లడిల్లిపోతూ, ఎలాగో కనుక్కొని వచ్చింది. అనంతం వెళ్ళగొట్టడమూ, చిన్నారి రవి తనని పిచ్చిదని భ్రమపడి భయపడటమూ ఆమె హృదయాన్ని బరువెక్కించి, మెదడికి తీవ్రమైన సంక్షోభం కల్గచేశాయి...ఆమె రవిని తల్చుకుంటూ, వీధుల్లో తిరుగుతూ ఎక్కడ పిల్లలు కనబడినా రవికోసం 'బాబూ' అని వెదుకుతూ, అందరిచేతా రాళ్ళదెబ్బలు తింటూ నిజంగా పిచ్చిదాని లాగే అయిపోయింది ... మునపటు చనిపోవడంతో ఆమె వీధులే తనఇల్లుగా తిరగ సాగింది పిచ్చిగా...ఆమె ఆశయాలతోరణాలన్నీ, అనంతం స్వార్థపు టగ్నికాహుతై బూడిదైపోయాయి...

అనంతం ఇక ఆట్టే ఆలోచించలేదు... పార్వతమ్మనించి రవిని వేరుచేయడానికే నిశ్చయంచేసి, తనకున్నవన్నీ అమ్మకానికి పెట్టేసి, తన రవిని తీసుకుని మద్రాసు వెళ్ళిపోయాడు...

మద్రాసు చేరిన అనంతం నిర్విచారంగా గుండెమీద చేయివేసుకు హాయిగా నిద్రపోయాడు...తన చిన్నారి రవికోసం వీధుల వెంబడి తిరిగే తల్లి ఆతడికేనాడూ తలపుకికూడా రాలేదు...కాలచక్రం ఎన్ని జరిగినా, తనవిధి నిర్వహణ యథాప్రకారం చేసుకుపోతూంది...కాలచక్ర భ్రమణంలో ఎన్ని వసంతాలు వెనక్కి నెట్టివేయబడ్డాయో! ఎవరి కెరుక?...

చిన్నారి రవి పెద్దవాడయాడు...చిన్న స్కూలు వదలి కాలేజీ చదువు చదివాడు. ఆఖరికి డాక్టరు కోర్సు పూర్తికూడా చేసాడు...అనంతం తన రవి డాక్టరని తలచుకుంటూ మురిసే రోజు ముందరికి వచ్చింది ఎగురుకుంటూ......

కాని రవికీ, తండ్రికీ భేదాభిప్రాయాలు వచ్చాయి ఆ విషయంలో...'ఎక్కడికైనా, దూరమైనా వెళ్ళక తప్పదని రవీ, 'అలా వీల్లేద'ని తండ్రీ......

ఆఖరికి రవిమాటే నెగ్గింది! అనంతం ఏ ప్రాంతాలకి భయపడి మకాం మార్చేశాడో, అదే ప్రాంతాలకి వెళ్ళాల్సి వచ్చింది. అనంతం ఎంతవద్దన్నా రవి వినలేదు...' ఆఖరికి గుడికివెళ్ళే మేకపోతులా రవితో అనంతం భయపడుతూనే రైలెక్కాడు...

ఇంకా పిచ్చిది బ్రతికే ఉంటుందా?' అనీ, 'బ్రతికినా రవిని ఇంతపెద్దవాడయేక పోల్చుకుంటుందా?' అనీ, అనంతం కొంచం నిబ్బరంగానే ఉన్నాడు...ఓ మూల ఏదో భయంకూడా పీక్కుతింటూనే ఉంది. అలా ఒక ఏడాది గడిచిందేమో!

మనం దేనికి భయపడతామో అదే ఎదురైమన్ని బాధపెట్టడం నిత్యమూ మన జీవితాల్లో కన్పించే నగ్నసత్యం! అనంతం జీవితంలోకూడా అదే జరిగింది ఓ రోజు...

ఆ రోజు ఉదయాన్నే కారులోవెళ్ళిన రవి పన్నెండయినా రాలేదు. అనంతం వంట వండి రవికోసం ఎదురు తెన్నులుచూస్తూ కూర్చున్నాడు...రవిరాందే తనుతినడు... రవి ఎంత చెప్పినా 'నీతో తినకపోతే కడుపు నిండదు రవీ' అంటాడు నవ్వుతూ... రవి తండ్రి అభిమానానికి పొంగిపోతాడు...

'తల్లి ఉరోజే' అని తలపుకు వస్తుంది రవికి...చెమ్మగిల్లిన కళ్లతో అన్నపూర్ణ ఎన్లార్జిమెంటుకి నమస్కారం చేస్తాడు... రవి తల్లిని తలుచుకుని కన్నీరు నింపినప్పుడల్లా అనంతం మనస్సులో ఏదో మూల కలుక్కుమంటుంది! 'నీ తల్లి బ్రతికే ఉంది రవీ'...అనుకొంటాడు తనలో...అంతలోకే సర్దుకు పోతాడు మళ్లీ...తను చేసింది తప్పుకాదని సమర్థించుతుంది అతడిలోని స్వార్థం...మానవుడు తను చేసింది తప్పని తెలుసుకునే వాడే అయితే తప్పే చేయ(లే)డేమో!...

రవి ఆ రోజింకా రాలేదని అనంతం అటూ ఇటూ పచార్లు చేస్తూండగానే రెండు గంటలు కొట్టారు ... తనే ఆసుపత్రికి బయలుదేరుదామని తాళం వేస్తున్న అనంతం రవికారు హారన్‌తో తలుపుతీసాడు. రెండుకంచాలు పెడ్తున్న తండ్రినిచూచి, 'ఇంకా మీరూ తినలేదా? అలా అయితే ఎలా? ఇవాళ రాకూడదనుకొని రావడం మంచిదే అయింది...' అన్నాడు రవి బట్టలు విప్పుకుంటూ...

అనంతం నవ్వుతూ 'నీతో తినందే తోచదురా రవీ ... నీకు నేనూ, నాకు నువ్వూ ఉన్నాం...మనిద్దరం వేరుగాతినడం ఏమిటి? ఎందుకింత ఆలస్యమైందసలు ?' అనడిగాడు...రవి అదోలా అయిపోతూ 'నాన్నా... ఇవాళ నాకారు క్రిందపడింది ఒకముసిలిది... సడన్ బ్రేక్ వేసినా, ఆమె స్మృతితప్పి పడిపోయింది. దెబ్బలు తగల్లేదు కనక భయం ఉండకూడదు ... అయినా ఆమె చాలా నీరసంగా ఉందినాన్నా ... అసలామె పిచ్చిదంటున్నారంతా'...అన్నాడు...


'పిచ్చిది' అన్న ముక్కవిన్న అనంతంలో ఏదో అనుమానం, భయం ఆవరించాయి.

'ఆమె పార్వతమ్మే అయితే?' అనుకుని భయపడ్డాడు. 'అదే పోయిందిలే పిచ్చివాళ్లతో మనకేమిటి ?' అన్నాడు...రవి 'అలా ఎలానాన్నా ? ఆమె నా కారుక్రింద పడింది ! ఆమె నా ఆసుపత్రిలోనేఉంది... ఆమెదగ్గరే ఇప్పటివరకూ ఉన్నాం...ఇంకా తెలివిరాలేదు నాన్నా...ఆమెని చూస్తూంటే ఏదోలా అన్పించుతోంది ... ఏదో బాధగా ఉంది...' రవిమాటలువిన్న తండ్రి ఆమె పార్వతమ్మే అయి ఉంటుందని నిశ్చయం చేసుకోగానే, అతడి గుండెల్లో బండపడాయి పడిపోయింది...రవి భోంచేసి పడుకోగానే అనంతం ఆసుపత్రికి వెళ్లాడు... 'ఆమెని' చూసివచ్చాడు...'ఆమె పార్వతమ్మే ... ఇంకా బ్రతికేఉందా ?' అనంతం ఆయోమయంలో పడిపోయినా, 'అదేపోతుంది రెండురోజుల్లో' అని సర్దిపెట్టేసుకున్నాడు.

రవి ఆస్పత్రికి వెళ్తూనే ఎందుకో ఆమెని చూడాలనిపించింది ... ఆమె దీన వదనం రవిముందు కదలి ఏదో వ్యక్తంకాని బాధ ననుభవించాడు. రవి కదే ఆశ్చర్యంగా ఉంది. 'తనెన్నో ఇలాటివీ, ఇంకా దీనమైనవీ చూశాడు...ఎప్పుడూ ఇలా ఫీలవలేదు తను! ఈనాడామెని చూచినా, అధమం ఆమెని తలుచుకొన్నా మనసంతా పుండులా అయిపోతూంది!' దానికేమిటి కారణమో తెలీక బాధపడ్తూనే ఆమెదగ్గరికి వెళ్లాడు ... సిస్టరు ఎదురైంది ... 'నాన్నగారిప్పుడే ఆమెని చూసి వెళ్లారు'... అని చెప్తూ ఆమె కోసారి తెలివివచ్చి 'బాబూ' అంటూ మళ్లీ స్మృతి తప్పిందనీ చెప్పింది ... రవి దగ్గరగా ఆమెని చూశాడు...ఏదో బాధతో అతడికళ్లలో నీళ్లు తిరిగాయి...వరౌనంగా వచ్చేశాడు ... తన తండ్రి ఎందుకామెను పనిగట్టుకు వెళ్లి చూశాడో అర్థంకాలేదు రవికి ... తండ్రి నదే అడిగాడు రాత్రి...'ఛ. .నే వెళ్లలేదు రవీ...నాకేంపని పిచ్చిదాంతో' అన్నాడు. కానీ అనంతానికేదో దిగులనిపించింది.

రవి ఆమె బంధువులెవరో తెలుసుకురాలే మరిచిదని, పేపర్లో ఫోటో వేయించాడా రోజు ఆమెది ... ఎంతమందో అనాథలు పోతే నర్సులే ఈడ్చిపారేశారిది వరకు...కాని ఈమెనలా చెయ్యడానికి రవి మనస్సెందుకో ఒప్పుకోలేదు ... ఒక పిచ్చిదానిమీద డాక్టరుగారి కింతశ్రద్ధ ఎందుకో తెలీక ఆశ్చర్యపడిన నర్సులు కూడా ఆమెంటే శ్రద్ధగా చూస్తున్నారు, రవిఫోటో వేయించినట్లు చెపితే అనంతం చికాగ్గా 'అనవసరం. అలాటి పిచ్చి వదులుకోవాలి రవీ...ఆస్పత్రిలో అనాథలకి కరవా? ఎంతమందికి ఫోటోలు వేయిస్తావ్? ఎవరూలేని అనాథలే ఆస్పత్రిలో చస్తారు'...అన్నాడు... రవి పట్టించుకోలేదు.

ఆ రాత్రి రవి పదయేదాకా ఉండీ ఆమెని చూడాలని వెళ్లాడు...సిస్టరు కూడా వచ్చింది...డాక్టర్...మధ్యాహ్నం ఆమె బట్టల్లో ఈ ఫోటో దొరికింది...అంత ముఖ్యంకాదని మీకు చెప్పలేదు'...అంటూ ఫోటో చూపించింది...రవి అది తీసుకుని వచ్చి చూచాడు...నలిగి, పాతపడిపోయింది ఫోటో...అట్టకూడా లేదు...అస్పష్టంగా రెండు ఆకారాలు కనబడుతున్నాయి...రవి పరీక్షగాచూసి ఒక్కసారి త్రుళ్లిపడ్డాడు... ఫోటోలో తండ్రిపోలికలున్న పురుషుడో అబ్బాయి నెత్తుకున్నాడు! 'తన తండ్రి ఫోటోయే అది! ఆమెదగ్గరెందుకుంది? ఆమె నారోజు నాన్నెందుకుచూచారు? ఏదో ఉన్నది! నాన్న దాస్తున్నారు'.. రవి బాధగా మెల్లిగా అడుగులేసుకుంటూ వెళ్లాడు.



విధిలిఖితం

'రవీ.. పిచ్చి దాని కెలా ఉంది?' వెళ్ళిందా'? అనంతం అడిగితే రవి మాట్లాడలేదు. కాసేపాగి ఉన్న తర్వాత 'ఆమె మీకు తెలుసునాన్నా...నాదగ్గర దాచకండి...ఆమెదగ్గర మీ ఫొటోకూడా దొరికింది రోజు...మీరు కాదన్నా ఏదో సంబంధం ఉందని నిశ్చయంగా తెలుస్తూనే ఉంది...ఆమెనిచూస్తే నా బాధే...ఆమె మనకేదో అవుతుందని చెప్తూంది నామనస్సుకి... అసత్యం ఆడడానికి ప్రయత్నంవద్దు...'రవి అంత ఖండితంగా మాట్లాడితే అనంతం ఒక్కసారి గాభరాపడిపోతూ ఫొటో తీసుకుని చూశాడు...

'ఆమెకానాడు కిటికీలోంచి తనిచ్చిందే! అద్దం అట్టా పీకేసి అలాచేసింది.' ఏదో ఒకటి చెప్పకపోతే రవి ఊరుకోడని తెలుసు. అనంతం ఘోరమైన అబద్ధం ఆడడానికి కూడా వెనుదీయలేదా క్షణంలో...రవీ.. నిజమే! దాచాలనుకొన్నా బయట పడింది! ఆమె నాచెల్లెలే...నాన్న యుక్తవయసులో చూచే పెళ్ళి సంబంధాలను కాలతన్ని అనామకుడితో లేచిపోయింది. .నాన్న మంచి పడి ఆస్తినాకే ఇచ్చారు ... నాన్నపోయాక. అతను వదిలిపోయాడని, ఇద్దరు పిల్లలని వచ్చింది ఓరోజు...కాని నాన్న ఆమెతెచ్చిన అప్రతిష్టతోనే పోయారన్న కోపంతో ఆమెని వెళ్ళగొట్టేశాను...ఆరోజే ఈ ఫొటో తీసుకెళ్ళింది ... తర్వాత చూశాన్నేను... ఆమె పిచ్చిగా తిరుగుతున్నట్టు విన్నాను... నువ్వు పిచ్చిదనగానే ఆరోజు అందుకే చూసివచ్చాను.. ఆమెనిచూస్తే నాకూ బాధగానే ఉంటుంది రవీ...ఇదీ నిజం! ఆమెని వేగం పంపించెయ్!' అనంతం అందంగా అబద్ధం ఆడితే రవి అమాయకంగానే నమ్మివేశాడు. 'ఆమెనింటికి తెద్దాం' అని, అనంతం చికాకు చూపిస్తే ఊరుకున్నాడు రవి...

ఆమె తన మేనత్తకావటాన్నే అంతగా ఉంటోందని అనుకుని తృప్తిపడ్డాడు రవి...ఆమెకి బాగుచేసి, ఆమెచేత క్షమాపణ చెప్పించి, ఇంటికి తేవాలనికూడా నిశ్చయించుకున్నాడు...

కాని మూడోరోజు సారథి వచ్చాడు డాక్టరు రవిని వెదుకుతూ...సారథిపస్తూనే

'డాక్టర్ ... ఆమెఫోటో చూసివచ్చాను. మా ఆడవాళ్ళు ఆమెని తీసుకు రమ్మంటున్నారు...ఆమెని డిశ్చార్జిచేస్తే సంతోషం... ఆమెకి జబ్బేదిలేదు...' అన్నాడు. రవి ఆశ్చర్యంతో 'పిచ్చిదటగా? సారధి? మీకేమవుతుందామె? ఇంట్లో ఎలా ఉంచుకొంటారు? ఆమెని మీకు తెలుసా? భర్త పిల్లలుఉన్నారా?' చకచకా ప్రశ్నలు వేశాడు...
'లేరు...ఆమె పిచ్చిదికాదు డాక్టర్...సంఘంలో స్వార్థపరు లెక్కువైతే ఆమెలాంటి అమాయకులు పిచ్చివాళ్ళనే పిలవబడతారేమో...ఆమె జీవితచరిత్రే ఒకగాధా... బాధానూ...ఆమెని డిశ్చార్జిచెయ్యండి. ఆమెకదే పదివేలు! ఆమెకి దిక్కెవరూ లేరు!' విషాదరేఖలు సారధి ముఖాన్ని పులుముకున్నాయి. రవి ఆమె చరిత్రను తనువిని తీరాలంటూ సారధిని ప్రాధేయంగా అడిగితే సారధి తనకి తెలిసినదంతాచెప్తూ, ఇదీ ఆమెచరిత్ర! కొడుకుపేరు జ్ఞాపకంలేదు నాకు! ఆ స్వార్థపరుడికోసం ఆదేవత తన రక్తాన్నిస్తే, అతడామె జీవితాన్నే ధ్వంసం చేసి, ఆమె రక్తాన్ని తను ఆనందంగా అనుభవిస్తున్నాడు డాక్టర్ ... అతడికేనాడైనా శిక్ష అనుభవించేరోజు రాదంటారా?' సారధి...ఆవేశంతో పళ్ళు బిగించాడు...ఆమె తన కొడుకు ఫోటోనే దగ్గరుంచుకుందని కూడా చెప్పాడు...రవి కల్లోలమైన హృదయంతో 'మిస్టర్ సారధి వారం ఆగిరండి...మీ ఎడ్రసిచ్చి వెళ్ళండి. ఆమె బాగుంటే తీసుకువెళ్ళురుగాని...అవసరం అయితే కబురుచేస్తాను...' అన్నాడు... సారధి తన మామగారైన మునసబు ఇంటి ఎడ్రస్ వ్రాసి ఇచ్చి వెళ్ళిపోయాడు.

రవి బాధగా తల కొట్టుకున్నాడు... 'ఏదినిజం? ఏదబద్ధం? నాన్న అబద్ధం చెప్పారా? సారధికేం పట్టింది? అబద్ధం ఆడటానికి? తన మేనత్తకాదా ఆమె? ఆమె తనను నవమాసాలూమోసి కన్న మాతృదేవతా? మరి అమ్మఫోటో? తను తండ్రికి పెంపకం కొడుకా?' రవిహృదయం అల్లకల్లోల సాగరంలా అయింది...నిజం ఎలా తెలుసుకోవాలో తెలీని రవి బాధగా నిట్టూర్చాడు...రాత్రి పది తర్వాత ఇంటికి వెళ్ళాడారోజు...రవి...బాధతో బరువెక్కిన హృదయంతో...

అనంతం మామూలుగా భోంచేసి పడుకున్నాడు...రవికి మాత్రం నిద్రరాలేదు. 'తను నిజంతెలుసుకోనేదెలా?' అన్న సమస్య రవిని బాధించి వేధించింది. రాత్రి పన్నెండయ్యాక రవి ఒక నిశ్చయానికివచ్చి నిద్రపోయాడు. మర్నాడంతా రవి మామూలుగానే తిరుగుతూ తండ్రితో మామూలుగానే ఉన్నాడు...రాత్రి వేగంగానే వచ్చాడు... అనంతానికి నీరసం తగ్గుతుందనీ, మంచి శక్తిగా ఉంటుందనిచెప్తూ అనంతానికి ఇంజక్షనిచ్చాడు...తన రవికి తనమీద ఉన్న శ్రద్ధని చూసిన అనంతం ఆనందంతో మత్తుగా నిద్రాదేవి వడిలో వాలిపోయాడు.

రవి టైము చూశాడు...పదీపావు! ఒక్కసారి మత్తుగా పడుకున్న తండ్రినీ, ఎదురుగా నవ్వుతూన్న అన్నపూర్ణ ఫోటోనీ చూసి ఒక్కసారి నిట్టూర్చాడు... తండ్రి గదిలోకివెళ్ళి పెట్టెతీశాడు తండ్రిది.. రవి చేతులు వణికిపోయాయి ... దడ దడలాడే గుండెలూ, వణికే చేతులూ, వెనకాడే హృదయమూ రవిని కల్లోల పరిచాయి . . 'ఇంత చదివీ, తండ్రి తన జీవితాన్ని గుట్టు బయలుగా దాచుకొన్న 'డైరీ' చదవడానికి సిద్ధపడ్డాడు తను!' ఇదే బాధతో రవి తల్లడిల్లిపోయాడు ..అయినా నిజం తెలుసుకోవాలంటే తప్పైపనేనా చేయాలి ... ఒక పెద్ద 'మంచి'కోసం చిన్న 'చెడు'చేయడం మంచిదే అనుకొన్నాడు మళ్ళీ ... ఆఖరికి వణికే హస్తాల్తో డైరీ తెరవబడింది ... ఎర్రసిరాతో కొన్నిచోట్ల గీటులు పెట్టబడి ఉన్నాయి...రవి చలించే నేత్రాలు చదువుకు పోతున్నాయి ...

అనంతం తన జీవితమంతా డైరీలో పొందుపరిచాడు...ప్రతీ సంఘటనా విపులంగా వ్రాసుకున్నాడు ... ఒక్కొక్కటీ చదువుతూంటే రవి హృదయం బాధతో మెలికలు తిరిగి పోతూంది ... పార్వతమ్మ ఏడుస్తూ బ్రతిమాలడమూ, తన తండ్రి కాఠిన్యమూ చదివిన రవి క్రోధంతో వణికిపోయాడు.. ఆమె పిచ్చిదిగా మారే సంఘటనలన్నీ చదివిన రవి పిచ్చివాడే అయిపోయాడు. 'అమ్మా...ఎంత బాధపడి పోయావమ్మా ... నేను బ్రతికుండీకూడా నిన్ను పిచ్చిదాన్ని చేశానమ్మా'...రవి బాధగా తల గోడకేసి బాదుకున్నాడు...టైము టంగ్ టంగ్ మంటూ నాలుగు కొట్టేదాకా, రవి అయోమయంగా కూర్చుండి పోయాడక్కడే...

ఒక్కసారి త్రుళ్ళిపడి లేచి, తండ్రి పెట్టెలో అన్నీపడేసి తలుపేసి, తండ్రిగది దగ్గరకి వచ్చాడు ... తండ్రిమత్తు ఇంకా పనిచేస్తూంది...తన బ్యాగూ, పర్సూ తీసుకు గేటు దాటాడు...ఆస్పత్రిలో రోగులెవరూ లేవలే దింకా ... కోళ్ళు ఒక్కొక్కసారి కూస్తున్నాయి ..చీకటింకాపేరుకునేఉంది...



రవి ఆమె దగ్గరికి వెళ్ళాడు గా: ఆమె నిద్రలోఉంది...మానవ స్వభావమైన తెలివి లేదామెలో...రవి సిస్టర్ల సహాయంతో ఆమెని జట్కాలో పడుక్కో పెట్టాడు. సిస్టర్లకీ విషయం కట్టుదిట్టంగా ఉంచమని చెప్పి, తనూ జట్కా ఎక్కాడు ... జట్కాలో తల్లితల తన తొడమీదపెట్టుకుని చూస్తూ కూర్చున్నాడు.. అప్పటికే వాలుగుమ్మూలలా వెలుతురు ప్రవేశించి, చీకటిని పారద్రోలింది...

రవి తల్లిపడ్డ బాధలన్నీ తలుచుకుంటూ, తనతండ్రి ఎందుకిలా చేశాడా అని బాధపడుతూ కూర్చున్నాడు ... 'తన తల్లి ఇక జీవించేది దినాలో, గంటలో ? తనకి తల్లిలేదని దుఃఖించేవాడు ! తనకూ ఒక అమ్మ ఉందని మురిసేలోగా, తల్లి తనని విడిచి వెళ్ళిపోతుంది ! మళ్ళీ తనకి తల్లిలేని జీవితం మిగులు!' జట్కా మునసబుగారింటి దగ్గర ఆగింది...సారథి జట్కా దగ్గరికి వస్తూనే గాభరాగా ... 'డాక్టర్...ఏమిటిది ?' అన్నాడు...రవి విచారంగా ముఖంపెట్టి 'ఆమెని తెచ్చాను సారథీ ...ఆఖరిదశలో ఉంది...అంత్యకాలంలో ఆమె కోరిక తీరింది సారథీ'...అన్నాడు. సారథి అయోమయంగా చూశాడు ... ఆమెని ఇంట్లో ఆదరంగా పడుకోబెట్టి ఆడవాళ్ళు విచారంగా నిలబడిపోయారు...తన తల్లిమీద ఆ కుటుంబం చూపే ఆదరణకీ, అభిమానానికీ, ముగ్ధుడైపోయాడు

విధిలిఖితం


రవి...అంతా నిశ్శబ్దం అయింది...రవి బాధపడుతూ, సారథికంతా వివరంగా చెప్తూ 'సారథీ...అమ్మ నాకోసం అష్టకష్టాలూ పడింది...నేను అమ్మా అని నోరారా పిలిచే సమయానికి తెలివిలేకుండా పడిఉంది ... నా మనస్సంతా బాధతో నిండిపోయింది ... అమ్మకిక ఆఖరిక్షణాలివి'...రవి భోరుమని ఏడుస్తూంటే సారథీ, తక్కినవాళ్ళూ ఓదార్చారు...'ఆమె కన్నకొడుకు మీరే అని తెలిసినందుకే సంతోషంగా ఉంది ... పోయే జీవికి ప్రాణంపోయడం మనకి చాతకానిపని డాక్టర్...ఆఖరిదశలోనైనా ఆమె తృప్తిగా ప్రాణంవిడిస్తే అదే పదివేలు ! ఆమెకొక్కసారేనా తెలివి వచ్చేటట్టు చేయండి ... కళ్ళారా కన్నకొడుకును చూచి మరీ ప్రాణం విడుస్తుంది'.. సారథిఅన్నాడు విచారంగా... రవి ఇంజక్షన్ ఇచ్చాడు ... రవిని చూచి ఆ కుటుంబం ఎంతో సంతోషించారు ...

సాయంత్రం వరకూ అలాగే ఉంది ... రాత్రయ్యాక ఆమెలో కొంచెం చలనం కలిగింది...రవి సంతోషంతో సారథి వేపు చూశాడు...సారథి ఆమెనోట్లో గ్లూకోజ్ పోశాడు...ఆమె నయనద్వయం విడివడింది ...వదనంలో ఏదో కాంతి తళుక్కుమంది... ఆమె శుష్కించిన అధరాలు కంపించాయి... అస్పష్టంగా ఆమె ఏదో గొణిగింది ... 'బా...బా' అంటూ...రవి బాధగా ఆమె ఎండిపోయిన చేతిని తన చేతిలోకి తీసుకుంటూ ఆమెమీదకు వంగి 'అమ్మా ... నీ బాబు వచ్చాడమ్మా ... కళ్ళుతెరిచి చూడమ్మా...నోరారా రవీ అని పిలువమ్మా ...నిన్ను పిచ్చిదాన్ని చేసిన నీ రవి వచ్చాడమ్మా ... నీకోసం ... అమ్మా ఒక్కసారి తెరువు నన్ను చూడు...అమ్మా...' రవి చిన్నపిల్లాడిలా వలవలా ఏడుస్తూంటే, అంతా కళ్ళు వత్తుకున్నారు ... తనకోసమే ఆమె ఇన్నాళ్ళూ ఇంతగా బాధపడిందని తెలుసుకున్న రవికి దుఃఖం ఆగడంలేదు ... ఎంత ఊరడించినా అతనికి దుఃఖం పెల్లుబికి వస్తూనే ఉంది...

హఠాత్తుగా ఆమెకళ్ళు తెరచింది. శూన్యంలోకి వాలుగుప్రక్కలా చూస్తూ తన రెండుచేతులూ ఎత్తాలని ప్రయత్నం చేసింది...అతి నీరసంగా ఉన్న ఆమెహస్తాలు మరి కదలలేక ఒక్కసారి క్రిందపడిపోయాయి...కన్నకొడుకుని చేతులారా తడుముకుని గుండెకి హత్తుకుందా మమకొందేమో ఆ మాతృహృదయం! కాని ఆమెలో కాంతి ఒక్కసారి మాయమైపోయింది! వదనం కళా విహీనమైపోయింది...రవి ఒక్కసారి గొల్లుమన్నాడు ...ఆమె కన్నకొడుకు హస్తద్వయంలో తృప్తిగా జీవితం చాలించుకొంది...

అనంతం నాలుగురోజులై పిచ్చివాడిలాగే తిరుగుతున్నాడు...రవి ఎక్కడికి, ఎందుకు తనతో చెప్పకుండా వెళ్ళాడో అని తోచకుండా తిరుగుతున్నాడు. 'ఆమె ఉందేమో అని వెళ్ళిచూచాడు. ఆసుపత్రిలో లేదామె.. డిశ్చార్జి అయిందని చెప్పారు. 'రవి ఎక్కడికెళ్ళినట్టు? అనంతం హృదయం బాధతో నిండింది...'రవిలేని క్షణం తనకి యుగంలాఉంది...తనరవి తన ప్రాణం కన్న ఎక్కువ! రవిని వదిలి ఉండలేదు తను! అనంతం హృదయంలో ఏదో వెలుగు కన్పడింది...'తనెంత పనిచేశాడని? కన్నతల్లికి కొడుకు కాకుండా వేరుచేశాడు...ఆమెని పిచ్చెక్కించి రోడ్లవెంబడి తిరిగేటట్టుచేశాడు... పైగా ఆమె 'పిచ్చిది' అని భయపెట్టాడు కొడుకును! పెంచినప్రేమకే తను రవికోసం మూడురోజుల్లో ఇంతగా ఇదయిపోతున్నాడే? ఆమెకన్న కడుపుకోసం పిచ్చెక్కిందంటే ఆశ్చర్యమేముంది కనక? ఛీ...ఛీ... ఎంత స్వార్థపరుడై పోయాడు తను? రవీ!






వాటర్‌బరీస్ కాంపౌండ్

ఎఱ్ఱ లేబిలు

ఉపశమనముతో సహా రోగనిరోధక శక్తిని కలిగిస్తుంది!

దగ్గు, జలుబులతో నీరసముగా ఉండి రోగనిరోధక శక్తిని కోల్పోతారు అటువంటప్పుడు మీకు యితర వ్యాధులు సోకే అవకాశముంది.

వాటర్‌బరీస్ కాంపౌండులో గల ఓషధులు ఆకలిని వృద్ధి చేస్తాయి. కోల్పోయిన శక్తిని తిరిగి చేకూరుస్తాయి, ఇతర వ్యాధులు కలగకుండా రోగనిరోధక శక్తిని యిస్తాయి. దీనిలో చేర్చబడిన 'క్రియొసోట్' మరియు 'గయొకోల్' దగ్గు, జలుబుల నుండి ఉపశమనమును కలిగిస్తాయి.



బలము మరియు ఆరోగ్యమునకు వాటర్‌బరీస్ కాంపౌండ్ త్రాగండి!

వార్నర్-హిందూస్థాన్ లిమిటెడ్


విధిలిఖితం

రా...నిజం తెలుసుకో...నీ అమ్మని తీసుకు వచ్చి ప్రాణం పోద్దాం రవీ...రా...ఎక్కడి కెళ్ళావ్? నాలో పశ్చాత్తాపం కలిగింది రవీ. రా.. నన్ను క్షమించు ... మిమ్మల్నిక ఎవరూ వేరుచేయలేరు రా. రవీ...అనంతం గుండె బాధగా బరువెక్కింది...తనలో పరివర్తన వచ్చిన శుభక్షణం! దాన్ని పదిలంగా తన జీవితడైరీలో సువర్ణాక్షరాలతో లిఖించాలి! మరి తను రవినీ, తల్లినీ దుఃఖ పెట్టాడు!'.. అనంతం పెట్టె తీశాడు డైరీ కోసం...అడుగునఉండే డైరీ మీదనేపడి ఉంది...అంతా అర్థమయిన అతడు నెత్తి బాదుకున్నాడు...'రవి అంతా తెలుసుకుని తల్లినితీసుకుపోయాడా? ఎక్కడికివెళ్ళాడు? మనసబు ఇంటికా? ఏమో' అనంతం ఇంటికి తాళంవేసి బయలుదేరబోతూంటే, పోస్టుమన్ ఒక కవరిచ్చివెళ్ళాడు...అది రవిదస్తూరే...అనంతం శరీరం గడగడ వణికింది. వణికే చేతులో చింపాడు కవరు...

నాన్నా నమస్కారాలు...

ఈ నిర్భాగ్యుడన్నీ తెలుసుకున్నాడు నాన్నా...అమ్మ ఆఖరిక్షణం ఆస్పత్రిలో... నాకు బాధనిపించింది...మీరు ఒప్పుకోరని తెలుసు నాకు...అందుకే మునసబు ఇంటికి వచ్చాం... అమ్మలేదని ఏడ్చేవేను, నాకూ 'అమ్మ' ఉందని పొంగే లోపలే, మళ్ళీ 'అమ్మ' లేని అదృష్టహీనుడిగా నిలబడి పోయాను లోకంలో...మీకు నాపై ప్రేమ ఉండవచ్చు...కాని కన్నకడుపును దూరంచేసేటంత విపరీతంగా ఉండటం నా దురదృష్టం...అయిన దానికి విచారించే తత్వం కాదునాది...అమ్మ తృప్తిగా జీవం అంతం చేసుకుంది. కాశీ, గయ, వెళ్ళి ఒకనెలలో వస్తాను...ఇంకేం వ్రాయను? అమ్మలేని నిర్భాగ్యుడు రవి...

అనంతానికి గుండెలో పోటువచ్చింది... 'అంతా జరిగి పోయింది...తను దోషిగా కొడుకుముందు నిలబడిపోయాడు...తనకది చాలు! ఆమె కొడుకు చేతుల్లో హాయిగా వెళ్ళిపోయింది...ఆఖరికంతా తారుమారైంది...తన స్వార్థమే తనకిమిగిలింది!' అనంతం వళ్ళు వేడెక్కింది...అక్కడే అలా పడిపోయాడు నిర్జీవంగా... ●



అభిమానం ఆదరణ ఓసారిచచ్చిపోయాక వాటిని తిరిగి బ్రతికించడం సాధ్యమయేనా?' అంటూ వాపోయే వాళ్లని ఏం ఎందుకు సాధ్యంకాదు అని ప్రశ్నించాలి. గుండె తీసి గుండె పెడుతున్న రోజుల్లో, మనస్సులో తీవ్రంగా కోరుకుంటే తల ఎత్తగల్గిన అభిమానం ప్రేమ ఆదరణలు తిరిగి మొలిపించడం ఏమంత గొప్ప?

'మావారు చాలా సరదాగానే ఉండేవారు ఎప్పుడేనా దెబ్బలాడుకున్నా కోపం చేసుకున్నా యిట్టే కలసిపోయేతత్వం వారిది. కాని నాదే. కొంచెం మొండి స్వభావం. ఓ పట్టాన్ని కోపం దిగమింగుకోలేను. సరి కదా అని ఎదుటివారు సర్దుకుంటే పోసితే అవి సద్దుకోనూలేవు! దెబ్బలాటవస్తే—ఇంక అదే పట్టుకు పాకులాడ్డం, పిడుక్కూ బియ్యానికీ దెప్పడం, మాట్లాడకుండా బిగుసుకుపోవడం—ఇవన్నీ నాలో ఉన్న బలహీనతలే. ఒప్పుకుంటాను. కాని ఏం చెయ్యను! వాటిని గెలిచే మానసిక దారుఢ్యం నాకు లేదేమో అనుకున్నాను. అందుకే ఒక్కొక్కప్పుడు కోపంవస్తే నెలా రెండునెలలుకూడా మాట్లాడ్డం మానేసి ఊరుకునేదాన్ని చెప్పా చెయ్యకుండా అమ్మగారింటికి వెళ్లిపోయి యిష్టం వచ్చినప్పుడు వచ్చేదాన్ని...'ఇంతగా తన బలహీనతలని శల్యపరీక్షకు గురిచేసుకోకల్గిన మహిళలు చాలా అరుదు. అంతేకాదు—అసలొక పట్టాన తమ తప్పును ఒప్పుకోరు సరికదా గట్టిగా అర్థంలేకుండా వాదిస్తారు!... ఇలా తన లోపాలను తెలుసుకున్న స్త్రీకి ఎప్పటికేనా విముక్తి వుంటుంది గాని మూర్ఖంగా తనుపట్టిన కుందేటికి మూడే కాళ్ళు అనేవారికి విముక్తి లభించదు. వారి మనస్సే వారికి శత్రువు.

ఎటొచ్చీ చిక్కేక్కడ వచ్చింది? 'నేను దోషిలు గ్రహించి మనసులో బాధపడి పైకి సర్దుకునేసరికి ఆలస్యం జరిగిపోయింది' అంటూందామె. వారి మనస్సు విరిగి పోయింది. వారింకో స్త్రీ వ్యామోహంలో పడి యిప్పుడు నాదారి నన్ను చూసుకోమన్నారు. నాకు వారిమీద ప్రేమ లేక పోలేదు. ఇప్పుడేంచేసీ ప్రయోజనం ఏమిటి?' అంటూ వాపోయి ప్రయోజనం ఏమిటి—ఏదైనా దారి ఆలోచించాలిగాని. ఒకోసారి స్త్రీకి ఓర్పు ఆవసరం. సాంసారికమైన ఒడుదుడుకులు ఏర్పడినప్పుడు ప్రశాంతంగా ఆలోచించి దారి వెతుక్కోవాలని వ్రాసే ఓ స్నేహితురాలు చాలా కోప్పడింది, అక్కడికి ఆడదానికే కావాలా ఓర్పు? అని నిలదీసింది నిజమే. ఓర్పు నేర్పు భార్యాభర్తలిద్దరికీ అవసరమే. కాని స్త్రీకి ముఖ్యంగా ఆవసరం. ఎందుకంటే సాంసారిక విష

డాక్టరు కబుర్లు

చీట్లపేక, రక్తపుపోటు

రక్తపుపోటు ఉన్నవారు పేక ఆడవచ్చునా?

తను బ్రిడ్జి ఆడుతున్నప్పుడెల్లా




తనముఖం ఎర్రబడుతున్నదని నిన్న ఒక డాక్టరుగారు తనని తనే ఈ ప్రశ్న వేసుకున్నాడు.

అంతేకాక తననాడి, రక్తపు పీడనం, ఊపిరి పరీక్ష చేయించుకున్నాడు—ఆట ఆడుతూ. ఊపిరి తియ్యటం విడవటంలో మార్పు లేక పోయినా నాడి, రక్త పీడనం మారాయి.

మరొక 30 మందికూడా ఇదే విధంగా పరీక్షించగా 16 మందికయినా రక్తపుపోటు వచ్చినట్లు తేలింది. పేక ఆడకుండా ఉన్నట్లయితే తమ పరిస్థితి ప్రమాదకరమయినట్లు వారు గ్రహించగలిగే వారేమో!

హెచ్. ఎల్. హెర్సెన్‌సోన్

(కాపీరయిటు)



రంగులరాట్నం-ఎగిరేచేప

ఎగిరేచేప లుంటాయా? పక్షుల్లాగా ఎగరలేవుకాని, కొన్ని క్షణాల పాటు, నీటిలోంచి బయటకు వచ్చేసి, గాలిలోకి సునాయాసంగా పోయి కొంతదూరం సాగిపోయేవి చాలారకాల చేపలున్నాయి. అయితే ఇది వీటికి సరదా, విలాసం కాదు. సముద్రంలోని పెద్ద పెద్ద శత్రువుల్ని తప్పించుకొందుకు ఇవి ఇలా బయటకు వచ్చేస్తాయి. సుమారు ½ నిమిషంలో 200 గజాల దూరం పోతాయి. అంటే సుమారు గంటకు 15 మైళ్ల వేగం. ఈ సమయంలో సముద్ర మట్టానికి 30 అడుగుల పైవరకు పోతాయి. తిరిగి అవసరంపడితే, నీటిని కొద్దిగా తాకి మళ్లీ పుంజుకొని ఇంకా ముందుకు పోతాయి. ఒకొక్కసారి స్టీమర్లు అడ్డంగావస్తే గాభరా పడి దానిమీదకు వచ్చి, గుంపులు గుంపులుగా పడిపోతాయి.

ముందుజత 'చేపరెక్కలు' — అంటే ఫిన్లు—వీటిల్లో! బాగా ఎదిగి విచ్చుకొని ఉంటాయి. వీటివల్లే చేపలకు ఈ శక్తివచ్చింది. అవి తెరచాపల్లాగా గాలికి అల్లల్లాడతాయి. ఎగిరే ఈచేపలు చూడ్డానికి విమానాల ఆకారంలో ఉంటాయి. సముద్రాల్లోనే ముఖ్యంగా ఉన్నా, నదుల్లోకూడా కొన్ని ఎగిరేచేపలున్నాయి.

—జమ్మి కోనేటిరావు

వనితాలోకం

చక్రంలో అమృతం మింగినా హాలాహలం మింగినా స్త్రీయే ముందుంటుంది! ఎంత ఆధునికమైనా మనమధ్య స్త్రీకి విలువ బాధ్యతలు విస్మరించనంతవరకే అన్న సంగతి స్నేహితురాలు మర్చిపోయింది.

'ఎలాగా పరాయిస్త్రీని ప్రేమించాడు కనుక నీదారి నువ్వు చూసుకో' అనడం సులభం—కాని తోటి స్త్రీకి—సహృదయంతో యివ్వవలసిన సలహా అదికాదు. భర్త ఆదరణను తిరిగి చిగురింపచేసే ప్రయత్నం చెయ్యి అనడం సహృదయత. ఇది కష్టమే కావచ్చు. మనస్సు కించపడవచ్చు. కాని యివన్నీ ... మరిపింపచేసే ఘడియలు వస్తాయన్న ఆశతో చేయమంటాము. 'నేను నా ధోరణి మార్చుకున్నాను—' అని ఓ స్త్రీ అనకల్గిందంటే—నిజంగా పశ్చాత్తాప పడితేనే అనకల్గుతుంది. అలాంటప్పుడు ఆ పశ్చాత్తాపం కొత్తచిగుళ్లు తొడగడానికి అవకాశం ఇవ్వదా? భర్తని ఎంతకాలం బాధపెట్టిందో దానివల్ల ఎంతగా నష్టపోయిందో తెలుసుకున్న స్త్రీ ఇంకా ఓర్పు నేర్చుకుంటేగాని లాభం ఉండదు ఏమో తీరా భర్త మారి తిరిగివచ్చాక యీవిడగారు పాతధోరణికి పోదని ఏమిటి నమ్మకం? భర్తకా నమ్మకం కల్గేదాకా మారడుకదా?

మానసికంగా గాయపడ్డ మగవాడు మారడానికి వ్యవధికావాలి 'నేను మారిపోయాను' అంటే అన్నంతమాత్రాన నమ్మేయడం — అతనికి మళ్లీ దెబ్బ తగులుతుందేమో అన్న భయం ఇది గుర్తుంచుకుంటే ఆడది ఎంత నేర్పుగా ఓర్పుగా సంసారాన్ని దారినపట్టించాలో అర్థంకాదా?

నే కోప్పడితే, దెబ్బలాడితే అంతేనా యింకో స్త్రీని చేపడతాడా? అంటే లాభం లేదు. ఇద్దరు కలసి బ్రతకదలచినప్పుడు దెబ్బలాడుకోవచ్చు కాని—'కాంప్రమైజ్' కాక తప్పదు. అది కాదండీ—లాభములేదు—సంసారం కొత్త చిగుళ్ళు తొడగదు—అంతే.



మల్లన్నమంత్రి విజయం

కౌటిల్య

మల్లన్నమంత్రి రాజ్యంమీద దండయాత్ర చేయడానికి దక్షిణదేశపు రాజు పెద్దయెత్తున ప్రయత్నం చేయడం ప్రారంభించాడు. ఈసంగతి మల్లన్న మంత్రికి తెలిసింది. దక్షిణ దేశపురాజు యెలాగునా తనమీద దండయాత్ర చేస్తాడు కాబట్టి తామే ముందుగా దక్షిణదేశపు రాజుమీద దండయాత్ర చేయడం మంచిదనుకొన్నాడు మల్లన్న మంత్రి.

దక్షిణదేశపు సైన్యంయొక్క రహస్యాలను తెల్సుకోడానికి మల్లన్నమంత్రి వెంకయ్య అనే గూఢచారిని పంపించాడు. వెంకయ్య మారువేషం వేసికొని దక్షిణ దేశపు సైన్యంలో చేరిపోయాడు. దక్షిణదేశపు సైనిక రహస్యాలను, వెంకయ్య యెప్పటికప్పుడు ఉత్తరం వ్రాసి పావురంద్వారా మల్లన్నమంత్రికి పంపించేవాడు. మల్లన్న మంత్రికూడా అవసరమైన సూచనలను పావురం ద్వారా వెంకయ్యకు పంపేవాడు.

కొద్దిరోజుల్లో మల్లన్న మంత్రి సైన్యాలను సమకూర్చుకొని దక్షిణ దేశంమీద దండయాత్రకు బయల్దేరాడు. మల్లన్నమంత్రి తమ మీదకు దండెత్తి వస్తున్నాడన్నవార్త దక్షిణ దేశపు సైనికులకు తెలిసింది. ఆవార్త తెలియగానే వారికి భయం కలిగింది. తన సైనికులకు కలిగిన భయాన్ని పోగొట్టడానికి దక్షిణ దేశపు రాజు వారితో యిలాగ అన్నాడు.

సైనికులారా! యింతవరకు మీకు యెవ్వరికి తెలియని ఆయుధం మన దగ్గరఉంది. అది మనదగ్గర ఉండగా మల్లన్నమంత్రి మనలను యేమీ చేయలేడు!

తరువాత దక్షిణదేశపురాజు తనకు అంతకుముందు రహస్యంగా పశ్చిమ దేశపురాజు పంపిన రెండు ఫిరంగులను సైనికులకు చూపించాడు. ఫిరంగులను చూడగానే దక్షిణదేశపు సైనికులకు ఉత్సాహం కలిగింది. వారు ఆఫిరంగులను కోట బురుజుమీద ఉంచి మల్లన్న మంత్రి సైన్యాలకోసం యెదురు చూస్తున్నారు.

మల్లన్నమంత్రి సైన్యాలు దక్షిణ దేశపు కోటకు ఒకరోజు ప్రయాణంలో ఉన్నాయి. ఆ సమయంలో వెంకయ్య పావురంద్వారా ఫిరంగుల సంగతిని మల్లన్నమంత్రికి తెలియజేశాడు.

మల్లన్నమంత్రి సైన్యంవద్ద ఫిరంగులను యెదుర్కొనే ఆయుధాలు లేవు. అందుచేత మల్లన్నమంత్రి సైన్యం యుద్ధం చేస్తే ఓడిపోతుంది. అంత దూరం వచ్చిన తరువాత తిరిగి వెళ్ళిపోవడంకూడా మంచిది కాదు. అప్పుడు మల్లన్నమంత్రి ఆలోచించగా అతనికి ఒక ఉపాయం తట్టింది. వెంటనే వెంకయ్య యేమి చేయవలసినదీ వివరంగా ఉత్తరంవ్రాసి మల్లన్నమంత్రి దాన్ని పావురంద్వారా అతనికి పంపించాడు.

మరునాడు రాత్రి మల్లన్న మంత్రి సైనికులు రహస్యంగా దక్షిణదేశపు కోటవద్దకు వెళ్ళారు. అప్పటికి వెంకయ్య రెండు మోకులను రెండు ఫిరంగులకు కట్టివేశాడు ఆ మోకుల కొసలు కోట వెలుపలకు వేలాడుతున్నాయి.

అప్పుడు మల్లన్నమంత్రి సైనికులు ఆ మోకులను బలంగా లాగారు. దానితో కోట బురుజుమీద ఉన్న ఫిరంగులు కోట వెలుపలకు పడిపోయాయి. మల్లన్నమంత్రి సైనికులు వెంటనే, ఆ ఫిరంగులను స్వాధీనం చేసికొన్నారు. తరువాత జరిగిన యుద్ధంలో మల్లన్న మంత్రి దక్షిణదేశపు రాజును పూర్తిగా ఓడించివేసి, విజయాన్ని సాధించాడు.

దక్షిణదేశపు సైనికులు చూడకుండా వెంకయ్య ఒక్కడూ అంత పెద్ద తాళ్ళను కోట బురుజుమీదకు యెలాగ తేగలిగాడు? అని రాజు మల్లన్నమంత్రిని ప్రశ్నించాడు. దానికి మల్లన్న మంత్రి యిలాగ జవాబు యిచ్చాడు.

ప్రభూ! వెంకయ్య అంత పెద్ద తాళ్లను కోటబురుజుమీదకు తేలేదు. సన్నటితాడును మాత్రం నడుముకు చుట్టుకొని, యెవరూ చూడకుండా వెంకయ్యకోట బురుజు మీదకు

ఆరాత్రి వచ్చాడు. తరువాత ఆ తాడు కొసను వెంకయ్య కోట వెలుపలకు వదిలాడు. దానికోసమే అక్కడ మన భటులు కాచుకొని ఉన్నారు. వెంటనే వారు ఆ తాడుకొసకు మోకుకొసను ముడివేశారు. వెంకయ్య అప్పుడు తాను వేసిన తాడును లాగుకొనగా, అతని చేతికి మోకు అందింది. వెంటనే వెంకయ్య ఆమోకును ఫిరంగులకు కట్టివేశాడు. రెండవకొన మనభటుల వద్దనే ఉంది కాబట్టి వారు ఆఫిరంగులను లాగివేయగలిగారు

రాజు మల్లన్నమంత్రికి తన కృతజ్ఞతను తెలియజేశాడు. దక్షిణదేశపురాజు మల్లన్నమంత్రకి తగిన నష్టపరిహారాన్ని చెల్లించి అతనితో సంధిచేసికొన్నాడు. ఆతరువాత మల్లన్నమంత్రి రాజ్యానికి శత్రువుల బాధలేకుండా పోయింది.

మల్లన్నమంత్రి చిరంజీవి. సమర్థుడైన మల్లన్న మంత్రి పరిపాలనలో ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తూ ఉన్నారు.

(మొదటిభాగం సమాప్తం)

ఈ కథతో మల్లన్నమంత్రి కథలు 52 అయ్యాయి. దీనితో మల్లన్న మంత్రి కథలు మొదటిభాగాన్ని పూర్తి చేస్తున్నాను. 'మల్లన్న మంత్రి చెప్పిన కథలు' అనే పేరుతో రెండవ భాగం వ్రాసే ఉద్దేశం ఉంది.

ఈ కథలకు మూలం యేదైనా ఉందా ? అంటూ కొంతమంది పాఠకులు ఉత్తరాలు వ్రాశారు. వీటికి మూలం యేదీ లేదు. వేటికీ యివి అనువాదం కాని అనుకరణగాని కావు. మల్లన్న మంత్రి కథలు కేవలం స్వతంత్ర రచనలు. ఇందులో 'కొద్ది కథల్లోని ఉపాయాలను మాత్రం మిత్రుల వలన విన్నాను.

—మహేశ్ (కౌటిల్య)



ధర్మపథం

ఆత్మవత్సర్వభూతాని

బులుసు వేంకటరమణయ్య

'మా యింటికివస్తే ఏమితెస్తారు? మీ యింటికివస్తే ఏమియిస్తారు?' అని అడిగే స్వభావం కొందరిది తమకు ధనం—యితరులకు ఋణం అనే సంకుచిత బుద్ధి వీరిది ఇతరులు కష్టపడుతూ వుంటే చూచి లోలోపలనైనా ఆనందించే అభిప్రాయం మానవుడైనవాడికి ఎంత మాత్రమూ తగదు.

'ఇతరులు ఏపనులుచేస్తే మనమనస్సుకు అప్రియమూ, బాధా కలుగుతాయో, ఆ పనులను మనంకూడా ఇతరుల విషయమై చెయ్యకూడదు దీనికంటె ఉత్తమధర్మం లేదు.

మనకు ఏదయినా దెబ్బతగులతే ఎంతో బాధపడతాము. ఇతరప్రాణులను కొట్టేటప్పుడు ఈ విషయాన్నే ఆలోచించుకోవాలి అలా ఆలోచించుకుంటే బాధించాలనే బుద్ధి మళ్ళిపోతుంది.

మహాభారతంలో భీముణ్ణి ఒక కొండచిలువ చుట్టివేసి, చంపడానికి సిద్ధంగా ఉన్న సమయంలో ధర్మరాజు అతన్ని వెతుక్కుంటూ అడవిలోకి వస్తాడు. భీముణ్ణి విడిపించుకోవాలంటె తన ప్రశ్నలకు తగిన జవాబులు చెప్పాలని ఆ అజగరంకోరుతుంది. సత్య శౌచాహింసాది ధర్మాల్లో ఏది ఉత్తమమైనదనేది ఒక ప్రశ్న. దానికి అహింసే గొప్పదని సకారణంగా సమాధానమిచ్చి ధర్మరాజు తన తమ్ముణ్ణి విడిపించుకున్నాడు.


తనవలెనే తక్కిన ప్రాణులనుకూడా చూసేవాడే అహింసావ్రతాన్ని అవలంబించగలుగుతాడు. అన్ని మతాల మూలసూత్రం దీనిమీదనే ఆధారపడి వున్నది తనకు అపకారం చేసినవాడికైనా సరే హాని తలపెట్టకూడదని మనధర్మాలు చెప్పుతూ వున్నవి.

జైనులూ, బౌద్ధులు సాయంకాలం కాకుండానే రాత్రి భోజనాదికాదులుముగించుకుని దీపాలు పెట్టుకోకుండా చీకటి కోణాల్లోనే రాత్రులు గడపేవారు. దీపాలు పెట్టుకుంటే వాటిమీద వాలి వందలాది రెక్కల పురుగులు చచ్చిపోతాయనే యీ పద్ధతి ఏర్పడింది దారిలో నడుస్తున్నప్పుడు ఏ చీమలో, పురుగులో కాలికిందపడి మరణిస్తాయని పొదుగాటి నెమలిపురికన్నుల కుంచెలతో మార్గ సంశోధన చేస్తూనే నడిచేవారట! అయితే—ఇప్పుడు ఆ అలవాట్లు చాలావరకూ తగ్గిపోయాయి. నాగరికత పెరిగినకొద్దీ మతాలమీదవుండే గౌరవం సడలిపోయి, ఆ మతాలు నియమించిన పద్ధతులు నామమాత్రావశిష్టాలయిపోయాయి.

ఎట్టి పరిస్థితుల్లోనయినా సరే, తనవలెనే యితరులను చూసుకొనే ప్రయత్నం అవసరం. దానికి అహింసామార్గం మిక్కిలి ప్రధానం. ఏమతమయినా దానికే ప్రాధాన్యం ఇస్తుంది. ఆ మతధర్మాన్ని కాపాడుకోవాలి. ధర్మాన్ని మనం కాపాడితే మనల్ని ఆ ధర్మం కాపాడుతుంది.

అందువల్లనే అన్నారు పెద్దలు—

'ధర్మో రక్షతి రక్షితః—' అనీ, 'ఆత్మవత్సర్వ భూతాని యః పశ్యతి స పశ్యతి' అనీన్నీ. ●





జరిగిన కథ

కృష్ణమోహన్‌కి కళ్ళు కనిపించవు. అతని గుడ్డితనాన్ని కప్పిపుచ్చి చెల్లెలు భానుమతి నిచ్చి పెళ్ళిచేస్తాడు రవికాంత్. నిజం తెలిసిన తర్వాత కూడా భానుమతి చలించదు. భర్తే దైవంగా కృష్ణమోహన్‌ని పూజిస్తూ అతని ఆదరణలో మురిసిపోతూ వుంటుంది. కృష్ణమోహన్ చెల్లెలు మాధవి. భానుమతిలో సహనశక్తి, మనోనిబ్బరం మాధవిని ఆశ్చర్యపరుస్తుంది. ఇద్దరూ ఎంతో అన్యోన్యంగా వుంటుంటారు. కృష్ణమోహన్ కళ్ళు పరీక్షించే నిమిత్తం ఫారిన్‌లోవున్న తమ్ముడ్ని రప్పిస్తుంది భానుమతి. ఒక పెద్ద డాక్టర్ని సంప్రదించి ఆపరేషన్‌కి ఏర్పాట్లు చేయిస్తాం. ఆపరేషన్ విజయవంతమవుతుంది. కృష్ణమోహన్‌కి కళ్ళు వస్తాయి.

6

మహాబలిపురం నుండి తిరిగి వచ్చిన తర్వాత ఒక రోజున మాధవి నడిగింది భానుమతి.

'మాధవీ! యీ మధ్య పరధ్యానంగా వుంటున్నావేమిటీ కథ? ఏ రాజకుమారుడయినా కలలో ప్రత్యక్షమై మనస్సు నపహరించాడా?'

మాధవి సిగ్గుతో వదిన ఒడిలో ముఖం దాచుకుంది.

'నాకు చెప్పకూడనిదా మాధవీ? ఆ రహస్యం' అన్నదామె మృదువుగా.

'నిన్ను మించిన ఆత్మీయులింకెవరున్నారొదినా యీ మాధవికి?'

'మరి సారథి రేపు వెళ్ళిపోతున్నాడు? ఏమని చెప్పమంటావ్ మాధవీ!' అన్నది భానుమతి.

'నీకు తెలియదా వదినా?'

'ఎలా తెలుస్తుంది చెప్పకుండా?'

'ఫో!' అంటూ ఒడిలోనుంచి విసురుగా లేవబోయిందామె

'ఆ! ఆ! అలిగి పారిపోకు మరి' అంటూ భానుమతి మాధవిని ప్రేమగా తన వైపుకు తీసికొంది.

'మాధవీ! సారథి మనస్సు మధుర కావ్యం. నీకోసం శ్రీరాముడిగా మారిపోగలడు. కళ్ళనిండుగా అల్లరే కన్పిస్తుంది. కాని హృదయం అమృతభాండం.' అన్నది భానుమతి.

'నాతో చెప్పాడు అంతా. నేను మాట యిచ్చేశాను కూడా! మరి నీవేమంటావ్ మాధవీ?' తిరిగి ప్రశ్నించిందామె.

'నీయిష్టం అంటాను' అని అనగలిగింది మాధవి.

* * *

సారథితో కలిసి, భానుమతి, కృష్ణమోహన్‌లు, మాధవీ ఏలూరు వెళ్ళారు.

రాజ్యలక్ష్మమ్మగారెంతో పొంగిపోయింది సంతోషంతో.

'జాబు వ్రాస్తే స్టేషనుకు మనరాముణ్ణి పంపించేదాన్ని గదమ్మా!', అన్నదామె.

'ఎందుకమ్మా! ఇద్దరు మగవాళ్ళుండగా?'

కుమార్తె పరిహాసోక్తికి చిన్నగా నవ్వుకున్నదామె.

ఆ రాత్రి తల్లితో జరిగినదంతా చెప్పింది భానుమతి.

ఎంతగా విలవిలలాడిపోయ్యావో తల్లీ! ఒక్కమాట నాతో అనగూడదా భానూ?' అన్నదామె రుద్ధస్వరంతో.

'నువ్వు మరింత భయపడిపోతావని చెప్పలేకపోయానమ్మా!'

'పిచ్చిగా వూహించావ్ భానూ! కన్నతల్లి హృదయం ఆందోళనతో నలిగిపోయినా బిడ్డను కష్టాల్లో ఆదుకోవడంలోనే వూరట చెందుతుందమ్మా!' అన్నదామె బరువుగా నిశ్వసించి.

'ఏమోలే తల్లీ! భగవానుడు చల్లగా చూశాడు' అంటూ భానుమతి తలపై ప్రేమగా నిమిరింది.

ఆ మమతా పూర్ణ మాతృమూర్తి హస్తస్పర్శలోని మాధుర్యానికి, చల్లదనానికి భానుమతి హృదయం కరిగిపోయింది.

రవికాంతునికి పదివేలిమ్మని తల్లితో చెప్పింది తర్వాత.

ఆ రాత్రి తల్లి దగ్గరే పడుకుంది భానుమతి. అర్ధరాత్రి మెలుకువ వచ్చి రాజ్యలక్ష్మమ్మగారు ప్రక్కకు వత్తిగిల

పోయింది. కానీ సాధ్యంగాలేదు. భానుమతి తల్లి గుండెల్లో ఒదిగిపోయినట్లు పసి పిల్లలా కౌగలించుకుని పడుకుంది.

మధురానురాగంతో ఆ మాతృమూర్తి హృదయస్పందన సహితం పరవశమై పోయింది. మరింత గాఢంగా హత్తుకున్న దామె కుమార్తెను వాత్సల్యంగా. ఆమెలో మాతృత్వం పొంగి ప్రవాహమై పరుగులు పెట్టింది.

సారధి తల్లి మాధవి సౌందర్యానికి ముచ్చటపడి భానుమతితో అన్నది.

'మా సారధికి ఈడూ జోడూ బావుం టుంది. చక్కని చుక్క. చిదిమి దీపం పెట్టుకోవచ్చు. కానీ వాళ్ల నాన్నగారు మేనగోడల్ని చేసుకోవాలనుకుంటున్నారు.'

క్షణమాత్రం ఆగి ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చి అడిగింది భానుమతి.

'సారధికి యిష్టమేనా పెద్ది?'

'చిన్నప్పటినుంచీ అనుకుంటున్నదే గదమ్మా! ఇంకా యిష్టాయిష్టాల ప్రసక్తి ఎందుకు?' అన్నదామె.

తర్వాత భానుమతి మాటలు పెంచలేక పోయింది.

సాయంత్రం సారధిని పిలిచి అడిగింది.

'నాన్నగారు నన్ను లాయరుచేయాలని విశ్వప్రయత్నాలు చేశారు, కానీ డాక్టర్నయ్యాను. ఇక వివాహం సంగతీ అంతే నక్కా!' అన్నా డతడు.

సంతృప్తి చెందిందామె సమాధానం విని.

'రథీ! కట్నమంటూ ఒక్క చిల్లిగవ్వ కూడా వుండదు.'

'ఎందుకక్కా? యీ నీ తమ్ముణ్ణి ప్రలోభపెట్టాలని చూస్తావు? ధనపిపాసే వున్నట్లయితే ఇటలీనుంచి వచ్చేవాడేనా యీ సారధి' అన్నా డతడు నిర్మలంగా నవ్వుతూ.

'నూటికొక్కసారధి వుంటే బావుండును' అన్నది భానుమతి.

'మరి అపుడు మాధవి లేకుండాపోతే'

'అలా జరగడం అసంభవం రథీ!' అన్నదామె.

సారధి కోరినందువల్ల కృష్ణమోహన్ పాడడాని కంగీకరించాడు.


అతడు గొంతెత్తగానే శ్రోతలందరూ స్థాణువులై పోయారు.

సెలయేరులా గలగల ధ్వనించుతూ పరువులెత్తుతోంది.

మరొకమారు గంభీరత మగ్గుపాలగా ద్రావిన సాగరుని మాదిరి హృదయాహ్లాదకరమై వీనులవిందు జేస్తోంది.

అలలా లేచి పడుతుందొక మలుపులో. ఆ స్వరంలో ఎన్ని మలుపులు!!! ఎన్ని వంపులు!!!

ఆ వంపులో సొంపువుంది. ఆ మలుపులో అదొక రకమైనతీవి, నాజూకుతనం అంతర్వాహినులై పోయాయి. అదొక కళా విలాపం అన్పించింది.



ఆ వంపులోని వయ్యారం మనస్సును ఊపివేస్తోంది. ఒకక్షణంలో కొండకన్నా ఎత్తుగా, లోయనుమించిన లోతుగా మలుపులు తిరిగిపోతోంది ఆ మధురగళం.

పాట ముగిసినా శ్రోతల హృదయాల్లో పరవశం యింకా తూలిపోతూనే వుంది,

స్తబ్ధులై కూర్చుండి పోయారందరూ.

భానుమతి బాల్యంనుంచి సంగీతం నేర్చుకుంది. ఎన్నో శ్రావ్యకంఠాలను విన్నది. కానీ సంగీతలయలలో, మనస్సును మెలిపెట్టగల మాధుర్యం వున్నదని ఆమెకీనాడు తెలిసింది.

'అరే! కృష్ణమోహనా పాడింది? ఎవరీ తాన్‌సేన్ అని ఆశ్చర్యంతో తలమున్కలయ్యాను! అరే! నా కిన్నాళ్లా మన మధ్య యింత శ్రావ్యంగా పాడగలవాడున్నాడని ఎవరూ చెప్పనేలేదేమిటి? ఈపాటికి మదరాసు లాక్కుపోయేవాణ్ణి' అన్నారు సారథి తండ్రి దశరథరామయ్యగారు లోనికి వచ్చి కూర్చుంటూ.

'ఎందుకు నాన్నగారూ?' ప్రశ్నించాడు సారథి.

'ఎందుకేమిటిరా? నారాయణరావుగారూ నేనూ కలిసి ఒకసారి మంచి పిక్చరొకటి తీస్తున్నాం. ప్లేబాక్ సింగర్‌గా తీసికొనేవని' అన్నాడాయన.

నారాయణరావుగారు ఆయన చెల్లెలి

రాగమయి

భర్త. ఆయన మొదటినుంచి చిత్రపరిశ్రమలోనే స్థిరపడిపోయాడు. ఈ సంవత్సరం దశరథరామయ్యగారినికూడా ఆహ్వానించాడా పరిశ్రమలోకి.

'ఎన్నేళ్లు నేర్చుకొన్నావోయ్! సంగీతం!' అన్నాడాయన.

'ఎనిమిదో సంవత్సరంనుంచే ప్రారంభించానండీ! పదమూడోసంవత్సరంవరకూ నేర్చుకున్నాను' అన్నాడు కృష్ణమోహన్.

'గుడ్! సరే! వచ్చే ఆదివారం మద్రాసు వెళ్దాం రా నాతోపాటు.'

'ఒకమాట—'

'ఒకటీ లేదు రెండూ లేదు. రావాలిసిందే'

అన్నాడాయన అతని వాదనను ఖండించి.

భానుమతి అన్నదా రాత్రి—

'ఇంత శ్రావ్యంగా పాడగలరని నాకు తెలియదు'—

'నాకూ తెలియదు భానూ! స్వరం సవరించుకుంటూ నిన్ను చూశాను—

మెరుస్తూన్న నీ నేత్రాల్లోనుంచి ఏదో విద్యుత్కాంతి నాలో జొరబడినట్లయింది గొంతెత్తగానే. నా హృదయంలో ఎవరో గిలిగింతలు రేపినట్లయి ఝల్లుమంది పారవశ్యాన్ని భరించలేక. ఆ పారవశ్యం

నానిండుగా నిండిపోయి జలజలా పైకి పొంగివచ్చింది స్వరంలో నుంచి.'

'కవిత్వంకూడా వ్రాసేట్టున్నారే' అన్నది భానుమతి

'నువ్వు ప్రక్కనుంటే వ్రాయగలనేమో' అన్నాడతడు పారవశ్యంతో:

స్నిగ్ధమధురంగా నవ్వింది భానుమతి.

దశరథరామయ్యగారితోపాటు కృష్ణమోహన్ మద్రాసు వెళ్లిపోయిన రోజునే భానుమతి, మాధవితో హైద్రాబాద్ చేరుకుంది.

మామగారికి జరిగిన సంగతి వివరించి పెండ్లి గురించి ప్రస్తావించింది.

'నువ్విచ్చిన డబ్బులో యింకా రెండు వేలు—'

'అదివు డెందుకులెండి? సారథి అంగీకరించాడు మాధవిని వివాహమాడ్డానికి మాధవీ యిష్టపడింది. మరిమీరు...'

ఆమె సమాధానంకోసం నిరీక్షించింది.

ఆశ్చర్యంతో చకితుడయ్యాడా వృద్ధుడు.

'సారథి!! అంత కట్నం...యివ్వడం.'

'కట్నప్రసక్తే లేదులెండి మీ అబ్బాయి కూడా మిమ్మల్ని అడగమన్నారు' అన్నదామె

ఆనందంతో ఆ పితృహృదయం పొంగిపోయింది

'నీ అభిప్రాయమే నా అభిప్రాయం తల్లీ!' అన్నారాయన సంతోషంనుంచి తేరుకున్న తర్వాత.

సారథి వుత్తరం వ్రాస్తానన్నాడు. కానీ పదిరోజులయినా ఆ జాడేలేదు. భానుమతే వ్రాసింది. దానికి సమాధానంకూడా ఆలస్యంగానే వచ్చింది.

'మంచి గంధం వంటి మనస్సున్న అక్కయ్యా!

నాన్నగారిని ఒప్పించేసరికి బ్రహ్మదేవుడు దిగివచ్చాడనుకో మద్రాసువెళ్లి, ఒప్పించి, తిరిగి వచ్చేసరికింత ఆలస్యం పట్టింది. మరి క్షమిస్తావ్ గదా?


మాధవి ఏమంటోంది?

మరి వస్తానిక

ప్రణామాలతో

తమ్ముడు 'రథి'

భానుమతి జాబుచదివి నవ్వుకుంది. మామగారికి ముహూర్తం పెట్టించమని చెప్పింది. భర్తకు త్వరగా రావాలని జాబు



వ్రాసింది. ముహూర్తం పదిరోజుల్లోనే నిర్ణయించబడింది.

వివాహం యింకా నాలుగురోజులుండ నగా వచ్చాడు కృష్ణమోహన్.

అసలే పచ్చనిఛాయ అతనిది మద్రాసు వాతావరణం సరిపడడం వలన మరింతరంగు వచ్చాడు

'భానూ! నీ కంటికెలా వున్నాడే కృష్ణుడు? అందరూ పెళ్ళికొడుకు నయిపోయానంటున్నారు' అన్నాడతడు భానుమతితో

'మీ భానుమతికి మీ రెప్పుడూ శ్రీరామచంద్రులే' అన్నదామె

'ఫో! వాళ్ళందరూ వర్ణించలేక సతమతమై పోతున్నారు ఒక్కమాటలో వర్ణించేశావ్ నువ్వు' అంటూ దగ్గరకు తీసుకున్నాడామెను

వివాహం వైభవంగానే జరిగింది. ఆ వైభవానికి ఒక అదృశ్య హస్తం చేదోడుగా వుందని అది భానుమతిదేనని వెంకట్రామయ్యగారు గ్రహింపగలిగారు సంసారానికి అవసరమయిన సామగ్రినంతా యిచ్చింది ఆడపడుచుకు. నెక్లెసు ఒకటి బహూకరించింది తన తరఫున

కుమార్తెను సారధి చేతుల్లో పెట్టి విముక్తి పొందినట్లు సంతృప్తిగా నిశ్వసించారు కానీ మాధవి అత్తవారింటికి బయలుదేరి తండ్రికి ప్రణమిల్లడానికి వచ్చినపుడా పితృహృదయం దుఃఖాన్ని నిగ్రహించుకో లేకపోయింది. కళ్ళు వత్తుకుంటూనే దీవించారాయన.

కృష్ణమోహన్ పెళ్ళిపందిట్లో కన్పించనేలేదు ఎక్కడికి అదృశ్యమయ్యాడో, ఎందుకలా చేశాడో గ్రహించగలిగింది భానుమతి అసలా రోజంతా అతడు అన్యమనస్కంగానే వుండిపోయాడు పెళ్ళిజరిగే వరకూ నవ్వుతూ అతిథులందరిమధ్య తిరిగాడు. తీరా చెల్లెలు వెళ్ళబోయే సమయానికి తనకిక నిలబడటానికి కూడా ఓపికగా లేనట్లయిపోయి గదిలోకివెళ్ళి భాను

మతిని కౌగిలించుకుని ఏడువసాగాడు ఆ దుఃఖాన్నెలా వూరడించాలో అర్థమవలే దామెకు. నోరువిప్పితే కట్టలు తెంచుకునేట్లుంది దుఃఖప్రవాహం. అందుకే ఆమె కొంతసేపలా భర్తతలను తనభుజాల మీద వుంచుకుని మౌనంగా వుండిపోయింది. తరువాత మెల్లగా భర్తను మంచంమీద కూర్చోబెట్టింది.

అంతలో మాధవీ సారథులు నమస్కరించడానికి వచ్చారు. భానుమతివంక చూడలేక పోతోంది మాధవి.

'రథీ! కపటం తెలియని కంసాలి వన్న ప్రగాఢ విశ్వాసంతోనే మేలిమి బంగారాన్ని మనఃపూర్వకంగా నీ చేతుల్లో వుంచాను' అన్నదామె గంభీరంగా.

సమాధానంగా వినమ్రుడై అక్క పాదాలంటి నమస్కరించాడతడు.

మాధవికూడా ప్రణమిల్లింది. ఆప్యాయంగా లేవనెత్తింది భానుమతి. మాధవి వదిన గుండెలపైన వాలిపోయింది. అశ్రు బిందువులు జారిపడుతున్నాయి భానుమతి కళ్లనుంచి.

వీపుమీద నిమురుతూ, ముంగురులు సర్దుతూ దుఃఖ వేగాన్నణచుకుంటోం దామె. పెదవులు వణికిపోతున్నాయి. ఎంత ప్రయత్నించినా భానుమతికి నోటినుంచి మాట పెగలడంలేదు. అశ్రుధార అవిరళంగా ప్రవహించుతూనే వుంది.

మాధవి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

అనంతమూ, మధురమూ, పవిత్రమూ అయిన ఆ అనురాగ పూర్ణ హృదయాలు విడిపోలేక పోతున్నాయి.

'ఆ! చూడు మాధవీ!' మాధవి తలను పైకెత్తి కన్నీటిని పైట చెరగుతో తుడిచింది భానుమతి. కొంతసేపటికి తేరుకుని,

'స్త్రీ జీవితమే త్యాగ ప్రపూర్ణం మాధవీ! అందుకిది నాంది' అన్నది భానుమతి.

మాధవి మళ్లీ వదిన పాదాలకు నమస్కరించి లేచి అశ్రుసిక్త నయనాలతో అత్తయ్యకూడా ప్రణమిల్లింది.

ఆ ప్రేమమయి వేమని దీవించాలో అతని కర్థంగాలేదు. అక్షింత లుంచాడు మౌనంగా.

తరువాత మాధవీ సారథు లిరువురూ సెలవు దీసికొన్నారు.

ఆ రోజంతా ఏమీ తినలేక పోయాడు కృష్ణమోహన్. వెంకట్రామయ్యగారు పైకిమాత్రం గంభీరంగా వున్నారు. లోపల శోకం సుడులు తిరుగుతోందని ఆ కళ్లే చెబుతున్నాయి. మాటిమాటికి పని గల్పించుకుని భార్య మాణిక్యాంబ ఫోటో దగ్గరకువచ్చి నిలబడి ఆమె ముఖంలోకి చూస్తూ ఏదో అస్పష్టంగా అనుకుంటున్నారు. ఇదంతా భానుమతి గమనిస్తూనే వుంది.

కృష్ణమోహన్ పసిపిల్లవాడిలా బెంగతో తల్లడిల్లి పోతున్నాడు,

'నీకు తెలియదు భానూ! మాధవిని చూడకుండా నేనుండలేను. అబ్బ! ఎంత కఠినుణ్ణి నేను? ఎలా పంపించగలిగాను?' అంటూ విలపించసాగాడతడు.

భానుమతి వారించలేదు. ఆ శోకప్రవాహాన్నలా ప్రవహించనిస్తేనే మనస్సు తేలికపడుతుందని భావించింది.

అతని దుఃఖం వుపశమించిన తర్వాత అన్నది 'మీరే యింత బేలగా అయిపోతే యిక మావగా రేమవ్వాలి చెప్పండి. ఆయన హృదయంలోని ఆవేదనను పంచుకోడాని కెవరున్నారు? నిజంగా ఆయన ఏకాకి. అంత దుఃఖాన్నెలా యిముడ్చుకో గల్గుతున్నారో చూడండి వెళ్లి. ఆ లోకంలో వున్న అత్తయ్యకే విన్పించాలా వేదన' అన్నదామె.

అతడింతవరకూ తండ్రిఎదుటకు వెళ్లనేలేదు. అందుకే హెచ్చరించిం దామె అతని శోక వేగం తగ్గుతుందని.

అతడు వెంటనే లేచివెళ్లాడు. అశ్రుపూర్ణ నయనాలతో భర్తవెళ్లిన వైపే చూస్తూ అనుకుంది,

'మాధవీ! మమకారాన్ని జయించడం ఎంత కష్టంగావుంది!'

(ఇంకా ఉంది)

మీరు పుట్టిన ఇంగ్లీషు తేదీని అనుసరించి మీ స్వభావం? మీ మిత్రులు?

ఇది రాసులలో నాలగవది. ప్రతి సంవత్సరం జూన్ 22వ తేదీనుంచి జూలై 22వ తేదీవరకు సాయన సూర్యుడు కర్కాటకరాసిలో ఉంటాడు కాబట్టి. యీ తేదీలమధ్యను పుట్టినవారు కర్కాటకరాశియందు జన్మించిన వారిగా పరిగణింపబడుచున్నారు. ఏ సంవత్సరంలోనైనాసరే, యీ తేదీలమధ్యను పుట్టిన వారికి కర్కాటకరాశి ఫలితాలే వర్తిస్తాయి. దీనికి జననకాలంతో కాని జన్మనక్షత్రంతోకాని నిమిత్తం లేదు.

ఈరాశి ప్రారంభంలో అనగా జూన్ 19—22 తేదీల మధ్యను పుట్టినవారిమీద అంతకుముందు ఉన్న మిధునరాశి ప్రభావంకూడా ఉంటుంది. అలాగే జూలై 19—22 తేదీల మధ్యను పుట్టినవారిక మీద రాబోయే సింహరాశి ప్రభావం కూడా ఉంటుంది.

కర్కాటకటం అనగా యెండ్రకాయ. ఇది చరరాశి. జలానికి సంబంధించిన రాసులలో యిది మొదటిది. సకలలోకాహ్లాదకారుడైన చంద్రుడు యీరాశికి అధిపతి.

ఈరాశియందు జన్మించినవారు సాధారణంగా చాలా సున్నితమైన మనస్సుకలవారై ఉంటారు. వీరు యితరుల యెడల ఉదారంగా ఉంటారు కాబట్టి వీరిని స్నేహితులు హృదయపూర్వకంగా ప్రేమించగలరు. సాటివారిలో వీరు గౌరవంకంటే ప్రేమనే అధికంగా పొందగలరు. ఇతరులకు సహాయం చేసేటప్పుడు వీరు, దీనివలన తమకు కలిగే వ్యయ ప్రయాసలను గురించి ఆలోచించరు.

చిన్న విషయాలకుకూడా వీరికి కోపం వస్తుంది కాని, అది యెలతసేపో ఉండదు. వీరి మంచితనాన్ని యితరులు దుర్వినియోగం చేస్తే, వీరు పగబట్టే ప్రమాదం ఉంది.

తమ మిత్రులతో వీరు కలసిమెలసి ఉంటారు కాని, అపరిచితుల యెడల చాలా ముభావంగా ప్రవర్తిస్తారు. అయినా వీరికి సంఘంలో గౌరవానికి లోపం ఉండదు. పదిమందిలో పాల్గొని యేపనైనా చేయటంకంటే, వీరు ఒంటరిగా ఉండి కృషి చేయడంలోనే యెక్కువ ఫలితాన్ని సాధించగలరు.

సాధారణమైన విషయాల్లో వీరు మిత్రుల అభిప్రాయాలను గౌరవిస్తారు కానీ వీరి ఆంతరంగిక వ్యవహారాల్లో యితరులు యెక్కువగా జోక్యం చేసికోవడం తగదు. వీరు సున్నితమైన మనస్సు కలవారు కాబట్టి వీరిని పొగడడం ద్వారా యితరులు పనులన్నీ నెరవేర్చుకొంటారు. హేళననుగాని, విమర్శలనుగాని వీరు సహించలేరు.

నూతన విషయాలమీద వీరికి సరదా ఉంటుంది. కాని యే విషయంలోను మార్పులకు వీరు సమంజసంగా అంగీకరించరు. ముఖ్యమైన సందర్భాల్లో వీరు ఒక నిశ్చయానికి రాలేకపోవడం వలన, జీవితంలో కొన్ని అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉంది.

వీరు భోజనప్రియులు. అలంకరణమీద కూడా వీరికి మోజు ఉంటుంది. కాని తమ సంపాదనలో అధికభాగాన్ని వీరు యితరుల నిమిత్తమే ఖర్చు చేస్తుంటారు.

ద్రేక్కాణఫలం

కర్కాటక రాశిలో మొదటి ద్రేక్కాణానికి (జూన్ 22— జూలై 1 తేదీలమధ్యకాలం) శుక్రుడు అధిపతి. ఈ సమయంలో పుట్టినవారు పరిస్థితులకు అనుగుణంగా ప్రవర్తించడం వలన అందరికీ యిష్టులు కాగలరు. ఆకర్షణీయమైన ప్రవర్తన, ఉదారమైన స్వభావం వీరికి ఉండడంవలన యితరులను సులువుగా లోబరచుకొనగలరు. సాంఘికవ్యవహారాల్లో వీరికి పలుకుబడి అధికంగా ఉంటుంది సుఖాలను పొందాలనే కోరిక వీరికి యెక్కువగా ఉంటుంది. వీరు అలంకార ప్రియులు. సాహిత్య కళారంగాల్లో వీరికి ఆసక్తి ఉంటుంది.

రెండవ ద్రేక్కాణానికి (జూలై 2—12 తేదీల మధ్యకాలం) బుధుడు అధిపతి. వీరికి ఆలోచనాశక్తి అధికంగా ఉంటుంది. ఎప్పుడూ యేదో ఒకపనిని చేస్తుండాలని వీరి కోరిక నూతన విషయాలను తెల్సుకోవాలని వాంఛిస్తుంటారు. వీరు యెప్పుడూ యేదో ఒక దానిని గురించి మాట్లాడుతుండడం వలన తమకాలాన్ని వ్యర్థం చేసికొనడమేకాకుండా కొంతమందితో విరోధాన్ని కూడా తెచ్చుకొనగలరు ప్రయాణాలమీద మోజు ఎక్కువ. వీరికి వూహాశక్తి అధికంగా ఉండడంవరలన రచనా వ్యాసంగంలో రాణిస్తారు.

మూడవ ద్రేక్కాణానికి (జూలై 13—22 తేదీల మధ్యకాలం.) చంద్రుడు అధిపతి. వీరు చాలా సున్నితమైన మనస్సుకలవారు అయిఉంటారు. వీరికి విషయాసక్తి అధికంగా ఉంటుంది. సంఘంలో వీరికి పలుకుబడి ఉంటుంది. తరుచుగా ప్రయాణాలు చేస్తుంటారు. విదేశీయాత్రలూ కూడా చేయగలరు. వీరికి స్థిరచిత్తం తరుచుగా లోపించడం వలన, వీరి జీవితం చాలా మార్పులకు గురికాగలదు. స్త్రీ మూలంగా ధనప్రాప్తికి కూడా అవకాశం ఉంది. మనస్తత్వశాస్త్రంలోను, వీటికి సంబంధించిన విద్యల్లోను రాణించగలరు.

సూచన:— మొదట చెప్పబడిన రాశి ఫలితానికీ, తరువాత చెప్పబడిన ద్రేక్కాణ ఫలితానికి తేడా ఉన్నప్పుడు ద్రేక్కాణ ఫలితాన్నే గమనించాలి. ద్రేక్కాణ ఫలితం సరిగా సరిపోతున్నట్లు చాలా మంది అభిప్రాయం.

కర్కాటకరాశియందు జన్మించిన భర్తతో వ్యవహరించడం యెలాగ?

వీరు చాలా విషయాల్లో ముభావంగా ఉంటారు కాబట్టి దానిని తనయందు ఆసక్తి లేకపోవడంగా భార్యభావించకూడదు. వీరికి ప్రేమకంటే అభిమానమే యెక్కువ. తమను యితరులు అర్థం చేసికోలేకపోతున్నారని వీరు బాధపడుతుంటారు. కాబట్టి వీరి యెడల సానుభూతితో ప్రవర్తించడం అవసరం ఇతరుల నిమిత్తం తాము అధికవ్యయం చేసినా, యితరులు అధికవ్యయాన్ని చేయడం వీరు సహించలేరు. వీరు భోజనప్రియులు కాబట్టి, రకరకాల భక్ష్యాలతో వీరిని సంతృప్తి పరచవచ్చును. తమకంటే తక్కువవారితో వీరు సన్నిహితంగా ఉండలేరు కాబట్టి, భార్య సమాన స్థాయిలోనే వీరితో వ్యవహరించాలి

కర్కాటకరాశియందు జన్మించిన భార్యతో వ్యవహరించడం యెలాగ?

ఈమెకు యింటిపనులమీద పిల్లలమీద ఆసక్తి అధికంగా ఉంటుంది. కాబటి దీనిని తనమీద నిర్లక్ష్యంగా భర్త భావించకూడదు. ఇతరుల సలహాలు తరుచుగా ఈమెకు సమస్యలను కల్గిస్తుంటాయి కాబట్టి ఈమెకు అనవసరమైన సలహాలను యివ్వడం మంచిదికాదు. ఈమె అలంకార ప్రియురాలు కాబట్టి వింతవింత వస్తువులతో యీమెను సంతృప్తి పరచవచ్చును. ఏ విషయంలోను పూర్తిగా ఆలోచించనిదే యీమె ఒక నిర్ణయానికి రాలేదు కాబట్టి యీమెను తొందరపెట్టకూడదు. ఈమెయెడచో కొంచెం సానుభూతితో ప్రవర్తించిన యెడల యీమె ఆదర్శ గృహిణి కాగలదు.

కర్కాటకరాశియందు జన్మించిన వారికి మిత్రులు యెవరు?

కర్కాటకరాశియందు జన్మించిన మిత్రులును వీరును ఒకే స్వభావాన్ని కలిగిఉంటారు కాబట్టి వీరి స్నేహం చాలాకాలం ఉంటుంది· వీరిమధ్యను భేదాభిప్రాయాలు ఉండకపోవచ్చును కాని ఒకరు చెప్పిన దానిని యింకొకరు వెంటనే అంగీకరించడం వలన వీరిమైత్రి ఉత్సాహకరంగా ఉండదు.

కర్కాటకరాశియందు జన్మించినవారికి, సింహరాశి (జూలై 23— ఆగస్టు 22) యందు జన్మించినవారికి మైత్రి సాధారణంగా ఉంటుంది. నాయకత్వం వహించాలనే వాంఛ సింహరాశివారికి అధికంగా ఉంటుంది. అది కర్కాటక రాశివారికి నచ్చదు. అందుచేత వీరిమైత్రి హృదయ

మీరు పుట్టిన ఇంగ్లీషు...

పూర్వకంగా ఉండదు. సింహరాశివారు తమ ప్రవర్తనను కొంచెం మార్చుకొన్న యెడల వీరిమైత్రి ప్రయోజనకరంగా ఉంటుంది. మొత్తంమీద వీరిమైత్రివల్ల సింహరాశి వారికే యెక్కువ ఉపయోగం ఉంటుంది.

కర్కాటకరాశియందు జన్మించినవారికి కన్యారాశి (ఆగష్టు 23— సెప్టెంబరు 22—)యందు జన్మించినవారికి మైత్రి బాగా ఉంటుంది. కాని కన్యారాశి వారికి యితరులను విమర్శించే స్వభావం ఉండడం వలన వీరి మైత్రికి ఆకస్మికంగా భంగం కలగవచ్చును. కన్యారాశివారికి కర్కాటకరాశివారిమీద అభిమానం యెక్కువగా ఉంటుంది. వీరి మధ్యను మూడవవ్యక్తి జోక్యాన్ని సహించకూడదు. వీరి మైత్రిలో ప్రయోజనం కంటే సరదా అధికంగా ఉంటుంది. వీరి స్నేహంలో కర్కాటకరాశి వారు చురుకుగా వ్యవహరించడం అవసరం.

కర్కాటకరాశియందు జన్మించినవారికి తులా రాశి (సెప్టెంబరు 23— అక్టోబరు 22) యందు జన్మించిన వారికి స్నేహం అధికంగా ఉంటుంది. తులారాశివారికి మానసిక విషయాలమీద సరదా అధికంగా ఉంటుంది కర్కాటకరాశివారికి భవుతిక విషయాల మీద మోజు ఉంటుంది. అందువలన యే విషయంలోను వీరు యేకాభిప్రాయానికి రాలేరు కాని దానివలన వీరి మైత్రికి భంగం కలగదు. కర్కాటకరాశివారు ప్రతివిషయంలోను తటపటాయించడం తులారాశివారికి నచ్చదు. తులారాశి వారికి కార్యదక్షత అధికంగా ఉంటుంది కాబట్టి కర్కాటకరాశివారు తులా రాశివారిని అనుసరించడం మంచిది.

కర్కాటకరాశియందు జన్మించిన వారికి, వృశ్చిక రాశి (అక్టోబరు 23— నవంబరు 21) యందు జన్మించినవారికి స్నేహం బాగానే ఉంటుంది. వృశ్చికరాశివారు, యితరుల అభిప్రాయాన్ని అనుసరిస్తారు. కాబట్టి వీరిమైత్రి చాలాకాలం ఉంటుంది. వృశ్చికరాశి వారికి కర్కాటకరాశి వారిమీద అభిమానం ఉంటుంది. కర్కాటకరాశివారికి వృశ్చిక రాశివారిమీద గౌరవం ఉంటుంది. వృశ్చికరాశి వారు తమ లక్ష్యసాధనకోసం యేపనినైనా చేయగలరు. కాబట్టి వీరిమైత్రికి దానివలన భంగం కలగవచ్చును. మొత్తం మీద వీరి మైత్రి ప్రయోజనకరంగా ఉంటుంది.

కర్కాటకరాశియందు జన్మించిన వారు, ధనూ రాశి (నవంబరు 22—డిశంబరు 21) యందు జన్మించిన వారికి మైత్రి చాలా అరుదుగా ఉంటుంది. వీరి స్వభావాల్లో చాలా భేదం ఉంటుంది కాని ఆ భేదమే ఒక్కొక్కప్పుడు ఆకర్షణను కలిగించవచ్చును. ధనూరాశి వారి సాహసస్వభావం కర్కాటకరాశి వారికి నచ్చదు. వీరి మధ్యను ఉండే సంబంధం కేవలం పరిచయంగానే ఉండడం వలన ఉపయోగం ఉంటుంది. వీరి మధ్యను తగాదావస్తే అది చాలాదూరం వెళ్లగలదు. ధనూ

రాశివారి మీద కర్కాటకరాశివారు పగబట్టే ప్రమాదం ఉంది

కర్కాటకరాశియందు, జన్మించినవారికి, మకర రాశి (డిశంబరు 22— జనవరి 20) యందు జన్మించిన వారికి సహజమైన మైత్రి ఉంటుంది మకరరాశివారు ఇతరులను నొప్పించకుండా తమ పనులను నెరవేర్చుకొనగలరు ఈ లక్షణమే కర్కాటక రాశివారిని ఆకర్షిస్తుంది కర్కాటకరాశివారి సున్నితమైన మనస్తత్వాన్ని మకరరాశివారు ప్రేమిస్తారు అందుచేత వీరి మైత్రి ఆదర్శప్రాయంగా ఉంటుంది ఇతరుల మూలంగా వీరి మైత్రికి విఘాతం యేర్పడవచ్చును వీరు కొంత నిగ్రహంతో వ్యవహరిస్తే వీరిమైత్రి ఉభయులకు ప్రయోజనకరంగా ఉంటుంది

కర్కాటకరాశియందు జన్మించిన వారికి, కుంభ రాశి (జనవరి 21— ఫిబ్రవరి 19) యందు జన్మించిన వారికి స్వభావంలో చాలా భేదం ఉంటుంది కుంభరాశివారి ఉదారభావం కర్కాటకరాశి వారికి నచ్చదు, అయినా, కుంభరాశివారు కర్కాటకరాశివారిని గౌరవిస్తూనే ఉంటారు బలవత్తరమైన కారణాలవలన వీరు సన్నిహితులు అయినా, వీరిమైత్రి హృదయపూర్వకమైనది కాకపోవచ్చును కర్కాటకరాశివారు యెక్కువగా తమ వ్యవహారాల్లో నేఉండిపోతారు అదికుంభరాశి వారికి నచ్చదు అందుచేత వీరిమైత్రి యెప్పుడూ అంతంత మాత్రంగానే ఉండిపోతుంది

కర్కాటకరాశియందు జన్మించిన వారికి, మీన రాశి (ఫిబ్రవరి 20—మార్చి 21) యందు జన్మించిన వారికి సహజమైన మైత్రి ఉంటుంది వీరి స్వభావాల్లో పోలికలు ఉన్నా, ఆచరణలో భేదం ఉంటుంది వీరు యిద్దరూ సున్నితమైన మనస్సు కలవారే కాబట్టి వీరి మైత్రికి సాధారణంగా భంగం కలగదు కాని వీరి మైత్రికేవలం మైత్రిగానే ఉంటుంది కాని దానివల్ల ప్రయోజనం అంతగా ఉండకపోవచ్చును బలవత్తరమైన కారణంవలన వీరు విడిపోయినా, వీరిమధ్యను ఉండే అభిమానానికి కొరత ఉండదు. ఒక్కొక్కప్పుడు వీరి స్నేహంవలన మూడవ వ్యక్తికి ఉపయోగం ఉంటుంది

కర్కాటక రాశియందు జన్మించిన వారికి మేష రాశి (మార్చి 22— ఏప్రిల్ 20) యందు జన్మించిన వారికి సాధారణమైన స్నేహం ఉంటుంది కర్కాటకరాశివారు సున్నితమైన మనస్సుకలవారు కావడం వలన మేషరాశివారి దుడుకు ప్రవర్తనను సహించలేరు కర్కాటకరాశివారు సాధారణంగామేష రాశివారికి లొంగిఉన్నా, ఆకస్మికంగా యెదురు తిరిగి, దెబ్బతీసే అవకాశం ఉంది వీరి స్నేహంలో లో అవగాహనకంటే అభిప్రాయ భేదాలే అధికంగా ఉంటాయి కేవలం పరిచయస్థులుగానే వీరు ఉండటంవలన ఇద్దరికీ ప్రయోజనం ఉంటుంది

కర్కాటకరాశియందు జన్మించినవారికి, వృషభ రాశి (ఏప్రిల్ 21— మే 21) యందు జన్మించిన వారికి, మైత్రి బాగా ఉంటుంది వీరి మధ్యను భేదాభిప్రాయాలు వచ్చినా అవి వీరి మైత్రికి రాగాన్ని కలిగించలేవు వృషభరాశివారికి కర్కాటక రాశి వారిమీద గౌరవం ఉంటుంది కర్కాటకరాశి వారికి వృషభరాశివారిమీద అభిమానం యెక్కువగా ఉంటుంది వృషభరాశివారితో సాధారణంగా కర్కాటకరాశివారికే విశేషమైన స్నేహం ఉంటుంది

కర్కాటకరాశియందు జన్మించిన వారికి మిథున రాశి (మే 22— జూన్ 21) యందు జన్మించిన వారికి స్నేహం చాలా అరుదుగా ఉంటుంది మిథునరాశివారు తరుచుగా తమ ఊహాలోకాల్లోనే ఉంటారు అది కర్కాటకరాశివారికి సహించదు కర్కాటకరాశివారు అన్ని విషయాల్లోను క్రమాభివృద్ధిని సాధించాలని కోరుతుంటారు అది మిథున రాశి వారి స్వభావానికి విరుద్ధం ఏదైనా బలవత్తరమైన కారణంవలన వీరు సన్నిహితులు అయినా, ఆ స్నేహం హృదయపూర్వకంగా ఉండక పోవచ్చును

ఆరోగ్యం వగైరా

ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది వీరికి శారీరకశక్తికంటే మానసికశక్తి అధికంగా ఉంటుంది తరుచుగా వీరికి స్థిరనిశ్చయం లేకపోవడంవలన యిబ్బందులను పొందుతుంటారు. ఉదర సంబంధమైన అనారోగ్యం చేయడానికి అవకాశం ఉంది

వీరికి అదృష్టాన్ని కలిగించేవి రంగు—తెలుపు రంగు ఆకుపచ్చరంగుకూడా వీరికి బాగా ఉంటుందని కొందరి అభిప్రాయం

ధరించవలసినవి— ముత్యం (Pearl) చంద్ర కాంతం (Moon stone)

సంఖ్యలు— 2, 11, 20, 29, 38, 47, 56 వగైరా.

వారాలు— సోమవారం

నెలలు— జూన్ 22 మొదలు జూలై 22 అక్టోబరు 23 మొదలు నవంబరు 21 ఫిబ్రవరి 20 మొదలు మార్చి 21.

సంవత్సరాలు (వయస్సు) 2, 11, 20, 29, 38, 47, 56, 65 వగైరా

(వచ్చేవారం—సింహం)

—మహేష్

అభియోగాల్లో వింతలు

పసిపాపను పోలీస్ లకు ఒప్పజెప్పిన పదేండ్ల బాలిక

ఒక యువతి తన పాపను పదేండ్ల బాలిక ఒకతెకు ఇచ్చి యిట్లా చెప్పింది, "చూడమ్మా. ఈ పాపను తీసుకు వెళ్ళి పోలీస్ లకు ఇవ్వు ఇవ్వనంటావా? పాపను ఈ పేవ్ మెంట్ మీద పడేసి నా దారిన నేను పోతాను"

ఆ పదేండ్ల బాలిక సుసాన్ బెనెట్ పాప నెత్తుకుని పోలీస్ స్టేషన్ కు వెళ్ళి ఈ కథ చెప్పింది

సుసాన్ నివాసం లండన్, హేన్డ్ సన్ రోడ్ లో పాప వయస్సు ఎనిమిది నెలలుంటుంది "పోలీసులు నా పేరూ, విలాసమూ రాసుకున్నారు. మంచి అమ్మాయివి" అన్నారు అనిక్కూడా సుసాన్ చెప్పింది.

అట్కిన్ సన్ స్ట్రీట్ లో జరిగింది ఈ విచిత్రం. పాపతల్లి వయస్సు 20 సంవత్సరాలుండవచ్చునని పోలీసులు అన్నారు, మరొక వనితను వెంటపెట్టుకుని వచ్చింది ఈ యువతి సుసాన్ ఇంకా యిట్లా చెప్పింది, "కొత్త మనుష్యులతో మాట్లాడ వద్దని చెప్పింది మా అమ్మ అందుకని నాప్పు మాటలు అసలు పట్టించుకోలేదు. మొదట నేను, కానీ, ఆ తల్లి నన్ను ప్రతిమిలాడినది పాపంగదా అని పాపను తీసుకుని బయల్దేరాను ఆగమ్మా మేము కనిపించకుండా పోయేవరకూ ఆగు తరువాత పాపను తీసుకువెళ్ళు అన్నది ఆ తల్లి.

"ఇద్దరు తమ్ముళ్ళున్నారు నాకు పాపను ఎత్తుకోవడం అలవాటే నాకు"

నిర్దయురాలయిన ఆ తల్లి ఎవరో మరి! పోలీస్ లు గాలించుతున్నారు ఆమెకోసం

డాక్టరు చేసిన తప్పు రోగికి రూ. 13,000 ల పరిహారం

శరీరంలో ఒక చోట చేయవలసిన ఇంజెక్షన్ మరొక చోట ఒక రోగికి ఒక డాక్టరు చేశారు, పాపమూ మహిళ శాశ్వతంగా పక్షవాతం రోగి అయినది. పరిహారంగా ఆ మహిళకు రూ 13,000 లు ఇచ్చారు

రోగి పేరుగానీ, డాక్టరు పేరుగానీ ప్రకటించరాదని నిర్ణయించారు జరిగిన దేమిటంటే ఒక అవయవంలో నొప్పిని తగ్గించడానికి ఉపయోగించే ఇంజెక్షన్ను మరొక చోట ఇచ్చాడు డాక్టరు. ఆ మహిళ వెన్నెముక దెబ్బతినిపోయింది.

అయితే ఇక్కడొక విచిత్రం. ఈ రూ. 13,000 లను ప్రభుత్వ ఖజానా నుంచి చెల్లించ లేదు డాక్టరు తరఫున వ్యవహారం జరిపిన వైద్యుల రక్షణ సంఘం నిధి నుంచి చెల్లించారు.

—వి ఎస్ అవధాని

ఏమైనారు వీళ్లంతా?

ఒకప్పుడు చిత్ర పరిశ్రమలో అపూర్వ సంచలనాన్ని సృష్టించిన నటీనటులు నేడు కనిపించటంలేదు. వీళ్లంతా ఏమైనారో తెలీదు. సి. హెచ్. నారాయణరావు, కృష్ణవేణి, వల్లం నరసింహారావు, రామచంద్ర కాశ్యప, రామశర్మ, అమర్‌నాథ్, రమణమూర్తి, మంత్రవాది శ్రీరామమూర్తి, టి. యస్. స్వామి, లింగమూర్తి, వి. కోటేశ్వరరావు (శోభనాచల), సీతారాం, నల్ల రామమూర్తి, రాజా రెడ్డి, లంకసత్యం, జూనియర్ శ్రీరంజని, అనురాధ, జయశ్రీ గిరిజ, వాసంతి, సీత మొదలైనవాళ్లంతా ఈ కోవలోకి వస్తారు. ఎంతో సమర్థతను సంతరించుకొన్న ఈ నటీనటు లందరికీ ఈనాడు పరిశ్రమలో ఎందుకు స్థానం లేదో, వారికి నిర్మాతలు వేషాలుయిచ్చి ఎందుకు ప్రోత్సహించడం లేదో అర్థంకాని విషయం; నిర్వచించలేని కారణాలేమైనా వున్నాయేమో తెలీదుమరి!

ఏమైనా, పైన పేర్కొన్న నటీనటులు ఆ రోజుల్లో పాత్ర పోషణ గురించి విశేషమైన కృషి సలిపేవారు. ఆ చిత్రాలూ చక్కగా ప్రదర్శింపబడేవి. బాగా డబ్బూ చేసుకునేవి. కృష్ణవేణి, నారాయణరావుల జంట నటించిన చిత్రాలు ఒకప్పుడు జనం విరగబడి చూసేవారు. ఆ జంటపట్ల విశేషితమైన అభిమానం కనపరచేవారు. వారి చిత్రాలను పదే పదే చూస్తూండేవారు. శ్రీ ఎల్. వి. ప్రసాద్‌గారి దర్శకత్వంలో తయారయిన ఎం. ఆర్. ఏ. వారి 'మన దేశం', గోపీచంద్‌గారి దర్శకత్వంలో వచ్చిన లక్ష్మమ్మ, పేరంటాలు ఈ జంట ప్రతిభకు మచ్చుతునకలు.

గజాననవారి 'కోడరికం'లో కథా నాయకుడిగా నటించిన రామచంద్ర కాశ్యప మంచి పేరు తెచ్చుకున్నారు. కొత్తవాడైనా చక్కగా చేశాడన్నారు. అలాగే మంత్రవాది శ్రీరామమూర్తి యువావారి 'టెంగు రంగా'లో నాయక భూమిక ధరించి — కొత్తవాడైనా చక్కని వాడనిపించు కున్నారు. పి. ఏ. పి. వారి 'పెంపుడుకొడుకు'లో కూడా ఆయన నటించారు. సావిత్రి పక్కన రామశర్మ ఎన్నో చిత్రాల్లో నాయకుడిగా నటించారు. నవ్వితే నవరత్నాలు, అదృష్టదీపుడు, ఆదర్శంలాంటి చిత్రాలలో నటించి ఆయన సంచలనం సృష్టించారు. టి. యస్. స్వామి ప్రతిభావారి 'చిన్నకోడలు' లోను, స్వాతీవారి 'రూపవతి'లోను నాయకుడిగా నటించి పేరు తెచ్చుకున్నారు.

నటుల్లో అమర్‌నాథ్ కూడా సంచలనం కలిగించాడు. అతను నటించిన సినిమాలు అనేకం బాక్సాఫీస్ దగ్గర విజయాన్ని సాధించినవి. చిత్రపు నారాయణమూర్తిగారి దర్శకత్వంలో వచ్చిన 'నాచెల్లెలు', అదుర్తి సుబ్బారావుగారు తొలిసారిగా దర్శకత్వం వహించిన 'అమరసందేశం'లోనూ నాయకుడు అమర్‌నాథ్. 'ఆడపడుచు' చిత్రంలో శ్రీ రామారావుగారు నటించిన పాత్రను 'నాచెల్లెలు'లో అమర్‌నాథ్ వేశారు. తెలుగుచిత్రాల్లోనే కాదు; 'భక్త మల్లికార్జున' వంటి కన్నడ చిత్రాల్లోనూ అమర్‌నాథ్ ముఖ్యభూమికలు పోషించాడు. సారథివారి 'అంతా మనవాళ్లే'లో నాయకుడిగా నటించి 'ఎంతో సమర్థుడనిపించు కున్న వల్లం నరసింహారావు, జమునలాంటి అగ్రశ్రేణి నటిపక్కన 'పెళ్లితాంబూలం' లోను, రజతోత్సవచిత్రం 'శభాష్‌రాముడు' మున్నగువాటిలోనూ నటించి పేరుప్రతిష్ఠలు సంపాయించుకున్న రమణమూర్తి ఈనాడు అగుపించటంలేదు.


ఇక ఆడవాళ్ల విషయానికి వస్తే— బరువైన భూమికలు నిర్వహించడంలో జూనియర్ శ్రీరంజనికి ఎంతో పేరుండేది. వాహినీవారి 'గుణసుందరి కథ', ఎ. ఎస్. ప్రొడక్షన్స్ 'అడ్రబతుకు' చిత్రాలు మచ్చుకి చెప్పుకోవచ్చును. 'పాతాళభైరవి'లో నాయిక మాలతీ, 'దైవబలం'లో నాయికగా నటించిన జయశ్రీ (అమ్మాజీ), ఉపనాయిక పాత్రల్లో చక్కనిపేరు తెచ్చుకున్న వాసంతి, హాస్య భూమికల్లో జీవించిన సీతా; అటు హాస్యభూమికల్లోను, ఇటు నాయిక భూమికల్లోను రాణించిన గిరిజా— బి. ఏ. సుబ్బారావుగారు పరిచయంచేసి 'మదనకామరాజు'లో నాయికగా నటించిన అనురాధా నేడు చిత్రపరిశ్రమకు దూరమైనారు.

వీరిలో కొందరు అప్పుడప్పుడూ ఒకో చిత్రంలో కనిపిస్తూంటారు. మరికొందరు ఏ చిత్రంలోను కనిపించరు. ప్రతిభా, చక్కని నటనానుభవాన్నీ కలిగివున్న వీరంతా ఏమైనారు? పరిశ్రమ వీరినెందుకు చిన్నచూపు చూస్తోంది? వెదకబోతే కారణాలు దొరకవు.

—మోహన్‌కుమార్



'తారాశశాంకం' లో శోభన్‌బాబు, దేవిక.



ఎస్. రమాదేవి, పేటుకూరు.

నాకు నటికావాలని కోరికగా యున్నది మీరు నటించటానికి కావంసిన శిక్షణ యిస్తారా? ఎప్పుడు రమ్మంటారు?

మొదట మీ కోరిక నెరవేర్చుకోండి. నటించే శిక్షణను మిమ్మల్ని బుక్ చేసే నిర్మాతలే యిప్పిస్తారు. మీరు వచ్చేందుకు నా అభ్యంతరమేమిటి.

టి. కమలాస్వామి, తరిగోపుల్లా

సినిమాలో కళాకారులు (యాక్టర్సు) బీదపాత్ర ధరించి పాటి బీదవారిని ఎంతో దయతో, దాక్షిణ్యముతో చూస్తారు. మరి వారి నిజజీవితములో కూడా వారిని అట్లా చూడగలరా? బీదవారియందు ఆదరణ చూపగలరా?

పాత్రధరించి అని మీరే అంటూ మరలా నాచే సమాధానం ఇప్పించటాలా చెప్పండి.

ఎస్. హెచ్. బాబు, తిరుపతి

మిమ్ములనే పురుషుడయినా గా...ఢంగా ప్రేమించాడనుకోండి... మీరిచ్చే ప్రతిఫలం ఏమయివుంటుంది?

గా...గాఢంగా ప్రేమిస్తే ప్రతిఫలం ఘాటుగా వుంటుంది. ఫలం ప్రతిఫలం రెండింటిని అతడే అనుభవించాలి.

సుబ్బారావు, విజయనగరం

నేను మిమ్మల్ని పెళ్ళాడ దల్చుకున్నాను కట్నం ఎంత?

మీరు యివ్వలేనంత... నన్ను పొందలేనంత. ఎందుకో నీకీపంతమయిన కోరిక.

జి. శ్రీ, రాజమండ్రి

శ్రీగారూ, మీరు 'మనీవీ' బ్లాకులో తీసుకుంటారా? లేక మామూలు మార్కెట్టులోనే తీసుకుంటారా?

'బ్లాక్' అంటేయేమో, 'వైట్' అంటే యేమో తెలుసుకునే స్థితికి యింకా నేను చేరలేదు.

ఎం. మురళీ, కరీంనగర్

కనిపెంచిన తల్లి దండ్రులను మరచి, ప్రేమించిన ప్రేయసిని ఎంత ప్రయత్నించినా మరువజాలడు కారణం ఏమిటో?

అదేనండీ కలియుగ మహాత్యం.

శ్రీ సుబ్రహ్మణ్య సులోచన, నెల్లూరు.

నాకు మీమీద మోజు ఎక్కువ. మా శ్రీమతిని అడిగి మీనిద్దరం కొంప్పాడుదామా?

మీ మోజు యొక్క బూజును వదలకొడ్తుంది మీ శ్రీమతి.

వసుపులేటి వరలక్ష్మి, ఉండ్రాజవరం.

సినీజీవితం పూలబాటవంటిదని మేమనుకుంటున్నాం. మీరూ మాతో ఏకీభవిస్తారా?


ఏ జీవితమయినా సర్వం యేర్పరచుకునే పద్ధతిలోనే వుంటుంది.

బహుమతిపొందిన ప్రశ్న

టి. లక్ష్మి దేవి, బొల్లారం

నిస్వార్థంగావుంటే బ్రతుకుట దుర్లభం. స్వార్థంగావుంటే నలుగురిలో వేలెత్తి చూపిస్తారు. మరి మీరు దీనిలో ఏకీభవిస్తారు?

పిన్నిగారూ!
అప్పులూ అరువులూ
తప్పించి
మాటుపనిసాయాలు మరెప్పుడైనా సరే



తన్ను మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం అని యెంచి పరోపకారార్థ మిదం శరీరం అనే సూక్తిని పాటించాలి.

చుట్టరికాలు

ఈ కుటుంబ కలహాల కథని మనోరంజకంగా చిత్రీకరించిన చిత్రం శ్రీ దేవి కంబైన్స్‌వారి 'చుట్టరికాలు'

డబ్బుకంటే దగ్గరి చుట్టంలేని కర్కోటకుడు వెంకట నరసయ్య అతని కుమార్తె కమల కమల శ్రీనివాసరావనే పేదవాణ్ణి పెళ్ళిచేసుకుంటుంది ఆ కోపంతో కమలని ఇంట్లో కాలుపెట్టనివ్వకుండా చేస్తాడు నరసయ్య అతనికొక కొడుకు, కమలకొక కుమార్తె ఈ ఇద్దరూ పెళ్ళిచేసుకోవాలనుకుంటారు వెంకట నరసయ్య నిరాకరిస్తాడు శ్రీనివాసుకి అదృష్టం కలిసివచ్చి బాగా ధనవంతు డవుతాడు ప్రమాదవశాత్తూ మరణిస్తాడు నరసయ్య మనవరాల్ని కొడుక్కి చేసుకుందామనుకున్నా, కమల భర్తకిచ్చిన మాట నిలకడకోసం అడ్డుచెప్తుంది తన కుమార్తె, తమ్ముడి ప్రేమ నెరవేర్చుకుని వాళ్ళ పెళ్ళికోసం తన ప్రాణత్యాగం చేస్తుంది కమల

కథ నడవటానికి ఆధారం కేవలం పట్టుదలలు చిత్రం రసవత్తరం కావటానికి ముఖ్యకారణం దర్శకుడు పేకేటి శివరాం చాతుర్యం. ఈ చిత్రం ఇదివరలో 'చక్రతీర్థ'గా కన్నడదేశంలో మంచి ఖ్యాతిగడించింది దాని దర్శకత్వపు అనుభవంతో చుట్టరికాలను మరింత ఆకర్షణీయంగా కూర్పగలిగాడు దర్శకుడు

వెంకట నరసయ్యగా గుమ్మడి నటన చాలా బాగున్నది క్లిష్టమైన పాత్రని అతి సునాయాసంగా నిర్వహించినందుకు విశేష ప్రశంసల నందుకుంటాడు జయంతి, జగ్గయ్యలనటన ఆయా పాత్రలకి మెరుగుపెట్టింది శోభన్‌బాబు నటన పాత్రోచితంగావుంది రేలంగి, అల్లురామలింగయ్య, బాలకృష్ణల 'పరమానందయ్య శిష్యోపాఖ్యానం' చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ తదితర పాత్రలని కొత్తనటి లక్ష్మి, హేమలత, విజయశ్రీ, రమాప్రభ, మొదలైనవారు పోషించారు కాంతారావు, కృష్ణకుమారి అతిథి నటులుగా కనిపిస్తారు

సకుటుంబంగా చూడతగ్గ ఈ చిత్రానికి మాటలు పాలగుమ్మి పద్మరాజు రాశారు సంగీత దర్శకుడు ఘంటసాల పేకేటి శివరామ్‌కు దర్శకుడుగా ఉజ్వల భవిష్యత్తు చేకూర్చగల 'చుట్టరికాలు' నిర్మాత తోట సుబ్బారావు సమర్పణ యస్ రంగారావు —పికరాజు ●



''చుట్టరికాలు'' లో శోభన్‌బాబు, కొత్తనటి లక్ష్మి.

సినిమా

నాగరీక దుస్తులకి ప్రవేశం లేదు

వాహిని స్టుడియో 5వ ఫ్లోర్‌లో నిర్మాత శ్రీ త్రివిక్రమరావును కలిశాను ఆయన సర్వదా చిరునవ్వు లొలికించే ముఖంతో, అప్యాయంగా అడిగిన సమాచారాన్ని వివరంగా వెల్లడించారు 'మేము ప్రస్తుతం 'వరకట్నం' చిత్రాన్ని నిర్మిస్తున్నాం, మా అగ్రజుడే దర్శకత్వం నెరపుతున్నారు 'ఉమ్మడి కుటుంబం' యూనిట్ అంతా యీ చిత్రంలోనూ వుంటారు ఈ చిత్రంలో బుష్‌షర్టు, ప్యాంటులాంటి నాగరీక దుస్తులను ప్రవేశపెట్టడంలేదు; ఈ కథ మా తాతల హయాంలో జరిగినది ఆ కాలంలో వాడుకలోవున్న దుస్తులనే మా చిత్రంలో చూపిస్తాం' అన్నారు త్రివిక్రమరావు మా సంభాషణ పూర్తయిందో లేదో శ్రీ రామారావు కెమరామెన్ రవికాంత్‌ను 'రెడీ యా' అని అడిగి నాయిక కృష్ణకుమారికి ప్రేమగీతానికి ఎలా నటించాలో వివరించారు ఎప్పుడూ నవయౌవనవతిగా కన్పించే కృష్ణకుమారి ఆ రోజు జరీఅంచు కాఫీ రంగు పట్టుచీర ధరించి, మోచేతివరకు వుండే చక్కటి పట్టు జాకెట్‌ను తొడుగుకుని, విడుపైన నల్లని జడతో తళ తళ మెరిసిపోయింది

* * *

5వ ఫ్లోర్‌నుండి 7వ ఫ్లోర్‌లోకి అడుగెట్టాను. లోపల విజయలలిత చెంగు చెంగున ఎగురుతూ, కాంతారావును సరస సల్లాపాలలోకి దించుతూంది. పాపం కాంతారావు ఆమె ధాటికి తట్టుకోలేకపోతున్నాడు. మొత్తానికి అతన్ని తనవైపుకి తిప్పేసుకుంది. ఇద్దరూ కౌగిలించుకునే సంతోష సమయం—విజయ్ అనేడి భయంకర శబ్దం—విన్న కాంతారావు విశ్చేష్టుడయ్యాడు ఎవరు ఘోషించింది? ఆ సమయంలో అక్కడ ఎవ్వరు, ఎందుకు అలా చేశారు? విజయలలిత ఎవరు? కాంతారావు ఆమెకు ఎలా చిక్కాడు? అనేడి ప్రశ్నలకు సమాధానం సునందినీ పిక్చర్స్ 'భలే మొనగాడు'లో జూలై 12వ దొరుకుతుంది.



'రాజయోగం' లో రాజశ్రీ

ఇంతలో మీరు ఆలోచించి ఒక నిర్ణయానికి రండి. చిత్రం చూసిన తర్వాత మీరు వూహించింది నిజమా, కాదా అని తెల్సుకోండి. ఇలా వుత్సాహాన్ని, వుద్వేగాన్ని కల్గించే సన్నివేశాలను దర్శకుడు విఠలాచార్య జొప్పించి, 'భలేమొనగాడు' లో మిమ్మల్ని మెప్పించే మసాలాను అధికంగా వుపయోగించారు. శ్రీ మల్లికార్జున రావుకు యీ చిత్రంకూడ అధికలాభాల్ని సంపాదించి యిస్తుందని నమ్మవచ్చు.

సినీరంగంతో 8 ఏళ్ల పరిచయం

విక్రం స్టుడియోలో 'సత్తెకాలపు సత్తెయ్య' నిర్మాత ప్రసాద్‌ను కలిసాను. చాలా హుషారుగా కన్పడ్డాడు. 'ఏమిటయ్యా భలే హుషారుగా వున్నావే' అని అడగాను. 'ఇంకేముంది నా చిత్రం షూటింగు దాదాపు పూర్తయింది. దర్శకుడు బాలచందర్ నాకు చాలా నచ్చారు. ఒక్క సెకండుకూడ వృధాకాకుండా వేసుకున్న షెడ్యూలుకన్నా ముందుగానే ప్రతిసెట్టును పూర్తిచేసారు. ఫలానా సీనుకు నాల్గుగంటలవుతుందని అనుకునేవాళ్లం. తీరాచూస్తే రెండుగంటల్లో పూర్తయ్యేది. నాకు అన్నివిధాలా సహకరించి నా చిత్రాన్ని తన స్వంత చిత్రంగా భావించి, నిర్మాణ కార్యక్రమంలో హాస్యనటుడు చలం తోడ్పడ్డారు. నేను చిత్ర నిర్మాణానికి కొత్తయినా సినీరంగంతో నాకు ఎనిమిదేళ్ల పరిచయం వుంది. షూటింగు అయిందన్నారు. 'రిలీజు ఎప్పుడని ప్రశ్నించాను. 'ఆగస్టులో విడుదల చెయ్యాలనుకుంటున్నా. ఆ పైన పూర్ణా కామరాజుగారి యిష్టం' అన్నాడు ప్రసాద్.

నటనలో కొత్తమార్పు

ప్రసాద్‌తో కారులో బయల్దేరబోతుంటే నిర్మాత బి. వి. రాజు 'రండిసార్ మా షూటింగు ఆఖరి కాల్‌షీటు చూడండి' అని పిలిచాడు. సరేనని అతన్ని అనుసరించాను. సెట్టులో యువదర్శకుడు సుబ్బరామదాసు ప్రభాకర రెడ్డికి ఆనాటి సన్నివేశ సందర్భాన్ని వివరిస్తూ, కెమరాకు రెడీ కమ్మన్నాడు. ఆరోజు జరిగిన షూటింగు వివరాన్ని మీకు అందిస్తాను. చదవండి.

విదర్భకు చక్రవర్తి ప్రభాకరరెడ్డి. ఆయన కుమార్తె రాజశ్రీ. ఆమె వరించినవాడు రాజవంశీయుడు కాదని విందుసభలో బట్టబయలు చేస్తాడు సత్యనారాయణ. రాజకుమారుడిలాగా వేషం ధరించినవారే కాంతారావు. నిజాన్ని విన్న ప్రభాకరరెడ్డి కళ్లెర్రజేస్తాడు. మరణదండన విధించేందుకు సంసిద్ధమయ్యే తరుణంలో 'మీకెందుకండి శ్రమ. ఈ మోసగాడ్ని నాతో పంపండి. ఇతడ్ని ఎలా సత్కరించాలో నేను చూసుకుంటాను' అని కాంతారావును చర, చరా యీడ్చుకుపోతాడు సత్యనారాయణ. అసలు కాంతారావు ఎవరు? ఎందుకిలా వేషం వేసాడు? సత్యనారాయణకు కాంతారావుపై పగ ఎందుకు కల్గింది? అన్న సమస్యలకు సరయిన సమాధానం ఆగస్టు మూడవవారంలో విడుదలయ్యే 'రాజయోగం' చిత్రం చూస్తే దొరుకుతుంది. ప్రతి చిత్రంలోను రాజనాలను దుష్టనాయకునిగానే చూడడం అలవాటైన మనకు యీ చిత్రం అతన్ని సరికొత్త రూపంలో చూపిస్తుంది. అంతేగాదు—అతగాడి నటనలోకూడ వింతయిన మార్పును మనం చూడగలం. ముఖ్యంగా పతాక సన్నివేశాల్లో రాజనాల ప్రదర్శించిన హావభావాలు మీరే చూస్తారుగా.

నట జీవితంలో కొత్త మలుపు

టిఫిన్ బ్రేక్ కావడంతో క్యారెక్టరు నటుడు ప్రభాకరరెడ్డి నన్ను సమీపించి 'బంగారు సంకెళ్లు రష్ చూసారా?' అని అడిగారు. 'అబ్బే లేదండి' అన్నాను. 'మీరు తప్పక చూడాలండి. అందులో నేను ధరించిన పాత్ర నా నట జీవితంలో కొత్త రికార్డును సృష్టిస్తుందని నమ్ముతున్నా. ఇంతవరకు నేను వేసిన పాత్రలన్నీ ఒక ఎత్తు, 'బంగారు సంకెళ్లు' లోడి పాత్ర ఒక ఎత్తు' అన్నారు. 'నాకు ఇంత ప్రాముఖ్యత గల పాత్ర నిచ్చిన నిర్మాతకు, నాచే అద్భు



'బంగారుగాజులు' లో నాగభూషణం, విజయనిర్మల

తంగా నటింపచేసిన దర్శకుడు రామినీడును యీ జన్మలో మరువలేనండీ ఆ పాత్రను నటించేప్పుడల్లా నా మనస్సు నన్నేదో చేసేది' అని అంటూ 'విజ్ఞానవంతులయిన పాఠకేయులు నా పాత్రను పరిశీలించి నా నట జీవితానికి చక్కటి ప్రాతిపదికను యేర్పరచాలని కోరుకుంటున్నా' అని ముగించారు మేమిద్దరం మాట్లాడుతున్న అర గంట సేపట్లో బాదాపు పదిమంది రెడ్డి గారి కాల్‌షీట్ల కోసం వచ్చారు అది చూచి 'అబ్బా! బలే బిజీగా వున్నారే' అన్నాను 'అవునండీ ఇది నాకు మంచి పీరియడ్ సుమారు డజను చిత్రాల్లో ముఖ్యపాత్ర లను పోషిస్తున్నా' అన్నారు

*   *   *

ప్రభాకరరెడ్డి ఎం బి బి ఎస్ ప్యాసయిన విద్యార్థికుడు సంపన్నుడయినా ఆడం

సినిమా

బరంగా జీవించడమో లేక అహంభావంగా సంభాషించడమో చేతకాదు అనవసరంగా యే విషయంలోనూ తలదూర్చరు స్నేహితు లంటే ప్రాణం మితభాషిగా వుంటూ, దర్శక నిర్మాతల అభిమానాన్ని సంపాదిస్తూ, యిచ్చిన పాత్ర యెలాంటిదయినా తుణ్ణంగా అర్థంచేసుకుని ప్రభాకరరెడ్డి బాగా చేసాడు అనిపించుకుంటూ వుండే యీ నటునికి యింకా సరయిన పాత్ర అంటే ప్రేక్షకుల హృదయాలను కదలించే పాత్ర రాలేదు 'బంగారు సంకెళ్ళు'లో మాత్రం కొంత తృప్తిని కల్గచేసే భూమిక లభించింది

అనుకున్న దొకటీ అయిందొకటీ

విక్రం నుండి వాహిని స్టుడియోకి వెళ్లాను అక్కడ శోభన్‌బాబు, వాణిశ్రీ, గీతాంజలి మేకప్‌లో షాట్‌కు రెడీ అయ్యారు దర్శకుడు తిలక్, వాణిశ్రీ, గీతాంజలిని నృత్య వేదికపైకి రమ్మన్నారు పుత్తడి బొమ్మ లిద్దరూ మనోరంజితమయిన నాట్యాన్ని ప్రదర్శించారు ఎవరికోసమీ నాట్యం? అని మీ రడగొచ్చుగా పావం, శోభన్‌బాబు అనుకొన్న దొక్కటి—అయినది వేరొక్కటి కళా రంజని అనే అహంకారి ఆట కట్టించాలని శోభన్‌బాబు వాణిశ్రీ, గీతాంజలిచే బ్రహ్మాండమయిన నాట్యాన్ని చేయిస్తాడు అందాలొలికే యీ అమ్మాయిలు నాట్యం నేర్చుకుంటూ శోభన్‌ను యిద్దరూ ప్రేమిస్తారు వీరిద్దరిమధ్య సతమవుతున్నాడు శోభన్‌బాబు ఆఖరికి ఎవరు కథానాయకుణ్ణి పొందుతారో శంభూఫిలింస్ 'పంతాలు—పట్టింపులు' చూస్తే మీకు తెలుస్తుంది మానవ జీవితంలోని సుఖ, దుఃఖాల సమ్మేళనాన్ని తమ చిత్ర కథగా యెంచుకుని సర్వజన రంజితంగా నిర్మించారు దగ్గుబాటి లక్ష్మీనారాయణచౌదరి ఈ చిత్రాన్ని సర్వాంగ సుందరంగా మలచడానికి పెండ్యాల సంగీతం, కవిచంద్రుల గీతాలు, పినిసెట్టి సంభాషణలు, నేత్రానందమొనర్చే లక్ష్మణగోరే ఛాయాగ్రహణం, చాతుర్యం పుట్టిపడే సత్యం కూర్పు, కనులవిందొనర్చే ఎ కె శేఖర్ కళా దర్శకత్వం ముఖ్య కారణాలని చిత్రం చూచి మీరే ఒప్పుకుంటారు



'భలేమొనగాడు'లో కృష్ణకుమారి

సినిమా డైరీ

● సూర్యచిత్ర వారి "పెళ్ళిరోజు" చిత్రానికిగాను పి బి శ్రీనివాస్ పాడిన "మగువల వలలో" పాటను హరనాథ్‌పై మెరీనా బీచ్‌లో దర్శకులు మానాపురం అప్పారావు చిత్రీకరించారు ఈ చిత్రంలో జమున కథానాయిక పద్మనాభం, గీతాంజలి హాస్యజంట

● బాబూమూవీస్ 'ఉండమ్మా బొట్టు పెడతా" షూటింగు శారదా స్టూడియోలో జరుగుతూంది షావుకారు జానకి, కృష్ణలకు సంబంధించిన సన్నివేశాలను నిర్మాత సుందరంకు శ్రీ కె విశ్వనాథ్ చిత్రీకరించారు

● అహ్మదాబాద్‌లోని కృష్ణా థియేటర్లో "హంరాజ్" చిత్రం రజితోత్సవం జరుపుకుంది ఈ థియేటర్లో యీ వుత్సవం ఎనిమిదవ సారిగా జరుగుతూంది

● ప్రముఖ హిందీ నటుడు దేవానంద్ తన 'ప్రేమపూజారి" చిత్రానికిగాను అమెరికాలో ఒక హెలికాప్టర్‌ను కొన్నారు

● ప్రఖ్యాత నర్తకి నటి శ్రీమతి వైజయంతి తన భర్తతో రెండు నెలల పాటు విదేశ పర్యటన చెయ్యడానికి నిశ్చయించారు ఈమె తనతోపాటు ఒక నాట్య బృందాన్ని తీసుకెళ్తుంది

● ప్రముఖ నటి శ్రీమతి జమున ఉత్తమ సహాయనటిగా ఫిలింఫేర్ అవార్డును, నటుడు శశికపూర్ వద్ద నుండి గ్రహించింది

● మేఖలా ఎక్సర్స్‌లో జయలలిత ఎం జి అర్ నాయకీ, నాయకులుగా నటిస్తారు కృష్ణన్, పంజు దర్శకులుగా నియమించబడ్డారు

● శ్రీ దోనేపూడి కృష్ణమూర్తి 'మక్కళై పెట్ర మహారాసి" చిత్రాన్ని తెలుగులో సుబ్బరామదాస్ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు కథానాయకుడిగా నాగేశ్వరరావు, రామారావుల్లో ఒకరుండాలని తెలుస్తూంది


● ప్రముఖ నటుడు మనోజ్ కుమార్ తన చిత్రమయిన 'ఉపకార్"కు యివ్వబడిన విదేశీ మారకద్రవ్యం చాలా తక్కువగా వుందని విదేశీ చిత్ర ప్రదర్శనోత్సవానికి ప్రింటును పంపడంలేదు

● కళాచిత్ర ఎ సుబ్రహ్మణ్యం దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రంలో రాజశ్రీ హరనాథ్ నాయకీ, నాయకులుగా నటిస్తున్నారు మరియొక ముఖ్యపాత్రను రాంమోహన్ నిర్వహిస్తున్నాడు

● శ్రీ తోట సుబ్బారావు ఎన్ టి రామారావుతో ఒక చక్కటి కుటుంబ చిత్రాన్ని నిర్మించ నున్నారు

● శ్రీకాంత్ ప్రొడక్షన్స్ 'మనసంసారం" జులై 4వ విడుదలౌతూంది భారతి, శోభన్‌లు నాయకీ నాయకులుగా నటించిన యీ చిత్రాన్ని శ్రీ సి ఎస్ రావు డైరెక్టు చేసారు

● హేమా మూవీస్ నిర్మిస్తున్న జానపద చిత్రంలో భారతిస్థానే విజయలలిత నటిస్తూంది



గుణదాస్'లో చంద్రకళ.

ప్రతి పాత్రలో ప్రత్యేకత

శ్రీమతి జమున ధరించే ప్రతి పాత్రలో ప్రత్యేకత వుంటుంది. పాత్రలో లేక పోయినా, ఆ పాత్రను పోషించడంలో ప్రత్యేకతను ప్రదర్శించి 'యీ పాత్ర జమున చేస్తేనే బాగుంటుంది' అని ప్రేక్షకులచే అనిపించుకుంటుంది. 'రాము' చిత్రంలో ప్రతిభావంతంగా నటించి, ప్రేక్షకులను మరపించిన జమున, మళ్లీ జనరంజనీ పిక్చర్స్ 'చల్లని నీడ'లో తన నటనలోని ప్రత్యేకతని ప్రదర్శించింది. ఈమె యే పాత్రనయినా సహజంగా నటిస్తుంది. అతి అనేది యీమెకు తెలియదు. సుబ్బయ్యచౌదరి, చలపతిరావు నిర్మించిన యీ సాంఘిక చిత్రానికి దర్శకుడు తాతినేని రామారావు, సంగీతాన్ని చలపతిరావు నిర్వహించారు. చిత్రంలోని మిగతా ముఖ్య పాత్రలను హరనాథ్, గుమ్మడి, అంజలి, ప్రభాకరరెడ్డి, రేలంగి, సూర్యకాంతం, రాజబాబు పోషించారు. మాటలను రావికొండలరావు, పాటలను నారాయణరెడ్డి, దాశరథి, కొసరాజు, కెమెరాను ఎం. కె. రాజు, కళను గోఖలే, కూర్పును కృష్ణస్వామి నిర్వహించిన యీ చిత్రం జూన్ 28 న రాయల్ ఫిలిమ్స్‌వారు విడుదల చేస్తారు.

* * *

అన్యోన్యంగా మెలుగుతూ, అపూర్వ సహోదరులుగా వినుతికెక్కిన లాల్ సోదరులు కారణాంతరాలచేత విడిపోయారు. అందుకే యిప్పుడు ప్రతిమా ఫిలిం ప్రొడక్షన్ కెమెరామెన్‌గా శ్రీ కె. ఎస్. ప్రసాద్ నియమించబడ్డారు. శ్రీ ఎస్. డి. లాల్ జూన్ 16 న సిని క్రాఫ్ట్స్ గోడౌన్ లోను, 17 న మౌంట్‌రోడ్డు బాటా షాపులోను, 18 న పాండిచ్చేరి హార్బరులోనూ కొన్ని ముఖ్య సన్నివేశాలను చిత్రీకరించారు. జూన్ 20 నుండి విజయా స్టుడియోలో పద్మశ్రీ రామారావు, షీలాకు సంబంధించిన షాట్లను ఎస్. డి. లాల్ షూట్‌చేసారు. ఇప్పటికి పదిరీళ్ల చిత్రం తయారైంది. ఎన్. టి. రామారావు, షీలా, రాజనాల, సత్యనారాయణ, ధూళిపాళ, అర్జా జనార్జనరావు, శాంతకుమారి, జయకృష్ణ ముఖ్య పాత్రలని పోషించే యీ చిత్రానికి శ్రీమణిలత సంభాషణలను రాశారు. టి. వి. రాజు సంగీతాన్ని అందిస్తున్నారు.

* * *

కొత్తదనాన్ని అపేక్షించే ప్రేక్షకులకు కల్చరల్ అర్ట్స్ అనే నూతన చిత్రనిర్మాణ సంస్థ 'జీవితాలు' అనెడి సమస్యాత్మక సాంఘిక చిత్రాన్ని కొత్తనటీ, నటులతో, కొంగ్రొత్త పోకడల్లో నిర్మించారు. నాటక రంగంలో విశేషానుభవం గడించిన వేణు చిత్రకథను సంభాషణలను వ్రాసారు. ముఖ్య పాత్రలను ఆనంద్, యమున, గూడపాటి సావిత్రి మొదలగువారు పోషించారు. నేటి సమాజంలో యేర్పడుతున్న వైషమ్యాలను యెలా పరిష్కరించాలి అనే యితివృత్తం యీ చిత్రకథలో ముఖ్యాంశం.

* * *

విలన్ రాజనాలకు హైదరాబాదులో మోతీమహల్ అనెడి నవనాగరిక భవనం వుంది. అక్కడికి అంజలీదేవి, శోభన్‌బాబు, పద్మనాభం, గీతాంజలి వస్తారు. రాజనాల తన మేనేజర్ సురేన్‌బాబుతో అతిథులకు తన ప్రత్యేకగదిని విడిదిగా యేర్పాటు చెయ్యమంటాడు. రాజనాలకు యిల్లు కూడ లేదని మీరే వ్రాసారుగదా! మరి అమాంతంగా భవంతి యెలా వచ్చిందని మీరడుగుతారని తెలుసు. రాజనాలకు యిలాంటి మేడ చిన్ని బ్రదర్స్ 'కుంకుమ భరిణ' లో వుందని మీకు చెప్పదల్చుకున్నా. అక్కడికి అంజలి, శోభన్, పద్మనాభం, గీతాంజలి యెందుకువచ్చారో చిత్రంచూస్తే మీకే తెలుస్తుంది. సస్పెన్స్ అడుగడుగునా వుంటూ మిమ్మల్ని తికమక పెట్టగల సన్నివేశాలు చాలావున్న యీ చిత్రం సెప్టెంబరులో విడుదల కాగలదని అనుకుంటున్నారు. వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో చాలాకాలం తర్వాత ఒక సాంఘికాన్ని చూడబోతున్నాం. శ్రీ ఆదినారాయణరావుకు అస్వస్థతగా వున్నా, చిత్రంయొక్క సంగీతశాఖను సవ్యంగా నిర్వహిస్తున్నారు. కాంతారావు, రంగారావు, గుమ్మడి (గెస్టు) శోభన్ బాబు, అంజలీదేవి, రాజశ్రీ, పద్మనాభం, గీతాంజలి ప్రధానపాత్రలను పోషిస్తున్నారు.



విజయవాడ వాస్తవ్యులు శ్రీ నిమ్మగడ్డ వెంకటకృష్ణారావు కుమారుడు చి. రామప్రసాద్‌కి ప. గో. జిల్లా పెదపాడు వాస్తవ్యులు శ్రీ కాకరాల అప్పయ్య జ్యేష్ట కుమార్తె చి. సౌ॥ సాయి శ్యామలాదేవికీ యిటీవల ఏలూరు కేసరి పిక్చర్ ప్యాలెస్‌లో వైభవంగా వివాహం జరిగింది.

పరిచయం:



కాస్ట్యూమ్ మేకర్

బి. నారాయణరావు

ప్రతిభా సంస్థలో పదునాల్గు సంవత్సరాల అనుభవం గడించి, నటీ, నటుల ఆకారాకృతుల కనుగుణ్యంగా దుస్తులను తయారు చేస్తూ, ప్రేక్షకులకు తెరపై కన్పించే తారలపై మోజు కల్గించే రీతిగా దుస్తుల నలంకరిస్తూ, చిత్రచిత్రానికీ కాస్ట్యూమ్‌లో యేదేని ప్రత్యేకతను కనబర్చే బి. నారాయణరావు ప్రముఖ నిర్మాత ఎస్. భావనారాయణను ఆ జన్మాంతం మరువలే నంటాడు. ప్రతిభా సంస్థ వదలిన తర్వాత భావనారాయణ గారు తమ్ము వారి అన్ని చిత్రాలకు కాస్ట్యూమ్సు తయారీని నాకు అప్పగించి, నాచే చక్కటి దుస్తులను కుట్టించి, పరిశ్రమలో నా వృత్తిపై గౌరవాన్ని యేర్పరచడానికి సహకరించి నన్నొక ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్‌గా తీర్చి దిద్దారని, ఆ తర్వాత విశ్వశాంతి అధినేత విశ్వేశ్వరరావు తన్ను ప్రోత్సాహిస్తున్నారని, చెప్పే నారాయణరావు సూక్ష్మంలో మోక్షం చూపించగల వ్యక్తి. గత యిరవై సంవత్సరాల శ్రమకు ఫలితంగా యీ మధ్యనే తన సంపాదించిన డబ్బుతో నాగార్జునగర్‌లో ఒక యింటికి స్వంతదారు డయ్యాడు.

సినిషా

నడమంత్రపుసిరి

నాగభూషణం పల్లెటూరు బైతుగా వుండేవాడు. అతనికి నడమంత్రపుసిరి వచ్చి పడింది. డబ్బు తగలగానే హైద్రాబాదుకు వెళ్తాడు. అక్కడ రాజనాలతో పరిచయం యేర్పడుతుంది. ఒక వన్నెల విసనకర్ర వలలో పడ్తాడు. వేష, భాషలన్నీ మారి పోతాయి జుట్టుతో వెళ్ళినవాడు క్రాఫ్‌తో యింటికి వస్తాడు. పంచెతో పోయినవాడు సూటు, బూటులో వస్తాడు. అంతేకాదు ఆ మాయలాడిని పెండ్లాడానికి నిశ్చయించి యింట్లో వుండేవాళ్లను బయటికి పొమ్మంటాడు. ఈ విచిత్రమయిన సన్నివేశం నవజ్యోతి పిక్చర్స్‌కు గాను వాహిని 7 ఫ్లోర్‌లో దర్శకులు తాతినేని రామారావు జూన్ 26న చిత్రీకరించారు. ఈచిత్రంలో సూర్యకాంతం నాగభూషణం ప్రేయసీ ప్రియులుగా ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తుతారు. ఈ చిత్రంలో నాగభూషణం కుమార్తెగా విజయనిర్మల, ఆమె ప్రియుడిగా హరనాథ్, కుమారుడిగా సత్యనారాయణ, కోడలిగా అనురాధ నటిస్తున్నారు. ప్రముఖ నృత్యకళా కోవిదురాలిగా విజయలలిత, ఆవిడను ఆరాధించే అర్చకుడిగా రాజబాబు నటిస్తున్నారు. వి. ఎస్. ఆర్. స్వామి చిత్రం యొక్క ప్రతి అడుగును చక్కటి కోణాల్లో చిత్రీకరిస్తున్నారు. చలపతిరావు మనస్సుకు చల్లదనాన్ని కల్గించే సంగీతాన్ని విన్పిస్తున్నారు. రాయల్ ఫిలింస్ విడుదలచేసే యీ చిత్రాన్ని వందనం, సాంబశివరావులు నిర్మిస్తున్నారు.

వేషంతో రోజంతా తమాషా

కాంతరావు బ్రాహ్మడివేషం ధరిస్తే చాలు, ఆయనకి ఆరోజంతా తమాషాగా గడచిపోతుంది. సెట్టంతా నవ్వులతో నిండిపోతుంది. ఇది మీకెలా తెలుసని అడుగుతారా! మొన్నిమధ్య గోల్డెన్ స్టుడియోకెళ్ళాను. అక్కడ కాంతారావును పిలక, చేతిలో కర్ర, మెడలో రుద్రాక్షమాల ధరించి వుండడాన్ని చూచి ముక్కుమీద వేలు వేసుకున్నాను. అచ్చంగా సద్బ్రాహ్మణుడెలా వుంటాడో, యెలా మాట్లాడుతాడో కాంతారావును చూస్తే అర్థమయింది. ఈవిధంగా బ్రాహ్మణుని వేషంతోవచ్చి మీకు నవ్వడానికి గౌరి ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న చిత్రంలో కాంతారావు ప్రయత్నిస్తున్నారు పాలగుమ్మి పద్మరాజు రచన సాగించిన యీ జానపద చిత్రంలో రాజశ్రీ, జయంతి, కాంతారావు, సత్యనారాయణ, ధూళిపాళ, రాజబాబు ముఖ్యపాత్రలను పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాత ఎస్. భావనారాయణ యీ చిత్రానికి దర్శకత్వం వహించడం ఒక ప్రత్యేకత. అనేకనేక డబ్బింగు చిత్రాలకు సంగీత సారధిగా వ్యవహరించిన అప్పలరాజు ఎ. ఎ. రాజ్ పేరుతో యీ చిత్రంలో సంగీతాన్ని విన్పిస్తున్నారు.'

కొత్తపాత్ర

కాంతారావు, రాజనాలగార్లను బద్ధ విరోధులుగా తెరపై చూడడం మనకలవాటు. చూచి, చూచి ప్రేక్షకులకు కొస్త విసుగనిపిస్తుందేమోనని యీమధ్య దర్శక, నిర్మాతలు వీరిద్దరికి విభిన్నమయిన పాత్రల నిస్తున్నారు. ఇలా యిచ్చినవారిలో రాజు పిక్చర్స్, అంబికా ఫిలింస్‌ముఖ్యులు. 'రాజయోగం'లో రాజనాల, కాంతారావు తండ్రీ, కొడుకులుగా నటిస్తే, అంబికా ఫిలింస్‌లో అన్నదమ్ములుగా కన్పడుతున్నారు. 'మాకు

మీకు తెలుసా?

ప్రముఖ నటుడు శ్రీ రాజనాలకు బస్కీలు, దండాలు తియ్యడమంటే మహా సరదా.

ప్రముఖ నటి కృష్ణకుమారికి కన్నడం, మలయాళం, అరవం, తెలుగు, యింగ్లీషు భాషలను వ్రాయడం, చదవడం తెలుసు.

శ్రీమతి షావుకారు జానకికి షేక్స్పియర్ నాటకాలంటే చాలా యిష్టం.

నటుడు రామదాసుకు స్టేజి నాటకాలాడడం ఒక హాబి.

నటుడు ఎన్. టి. రామారావు ప్రతి దినం మధ్యాహ్నం ఒంటిగంటకు తమ అభిమానులతో ముచ్చటిస్తుంటారు.

సంగీత దర్శకుడు హనుమంతరావు ప్రముఖ సంగీత నిర్దేశకు డయిన సాలూరి రాజేశ్వరరావుకు సోదరుడు.

మంచిరోజు లొచ్చాయ్' చిత్రంలో రాజనాల చట్టానికి కట్టుబడ్డ పోలీసు ఇన్‌స్పెక్టరుగా, బాధ్యత తెలిసిన అన్నగా కాంతారావు సరసన కొత్తతరహా భూమిక ను నిర్వహిస్తున్నారు. ఈ పాత్ర పోషణకు రాజనాల నిండయిన విగ్రహం యెంతో తోడ్పడుతుంది. ఈ పాత్రలో రాజనాల నిగ్రహంతో కూడిన నటనను ప్రదర్శిస్తున్నారు. కాంతారావు, సత్యనారాయణ, ధూళిపాళ, రమణారెడ్డి, రాజబాబు, కృష్ణకుమారి, గీతాంజలి, సూర్యకాంతం ప్రధాన పాత్రలను ధరించిన ఇూ వినూత్న కథా సంవిధానంగల సాంఘిక చిత్రంలో శ్రీధర్, కోటేశ్వరరావు, సంతోష్‌కుమార్, సలీమా అనే నూతన నటీనటులు ముఖ్య భూమికల్లో కన్నడి చక్కటి నటనను అగుపరుస్తున్నారు. ఈ చిత్రంయొక్క రచనను రాజశ్రీ, ఛాయను బి. డి. మాథూర్, సంగీతాన్ని హనుమంతరావు నిర్వహిస్తున్నారు. ఈచిత్రానికి పి. ఆర్. కౌండిన్య దర్శకుడు.

*　　　*　　　*

'పల్లెటూరి పిల్ల', 'భీష్మ'. 'చెంచులక్ష్మి',లాంటి విజయవంతమయిన చిత్రాలను నిర్మించిన దర్శక నిర్మాత బి. ఎ. సుబ్బారావువద్ద దర్శకత్వ శాఖలో శిక్షితుడయిన కౌండిన్య చిత్రం ప్రారంభించి మూడు సంవత్సరాలయింది. అనేక వ్యయ ప్రయాసలకోర్చి నిర్మాతగా, దర్శకుడిగా ఇూ చిత్రంద్వారా ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొనడానికి వలసిన సరంజామాను 'మాకు మంచిరోజు లొచ్చాయ్' ద్వారా అందించి, ముమ్ముందు వరుసగా చిత్రాలను నిర్మించాలని ఆశిస్తున్నాడు.

*　　　*　　　*

గత ఆదివారం యెక్కడా తెలుగు షూటింగులు లేకపోవడంవల్ల, కొన్ని చిత్ర నిర్మాణ సంస్థల కెళ్ళాను. ఆయా నిర్మాతలిచ్చిన వివరాల్ని మీ ముందు పెడ్తున్నా.

విజయ అండ్‌సురేష్ కంబైన్స్ నిర్మించనున్న సాంఘిక చిత్రంలో శ్రీ ఎన్.టి.ఆర్. ద్విపాత్రాభినయం చేస్తారు. శ్రీ డి. వి. ఎస్. రాజు నిర్మించే జానపదం, లక్ష్మీనారాయణ జానపదం, తారకరామ పిక్చర్స్ నిర్మించే సాంఘికంలో ద్విపాత్రాభినయం, గోపాలకృష్ణ సాంఘికం, గౌతమీ జానపదం, సి.ఎస్. రాజు సాంఘికం, ప్రతిమా ఫిలింస్, విశాల్ కంబైన్స్, శేఖర్ ఫిలింస్, సిరి ఆర్ట్సు, పద్మగౌరి, ఎస్. వి. ఎస్. ఫిలింస్, ఎస్. ఎ. టి. అండ్ రామకృష్ణ కంబైన్స్ సంస్థల్లో శ్రీ రామారావే కథానాయకుడిగా వుండగలరు. నాయిక పాత్రలను జయలలిత, కాంచన, భారతి, కృష్ణకుమారి ధరిస్తున్నారు. ఈ సంస్థ యొక్క షూటింగు కార్యక్రమాలు అగస్టు నుండి చురుకుగా సాగుతాయి.

—శ్రీనివాస్

ఆటలు

క్రీడా సంస్థలకి స్వేచ్ఛ అవసరం



ఆటలకి గ్రాంట్స్ మంజూరు చేయడంలో ముఖ్యపాత్రని నిర్వహించే కేంద్ర ప్రభుత్వం ఆ విషయంలో రానురానుఎక్కువఆసక్తిని ప్రదర్శిస్తున్నది. అయినా గ్రాంట్‌లను తీసుకునే క్రీడాసంస్థల విషయంలో మాత్రం కఠినంగా ప్రవర్తిస్తున్నది.ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ స్పోర్ట్సు దృక్పథాన్ని విమర్శిస్తూ 7—6—68 సంచికలో రాశాను. ఈకౌన్సిల్ కార్యనిర్వాహలుగా యువతరాన్ని ఉంచడంపై నొక్కి చెప్తున్నది. అంతేకాకుండా అనేక కార్యాలయాలుగల కార్యనిర్వాహకుల విషయంతో వ్యతిరేకంగా ఉంది. కేంద్ర విద్యాశాఖ ఈ కౌన్సిల్ సిఫార్సుల్ని ఆమోదించింది. ఆ విషయాన్ని చర్చిస్తాను.

అనేక కార్యాలయాలు గల కార్యనిర్వాహకుల విషయంలో కౌన్సిల్ సూచలనని అంగీకరించని క్రీడాసంస్థలకి ప్రభుత్వం గ్రాంట్‌లని మంజూరు చేయదు. అలాగే సమావేశాలు, అకౌంట్స్‌కి సంబంధించిన కఠినమైన నిబంధనలని ఉల్లంఘించినా గ్రాంట్స్ లభించవు. ప్రభుత్వం ఒకసంస్థకి గ్రాంట్‌ని మంజూరు చేస్తే ఆసంస్థ జమాఖర్చుల విషయం ప్రభుత్వం పట్టించుకోవలసిన అవసరం ఉందని నేనూ ఒప్పుకుంటాను. కాని ఎన్నో నిబంధనలని పెట్టడం, సంస్థ కార్యకలాపాలలో కలుగచేసుకోడం మంచిదికాదు.

ఇక కార్యనిర్వాహకులు విషయంలో అనుభవశాలులైన, ఒకటికంటె ఎక్కువ ఆటలతో సంబంధం ఉన్నట్టి కార్యనిర్వాహకులని ప్రభుత్వం విస్మరించకూడదు. అలాంటి బాధ్యతల్ని కలిగి ఉండటంవల్ల కార్యనిర్వాహకులకి ఏలాంటి లాభం ఉండదు. కాని క్రీడారంగానికి మాత్రం ఎంతో లాభకారులుగా ఉంటారు వారు. అందువల్ల వారిని స్థానభ్రంశం చేయడం మంచిది కాదు. కార్యనిర్వాహకులుగా ఎక్కువమందికి అవకాశం కలిగించినట్లు ప్రభుత్వం అనుకోడం ఎందుకో అర్థంకాదు. ఆ విషయాన్ని ఆయా సంస్థల సభ్యులకందరికీ వదిలేయాలి. అనేక కార్యాలయాలు ఉండకూడదనడం ఆయా సంస్థల స్వేచ్ఛకి అడ్డువస్తున్నట్లే అవుతుంది. ప్రభుత్వం ఈ విషయంలో పట్టుదలని ప్రదర్శించదని ఆశిస్తాను.


*　　　*　　　*

ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లకి జరిగిన రెండవ టెస్ట్‌పోటీలో వర్షంవల్ల చాలాకాలంవృధా అయింది. పోటీ డ్రాతో ముగిసింది. 31 సంవత్సరాలలో ఎప్పుడూలేని తక్కువ మొత్తానికి (78) ఆస్ట్రేలియా ఆట విరమింపజేశారు. ఇంగ్లండ్ 7కి 351 చేసింది. రెండోయిన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 4కి 123 చేయడానికి డ్రా అవడానికి పట్టుదలతో ఆడింది.

*　　　*　　　*

లండన్‌లో జరిగిన వింబుల్‌డన్ టోర్నమెంట్‌లో ఇండియా డేవిస్‌కప్ టెన్నిస్ ఆటగాళ్ళందరు మొదటి రౌండ్‌లోనే ఓడిపోయారు. ఈ పోటీలు వృత్తి క్రీడాకారులకి, ఔత్సాహికులకి కలిపి మొట్టమొదటిసారిగా నిర్వహింపబడ్తున్నవి. కృష్ణన్, ముఖర్జీలు గొంజాలెస్ హోడ్‌లపై మూడు సెట్‌లలో ఓడిపోయారు. ప్రేమ్‌జిత్‌లాల్‌ని ఎల్‌షెఫీ ఓడించాడు.

— కె ఎస్. నరసింహన్



Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.

ఓవల్‌టీను లో పుష్టికరమైన మాంసకృత్తులు, విటమినులు, ఫాస్ఫటైడులు, తాజా మీగడపాలు, ఇంకా పక్వమైన బార్లీనుంచి తయారు చేసిన మాల్టు ఉన్నాయి.

నిజానికి ఆరోగ్యం, దారుఢ్యం, శక్తి
పెంపొందాలంటే మీకివే కావాలి



ఓవల్‌టీన్‌లో ఆరోగ్యం, దారుఢ్యం, శక్తి వృద్ధి చేసే ముఖ్య వస్తువులన్నీ చేరి ఉన్నాయి. మీరు పాలలో ఓవల్‌టీన్ వేసినపుడు చక్కని రుచిని మించి దానిలో ఆరోగ్యం, దారుఢ్యం, శక్తి గూడా చేర్చుతున్నారు.

మధురమైన

ఓవల్‌టీను

తాగండి


పతిరోజు పతిరోజు పతిరోజు





ఓవల్‌టీన్ ఇండియాలో జగత్‌జిత్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తయారుచేస్తున్నారు. ఎ. వాన్‌డర్ లిమిటెడ్, లండన్ వారి లైసెన్సు క్రింద సోల్ డిస్ట్రిబ్యూటర్లు వోల్టాస్ లిమిటెడ్

ASP/J1/22/Tel


సర్వదా
సర్వోత్తమం
1st
★ అసమాన సౌరభ్యంలో
★ అనుపమ రుచిలో
★ కరకరలాడే తాజాదనంలో
★ సాటిలేని పుష్టికరంలో సర్వదా సర్వోత్తమం–
పార్లే గ్లూకో
బిస్కట్లు
PARLE BISCUITS Gluco
PARLE BISCUITS
PARLE Gluco BISCUITS
PARLE GLUCO BISCUITS
అందుకే పార్లే గ్లూకో భారత దేశంలో
అత్యధికంగా అమ్మకమగుచున్న బిస్కట్!